thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 208 కరీంనగర్ ఆదివారం, 5 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌తో కలిసి పనిచేస్తాం

బీజింగ్ : సరిహద్దుల వద్ద శాంతి, సుస్థిరత నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పనిచేసేందుకు తమ సైన్యం సిద్ధమని చైనా ప్రకటించింది. రెండు దేశాల సైనిక భవిష్యత్ సంబంధాలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఝూంగ్ జియావోగాంగ్ స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. అత్యంత పురాతన నాగరికతలు కలిగి ఉన్న ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాయన్నారు. ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.



# ఆయుధ విసర్జనకు మేం రెడీ..!

## -మల్లోజుల కు మద్దతు -బస్తర్ 5,10 బెటాలియన్ కమాండర్ల వెల్లడి

### -2011 నుంచి నష్టాలను ఎదుర్కొంటున్నాం - సాయుధ పోరుకు మైదాన ప్రాంతంలో సపోర్ట్ నిల్ - సుఖదేవ్,నిఖిల్,ప్రవక్తలు స్పష్టం

చురకలు ,తెలంగాణ చీఫ్ రిపోర్టర్:కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా మావోయిస్ట్ పార్టీ కిచెందిన బెటాలియన్ కమాండర్లు ఆయుధ విసర్జనకు మేం రెడీ అంటూ క్లారిటీ ఇచ్చారు.తమ పార్టీ నేత సోనూ చేసిన సాయుధ పోరాటాన్ని విరమించే ఆలోచనకు అనుకూలంగా స్పందిస్తూ నార్త్ బస్తర్ డివిజనల్ కమిటీ పక్షాన సుఖదేవ్ 5 వ బెటాలియన్ ప్రతినిధి 10 బెటాలియన్ కమాండర్ నికిల్, టెక్నికల్ ఆయుధ విభాగం ఇంచార్జ్ ప్రవక్తలు వేరువేరుగా శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. తేదీ-సెప్టెంబర్ 28, 2025 నాడు సుఖదేవ్ ,నికిల్ ప్రవక్తలు అనే మావోనేతలు వారు ఇచ్చిన సందేశం గురించి లోతుగా అధ్యయనం చేస్తే మావో నేత అభయ్ ఏసోనూ ఏమల్లోజుల వేణుగోపాల్ రావు తన సాయుధ విరమణకు సంబంధించి సంయుక్తం గా మద్దతు ప్రకటించారు.

అంటే వేణు ప్రతిపాదనలకు అనుగుణంగా దండకారణ్యం నుంచే అనుకూల కీలక ప్రాంతం సానుకూలత వ్యక్తం చేయడం విశేషం.సుఖదేవ్ సహా ఇతర ప్రముఖులు ఇచ్చిన సందేశం మేరకు మరింత మంది మావోలు బయటకు వస్తున్నారు.సుఖదేవ్ లేఖ,ప్రవక్తలు పంపిన లేఖలను అందిస్తున్నాం

**సాయుధ పోరాటాన్ని త్యజించాలనే నిర్ణయానికి మేము మద్దతు ఇస్తున్నాము!...** 2025 ఏప్రిల్-మేలో, మా డివిజన్‌లోని కామ్రేడ్‌లు మా సబ్-జోనల్ బ్యూరో ఇన్‌చార్జ్ కామ్రేడ్ రూపేష్ మరియు పార్టీ ప్రధాన కార్యదర్శి అమరవీరుడు కామ్రేడ్ నంబళ్ల కేశవరావు ప్రారంభించిన శాంతి ప్రక్రియకు పూర్తిగా మద్దతు ఇచ్చారు. అవసరమైతే ఆయుధాలను అప్పగించడం గురించి మా అభిప్రాయాన్ని కూడా వారికి తెలియజేశాము. ఆ రోజు మేము తీసుకున్న నిర్ణయంతో కామ్రేడ్ సోనుకు ఎటువం టి సంబంధం లేదని మేము మొదట ఇక్కడ స్పష్టం చేయాలనుకుం టున్నాము. ఇంతలో, కేంద్ర కమిటీ సభ్యుల మార్గదర్శకత్వంలో కొంతమంది %SJC% సభ్యులతో జరిగిన ప్రత్యేక %SJC% సమావే శం, మా నిర్ణయాన్ని ఖండిస్తూ మరియు ఈ అపార్థాన్ని సరిదిద్దుతూ తీర్మానాలను ఆమోదించింది. ఆ తీర్మానాలు మా డివిజన్‌లోని అందరు సభ్యులకు చేరకముందే, కామ్రేడ్‌లు అభయ్ మరియు వికల్ప్ పేరుతో ఒక సంయుక్త ప్రకటన జారీ చేయబడింది, కామ్రేడ్ సోను ఆయుధా లను జప్తు చేయాలని %PLGA%ని ఆదేశించింది. వాస్తవానికి, ఏప్రిల్-మేలో మేము తీసుకున్న నిర్ణయంతో కామ్రేడ్ సోనుకు ఎటువం టి సంబంధం లేదు. ఈరోజు వారి ఆయుధాలను జప్తు చేయడం అంటే వారితో ఏకీభవించిన వారందరి నుండి ఆయుధాలను జప్తు చేయడం. మొదట, ఈ శత్రు వైఖరిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. కాల్పుల విరమణ ప్రకటించాలనే నిర్ణయానికి మనమందరం ఎందుకు అంగీకరించాము? కనీసం మా నుండి వివరణ కూడా తీసుకోకుండా తీసుకున్న ఈ తొందరపాటు నిర్ణయం, తీవ్రమైన పోలీసు శోధన కార్యకలాపాల మధ్య ఇప్పటికీ ఆయుధాలు ధరించి అత్యంత అంకితభా వంతో పనిచేస్తున్న మా సహచరులందరి మనోభావాలను దెబ్బతీసింది. సెంట్రల్ కమిటీ మరియు SJC అధికారిక ప్రతినిధుల పేరుతో ఇటువంటి ప్రకటనలు జారీ చేయడం వల్ల, కామ్రేడ్‌ల పట్ల శత్రు


भारत की कम्युनिस्ट पार्टी (माओवादी)
पूर्वी रीजनल ब्यूरो
प्रेस विज्ञप्ति

[illegible]

వైఖరిని అవలంబించడం మరియు వారి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం వారిని ఉద్యమంలో నిమగ్నం చేయడానికి ప్రయత్నించడం కంటే చాలా ముఖ్యమైనదని స్పష్టం అవుతుంది. మేము దీనిని నిరసిస్తున్నాము. మా ఇద్దరు %CC% కామ్రేడ్‌లు ప్రజలు ఆయుధాలను సేకరించవచ్చని, కానీ ఆయుధాలు ప్రజలను సమీకరించవని బాగా తెలుసు. పార్టీ మరియు విప్లవ శిబిరంలోని **(మిగతా 3వ పేజీలో)**

## 'శక్తి' తుపాను: అక్టోబర్ 7 వరకు భారీ వర్షాలు




ముంబై, అక్టోబర్ 4 : ఈ ఏడాది దేశవ్యాప్తంగా వర్షాలు ఎక్కడా ఆగడం లేదు. విపరీత వర్షాలు ఎలాంటి అనర్థాలకు దారితీస్తాయో అనేంతలా ఉంది పరిస్థితి. భారత వాతావరణ శాఖ 'శక్తి'వంతమైన తుపాను గురించి సమాచారం అందించింది. దీనికి 'శక్తి' అని నామకరణం చేసి ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. మహారాష్ట్రలోని కొన్ని జిల్లాలకు'శక్తి' తుఫాను ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. నేటి నుంచి 7 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వార్నింగ్ ఇచ్చింది. ఈ తుఫాను ప్రభావంతో మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా నేటి నుంచి 7 వరకు కుండపోత వర్షాలుంటాయని తెలిపింది. ఈ తుపాను.. ఉత్తర తూర్పు అరేబియన్ సముద్రంలో ఏర్పడింది. ద్వారకకు 240 కి.మీ. దూరంలో దీని కేంద్రం ఉంది. ఇది తీవ్రమైన సైక్లోనిక్ స్టార్మ్‌గా మారే అవకాశం ఉంది. దీంతో గంటకు 45 కి.మీ. నుంచి 65 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. అంతేకాదు, ఇవి మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని కూడా వెల్లడించింది. ఉత్తర మహారాష్ట్ర తీరప్రాంతాల్లో సముద్రం చాలా అల్లకల్లోలంగా ఉంటుందని అక్టోబర్ 5 వరకు ఇది కొనసాగుతుందని వెల్లడించింది. ఫలితంగా ముంబై, థానే, పల్ఘర్, రాయ్‌గఢ్, రత్నాగిరి, సింధుదుర్గ్ వంటి తీరప్రాంత జిల్లాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని తెలిపింది. ఇక, అంతర్గత ప్రాంతాలైన ఈస్ట్ విదర్భ, మరాఠవాడా ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నార్త్ కొంకణ్‌లోని కొన్ని ప్రదేశాల్లో వరదలు కూడా రావచ్చని పేర్కొంది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లను యాక్టివేట్ చేయాలని, తీరప్రాంతాలు, ఇతర ప్రదేశాల్లో ఎవాక్యుయేషన్ ప్లాన్‌లు రూపొందించాలని జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం సూచించింది. తుపాను సమయంలో ప్రజలు సముద్రంలోకి వెళ్లకుండదని, భారీ వర్షాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ పేర్కొంది. మత్స్యకారులు 6వ తేదీ వరకు అరేబియా సముద్రంలోకి వెళ్లకూడదని IMD స్పష్టం చేసింది. ఈ తుఫాను ప్రధానంగా ఆఫ్‌షోర్(సముద్రం)లోనే ఉంటుందని, కానీ గుజరాత్, ఉత్తర మహారాష్ట్ర తీరాలపై కూడా ప్రభావం చూపిస్తుందని వెల్లడించింది.




## బీసీ రిజర్వేషన్లు.. సుప్రీంకోర్టుకు చేరిన పంచాయితీ

హైదరాబాద్ : తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. బీసీ రిజర్వేషన్లపై తాజాగా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం అంటూ వంగా గోపాల్ రెడ్డి ఇవాళ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను సుప్రీంకోర్టు ఎల్లుండి విచారించనుంది. మరో వైపు బీసీ రిజర్వేషన్లపై మాధవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై తెలంగాణ హైకోర్టు ఈ నెల 8వ తేదీన తిరిగి విచారణ జరపనుంది. ఎన్నికల కోసం షెడ్యూల్ రిలీజ్ అయిన నేపథ్యంలో ఓ వైపు హైకోర్టులో మరో వైపు సుప్రీంకోర్టుకు ఈ అంశం చేరడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. దీంతో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ ఇచ్చిన జీవో నంబర్ 9 విషయంలో హైకోర్టు, సుప్రింకోర్టులు ఏం చెప్పబోతున్నాయి? జీవో అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తాయా లేక బ్రేకులు వేస్తాయా అనేది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే హైకోర్టులో కేసు విచారణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహులు ఉత్కంఠతో ఉండగా తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్?తో పరిస్థితి మరింత ఉత్కంఠగా మారింది.

## స్థానికంపై కాంగ్రెస్ ఫుల్ ఫోకస్!




హైదరాబాద్ : తెలంగాణలో స్థానిక సంస్థలకు కాంగ్రెస్ సమాయత్తం అవుతోంది. అధికారంలో ఉండటంతో ఈ ఎన్నికల్లో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. 42 శాతం బీసీ రిజర్వేషన్లు...పథకాలు తమకు కలిసి వస్తాయని ఆ పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. అటు బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ నియోజక వర్గ ఇంఛార్జ్ లకు స్థానిక ఎన్నికల బాధ్యతలు కేటాయించింది. బీజేపీ ఈ సారి తమ సత్తా ఏంటో నిరూపిస్తామని చెబుతోంది. కాగా, కాంగ్రెస్ ముందుగానే అభ్యర్థుల ఖరారు పైన కీలక నిర్ణయం తీసుకుంది. పోటీ విషయంలోనూ స్పష్టత ఇస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలను సీఎం రేవంత్ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల ముందుగానే ఎన్నికల పైన పూర్తి కసరత్తు చేసారు. ఇప్పుడు పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యల పైన దిశా నిర్దేశం చేస్తున్నారు. ఈనెల 9వ తేదీన స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టారు. రేపు(ఆదివారం) సాయంత్రంలోగా ప్రతీ స్థానానికి ముగ్గురు అభ్యర్థుల చొప్పున సిఫారసు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశించారు. సీఎం ఆదేశాలతో జిల్లాల ఇంఛార్జ్ మంత్రులు వరుస సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు.. నియోజక వర్గ ఇంఛార్జ్ లతో మంత్రాంగం సాగిస్తున్నారు. అభ్యర్థుల ఖరారు పైన సామాజిక సమీకరణాలు.. రిజర్వేషన్ల ఆధారంగా ముగ్గురు చొప్పున ఎంపిక చేస్తున్నారు. అదే విధంగా జెట్పీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యతని కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ టీపీసీసీ కమిటీకి అప్పగించారు. కాగా, సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికని డీసీసీలకు అప్పగిస్తూ నిర్ణయించారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజక వర్గాల్లో అభ్యర్థుల ఎంపిక బాధ్యతను సెక్రటరీలకు అప్పగించారు రేవంత్. ఈ నేపథ్యంలో ఈనెల 8వ తేదీన అన్ని స్థానాలకు అభ్యర్థుల ప్రకటన చేయాలని టీపీసీసీ నిర్ణయించింది. ఈ నెల9న కోర్టు తీర్పు తరువాత తమ కార్యాచరణ వేగవంతం చేయాలని బీఆ ర్ఎస్, బీజేపీ నేతలు ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు మాత్రం కోర్టు తీర్పు సమయానికి అభ్యర్థుల ఖరారు తో పాటుగా పూర్తి స్థాయిలో ఎన్నికలకు సమాయత్తం కావాలని నిర్ణయించారు. దీంతో.. కాంగ్రెస్ తాజా నిర్ణయాలు ఎంత వరకు కలిసి వస్తాయనేది తేలాల్సి ఉంది.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో విచారణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇవాళ చేపట్టిన విచారణ ముగిసింది. విచారణలో భాగంగా పిటిషనర్ల తరఫున అడ్వకేట్లు.. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎదుట ఎమ్మెల్యేలు తమ వాదనలు వినిపించారు. ఇవాళ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్లో విచారణ కొనసాగింది. ఈనెల 1వ తేదీన జగరగాల్సిన విచారణ వాయిదా పడటంతో.. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు నేడు విచారణకు హాజరయ్యారు. బీఆర్ఎస్‌లో గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యలో సుప్రీకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గడువు విధించింది. ఈ మేరకు పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదంటూ వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులు వారు పార్టీ మారని వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. దీనిలో భాగంగా పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేల విచారణ కొనసాగుతోంది. ఈ మేరకు ఇవాళ ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలు విచారణకు హాజరయ్యారు. కాగా, ఎమ్మెల్యేల విచారణలు ముగిసిన అనంతరం స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారు అనేది చర్చనీయాంశంగా మారింది.




కొండాపూర్: హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగర్‌లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు ఎవరినీ అనుమతించలేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే బారికేడ్లను ఏర్పాటు చేసి స్థానికులను అడ్డుకున్నారు. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారు. ఈ విషయమై హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఆక్రమణల తొలగింపును చేపట్టింది. తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది.

సర్వే నంబర్ 59లోని ఈ భూముల విలువ రూ.3,600 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు 60 ఏళ్లుగా తమ అధీనంలో భూములున్నాయని రైతులు చెబుతున్నారు.




హైదరాబాద్: అమెరికాలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో తెలంగాణకు చెందిన విద్యార్థి మృతి చెందాడు. ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ 2023లో బీడీఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు.

ఇవాళ తెల్లవారుజామున డాలస్‌లో దుండగుడు జరిపిన కాల్పుల్లో చంద్రశేఖర్ మృతి చెందాడు. బీఎన్‌రెడ్డి నగర్‌లో ఉన్న బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మాజీమంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఉన్నత స్థానంలో ఉంటాడనుకున్న కుమారుడు ఇక లేడన్న విషయం తెలిసి తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన చూసి గుండె తరుక్కు పోతోందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి..** చంద్రశేఖర్ మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అతడి మరణం ఆవేదన కలిగించిందన్నారు.

మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడం ఖాయం: మంత్రి ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబరు4 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడం ఖాయమని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్ఘాటించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల మాదిరిగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అధికార కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల మాదిరిగా తమ ప్రభుత్వం పని చేస్తోందని వ్యాఖ్యానించారు. ఇవాళ(శనివారం) జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఎర్రగడ్డ డివిజన్‌లో రూ.2.16 లక్షలతో సీసీ రోడ్లకు, కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన చేశామని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. రూ.54 లక్షలతో మురుగు నీటి కాలువల పునరుద్ధరణకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు. దీని పక్కన ఉన్న స్థలంలో ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రేపటి నుంచి పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. వాకింగ్ ట్రాక్, పిల్లల గేమ్స్ ఆడుకోవడానికి, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్. హైదరాబాద్‌లో 60 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామని గుర్తుచేశారు. 200



యూనిట్ల ఉచిత విద్యుత్ , రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. కొంత మంది పిల్లలను తీసుకొచ్చి సానుభూతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్లు అడగాలని చూస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మాత్రమే ప్రజలు పట్టం కడతారని ఉద్ఘాటించారు. జూబ్లీహిల్స్‌ని అభివృద్ధి చేసే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్నారని నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక్కడ కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఆరు నెలల్లోపు టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలు పూర్తి చేయకపోతే ఉద్యమిస్తాం: హరీశ్‌రావు

హైదరాబాద్: గతంలో టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాన్ని కేసీఆర్ తలపెట్టారని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నిర్మాణ పనులను రేవంత్‌రెడ్డి సర్కార్ నత్తనడకన చేస్తోందని విమర్శించారు. కొత్తపేటలో టిమ్స్ భవనాలను పార్టీ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు. పనుల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడతూ.. తమ ప్రభుత్వం ఉండి ఉంటే.. ఇప్పటికే టిమ్స్ పూర్తయ్యేదని చెప్పారు.

రాజకీయాలను పక్కనపెట్టి కంటి వెలుగు కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారులో ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బకాయిలు పెట్టారని విమర్శించారు. కేసీఆర్ తీసుకొచ్చిన మంచి



పనులు ఆపాలనే ఆలోచనలో సీఎం ఉన్నారని దుయ్యబట్టారు. ఆరు నెలల్లోపు టిమ్స్ ఆసుపత్రి నిర్మాణాలు పూర్తి చేయాలని.. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## సికింద్రాబాద్‌లో అగ్నిప్రమాదం.. ఆరు దుకాణాలు దగ్ధం

కంటోన్మెంట్: సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధి లోతుకుంట వద్ద ఓ దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. లోతుకుంట ప్రధాన రహదారి పక్కనే ఉన్న సైకిల్ దుకాణంలో చెలరేగిన మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించడంతో అగ్నిప్రమాద తీవ్రత పెరిగింది. ఈ అగ్ని ప్రమాద ఘటనలో ఆరు దుకాణాలు దగ్ధం కాగా ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో ఘటన స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దుకాణాలలో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం సంభవించి ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించినట్లు అగ్నిమాపక అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.







## నాగార్జునసాగర్‌కు వరద ప్రవాహం.. 26 గేట్లు ఎత్తి నీటి విడుదల

నాగార్జున సాగర్: నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అధికారులు 26 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయానికి 2.70 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. ఔట్ ఫ్లో కూడా అంతే మొత్తంలో విడుదల చేస్తున్నారు. సాగర్ కుడి కాల్వకు 10,040 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 8,193 క్యూసెక్కులు, పవర్ హౌస్‌కు 33,291 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. స్పిల్ వే ద్వారా 2.16 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు.. కాగా ప్రస్తుతం 587.30 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 305.68 టీఎంసీలుగా నమోదైంది.




## దసరాకు 101 వంటకాలతో భోజనం.. చిన్న పొరపాటు జరగడంతో కొత్త అల్లుడికి తులం బంగారం

పండగకు ఇంటికొచ్చే కొత్త అల్లుడికి రాజమర్యాదలు చేయాలని అత్తమామలు అనుకోవడం సహజం. తెలంగాణకు చెందిన ఓ దంపతులు కూడా సరిగ్గా ఇలాగే అనుకున్నారు. దసరాకు ఇంటికొచ్చిన అల్లుడికి ఏకంగా 101 వంటకాలతో పసందైన భోజనం వడ్డించాలనుకున్నారు. ఈ క్రమంలో జరిగిన చిన్న ట్విస్ట్ కారణంగా అల్లుడికి వారు తులం బంగారం కూడా ఇచ్చుకోవాల్సి వచ్చింది. అద్భుతమైన ఆతిథ్యంతో పాటు బంగారం కూడా దక్కడంతో ఆ అల్లుడి ఆనందానికి అంతే లేకుండా పోయింది.

వనపర్తి జిల్లా కొత్తకోట పురపాలికలో ఈ ఘటన జరిగింది. స్థానికంగా ఉంటున్న గుంత సురేశ్, సహనల కుమార్తె సింధు వివాహం తిరుపతిలో జరిగింది. పెళ్లి తరువాత వచ్చిన దసరా తొలి పండగ కావడంతో అల్లుడు నిఖిత్‌ను ఇంటికి పిలిచారు. అతడికి తెలంగాణ సంప్రదాయ వంటకాలైన 30 రకాల పిండి వంటలు, 60 రకాల స్వీట్లు, అన్నంతో కలిపి భోజనాన్ని వడ్డించారు. ఇది చూసి నిఖిత్ కూడా ఆశ్చర్యపోయారు. అయితే, 101 రకాలలో ఒక్కటి తగ్గినా ఏమిస్తారని అత్తమామల్ని అతడు సరదాగా అడిగారు. ఒక్కటి తగ్గినా తులం బంగారం ఇస్తామని వారు ధీమాగా చెప్పారు.

ఈ క్రమంలో నిఖిత్ ఒకటికి రెండు సార్లు లెక్క పెట్టి చూడగా వంద వంటకాలే కనిపించాయి. దీంతో, అత్తమామలు అన్న మాట ప్రకారం తులం బంగారం అల్లుడికి ఇచ్చారు. జీవితంలో ఎన్నడూ మర్చిపోలేని ఆతిథ్యంతో పాటు ఇలా తులం బంగారం కూడా దక్కడంతో నిఖిత్ తెగ సంబరపడ్డారు.




## స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ ఫోకస్.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు..

హైదరాబాద్: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీలు తమతమ కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. ఈనెల 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుండగా.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టింది. ఈనెల 5లోగా ప్రతీ స్థానానికి ముగ్గురు పేర్లను ఇవ్వాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు.. పార్టీ నాయకులను ఆదేశించారు. జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత రాష్ట్ర కమిటీకే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత జిల్లా పార్టీ కోర్ కమిటీలకు అప్పగించనున్నారు. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కూడా సమయం దగ్గర పడుతుండటంతో.. అభ్యర్థి ఎంపికపై బీజేపీ కసరత్తు చేస్తోంది. దీని కోసం త్రి మెన్ కమిటీని బీజేపీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లో అభిప్రాయ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కమిటీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో మాజీ ఎమ్మెల్యే ధర్మరావు, మాజీ ఎంపీ రాములు, అడ్వకేట్ కోమల ఆంజనేయులుకు చోటు దక్కింది. ఈనెల 9వ తేదీన స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై అన్ని పార్టీలు ఫోకస్ పెట్టాయి.

## పేట్ బషీరాబాద్ కేసు... రిమాండ్‌కు విద్యార్థిని పెదనాన్న

హైదరాబాద్, అక్టోబర్ 4: నగరంలోని పేట్ బషీరాబాద్ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో మృతురాలి పెదనాన్న శ్రీనివాస్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఫైనాన్స్ వేధింపులతో పాటు, తమ పెద్దనాన్న శ్రీనివాస్ అప్పు తీర్చాలని వేధిస్తున్నాడని నిన్న (శుక్రవారం) ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆరు నెలల క్రితమే విద్యార్థిని తండ్రి మరణించాడు. తండ్రి చనిపోయిన తర్వాత 5 స్టార్ ఫైనాన్స్ వాళ్ళు అప్పు చెల్లించాలని పెదనాన్న మీద ఒత్తిడి తీసుకొచ్చారని.. దీంతో పెద్దనాన్న తమను డాక్యుమెంట్ల కోసం వేధిస్తున్నాడంటూ చనిపోయే ముందు మృతురాలు సూసైడ్ నోట్‌లో పేర్కొంది. 'రోజూ మా పరువు పోతుంది, అమ్మ ఒక్కతే ఇన్ని అప్పులు చెల్లించలేదు. అందుకే చనిపోతున్నా' అంటూ సూసైడ్ నోట్ రాసింది. లెటర్‌లో పెద్దనాన్నపై ఆరోపణలు చేయడంతో శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

## ఉక్రెయిన్‌లో ప్రయాణికుల రైలుపై రష్యా డ్రోన్ దాడి.. 30 మందికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్-రష్యా యుద్ధం అంతకంతకూ తీవ్రమవుతోంది. తాజాగా ఉక్రెయిన్‌లోని ఉత్తర సమీ ప్రాంతంలో రష్యా దళాలు డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ప్రయాణికుల రైలుపై బాంబులు పడటంతో పలు బోగాలు మంటల్లో కాలిపోగా, సుమారు 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. దీంతో హుటాహుటిన రెస్క్యూ టీమ్‌లు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ రష్యా చర్యపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 'సమీ ప్రాంతంలోని రైల్వేస్టేషన్‌పై రష్యా క్రూరమైన డ్రోన్ దాడి జరిపింది. అత్యవసర సర్వీసులన్నీ ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారి సమాచారం తెలుసుకుంటున్నాం. ఇంతవరకూ 30 మంది గాయపడినట్టు సమాచారం అందింది' అని ఆ ట్వీట్‌లో జెలెన్‌స్కీ పేర్కొన్నారు. సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని రష్యా దాడులు చేస్తోందని, ప్రతి రోజూ రష్యా ఎంతో మంది ప్రాణాలు తీస్తోందని జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యా ఉన్మాద చర్య పట్ల ప్రపంచం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించరాదని, యుద్ధ పరిష్కారం కోసం ఐరోపా, అమెరికా నుంచి ఎన్నో ప్రకటనలు వింటున్నప్పటికీ మాట సాయం సరిపోదని అన్నారు. బలమైన చర్యలు అవసరమని పేర్కొన్నారు. కాగా, రీజినల్ గవర్నల్ ఒలేహ్ హ్రిహెరోవ్ ప్రయాణికుల రైలుపై రష్యా దాడి ఘటనను ధ్రువీకరించారు. వైద్యులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలి వద్ద సహాయక చర్యలు చేపట్టినట్టు వెల్లడించారు. డ్రోన్ దాడిలో కాలిపోతున్న ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# ఆయుధ విసర్జనకు మేం రెడీ.!

**(మొదటి పేజీ తరువాయి)** అన్ని కామ్రేడ్‌లు ఆ ఇద్దరు CC కామ్రేడ్‌ల తప్పుడు వైఖరిని ఖండించాలని మరియు విప్లవాత్మక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి సరైన మార్గాన్ని అవలంబించాలని మా DVC కోరుతోంది.మా పీబీ సభ్యుడు, కామ్రేడ్ సోను, పార్టీ కార్యకర్తలకు పార్టీ అంతర్గత చర్చ కోసం 22 పేజీల విజ్ఞప్తిని జారీ చేశారు. ఆయన ప్రజలకు రెండవ విజ్ఞప్తిని జారీ చేశారు. ఈ రెండు విజ్ఞప్తిని మేము లోతుగా అధ్యయనం చేసాము. అంతకుముందు, ఏప్రిల్ మరియు మే నెలల్లో, శాంతి చర్చలు మరియు ఆయుధాలను అప్పగించడం గురించి కామ్రేడ్ రూపేష్‌కు మా అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేసాము. దీని దృష్ట్యా, కామ్రేడ్ సోను చేసిన విజ్ఞప్తితో మేము మా ఏకీభావాన్ని వ్యక్తం చేస్తున్నాము.గత దశాబ్దన్నర కాలంగా, దండకారణ్యంలో మన విప్లవ ఉద్యమం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది, ఆ తర్వాత తాత్కాలిక తిరోగమనం నెలకొంది. దక్షిణ మరియు పశ్చిమ బస్తర్‌లోని పరిమిత ప్రాంతం తప్ప, ఉద్యమంలోకి నియామకాలు చాలా తక్కువ. గత నాలుగు సంవత్సరాలుగా తమ నీరు, అడవి మరియు భూమి కోసం చట్టపరమైన పోరాటాలలో స్వచ్ఛందంగా పాల్గొన్న వేలాది మంది యువ సహచరులు విప్లవాత్మక ఉద్యమంలో చేరడానికి మరియు ఆయుధాలు చేపట్టడానికి ఇష్టపడరు. మా పార్టీ ఉన్నత నాయకత్వ కమిటీ దీనిని బలహీనతగా భావిస్తుంది, కానీ మూల కారణాలను లోతుగా పరిశీలించడంలో విఫలమవుతుంది. ప్రజల కోరికలు మరియు అంచనాలను అర్థం చేసుకోవడంలో మనం విఫలమవుతున్నందున మనం వారికి దూరంగా వెళ్తున్నాము. సమస్య ప్రజలు మనల్ని ఎంతగా ప్రేమిస్తున్నారనేది కాదు, మనం వారిని ఎంతగా బలోపేతం చేయగలిగాము.

మా ఉన్నత కమిటీలు దీనిని గ్రహించడం లేదు. స్థానిక సహచరులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను మరియు వాటిని ఎలా పరిష్కరించవచ్చో మనం ఖచ్చితంగా అర్థం చేసుకోలేకపోతున్నాము. పార్టీలోని మనమందరం ఈ సమస్యను ఎదుర్కొంటున్నాము. మొదట దీని అర్థం చేసుకుని, ఆపై సరైన పరిష్కారాన్ని కనుగొనాలని మేము ప్రతి ఒక్కరిని కోరుతున్నాము.గత సంవత్సరం జారీ చేయబడిన పొలిట్‌బ్యూరో సర్క్యులర్‌లో పార్టీ ప్రజల నుండి ఒంటరిగా ఉండటం, పిఎల్‌జిఎలో గిరిజన సభ్యులు మాత్రమే ఉండటం మరియు నగరాల్లో మరియు విశాలమైన మైదానాల్లో పార్టీ ఉనికి లేకపోవడం వంటి తీవ్రమైన లోపాలు ఉన్నాయి. అయితే, కేంద్ర కమిటీ మూల కారణాలపై సమగ్రమైన మరియు సమగ్రమైన సమీక్ష నిర్వహించలేదు. తత్ఫలితం గా, నేటికీ మేము ఆ సర్క్యులర్‌ను అమలు చేయలేకపోతున్నాము.తన 22 పేజీల విజ్ఞప్తిలో, పార్టీ వైఫల్యాలకు కారణం అండర్‌గ్రౌండ్ పార్టీకి గుండెకాయగా పనిచేయకపోవడం, రాష్ట్ర యంత్రాంగం బలాన్ని తక్కువగా అంచనా వేయడం, మన సామర్థ్యాలకు మించిన సైనిక పనులను చేపట్టడం, ప్రజలు ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్యలపై బహిరంగ మరియు చట్టపరమైన పోరాటాలను వ్యతిరేకించడం అని కామ్రేడ్ సోను తన 22 పేజీల విజ్ఞప్తిలో గుర్తించారు. మారుతున్న ప్రపంచ మరియు జాతీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ తన వ్యూహాన్ని మరియు వ్యూహాలను మార్చుకోవడంలో విఫలమైందని కూడా కామ్రేడ్ సోను విజ్ఞప్తిలో వివరించారు. ఈ నాలుగు సమస్యలు విప్లవాత్మక వైఫల్యాలకు దారితీశాయి. ఉద్యమం ఓటమిని చవిచూసి ఓటమి అంచుకు చేరుకుందనే విషయం కూడా స్పష్టంగా చెప్పబడింది. ఆయన విజ్ఞప్తిలో హైలైట్ చేసిన అన్ని అంశాలు మన దండకారణ్య ప్రాంతానికి మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆందోళన ప్రాంతాలకు వర్తిస్తాయి. ఫలితంగా, మన విప్లవాత్మక ఉద్యమం ప్రతి ప్రాంతంలోనూ పరాజయాలను చవిచూస్తోంది. ఈ రోజు ఎవరూ దీనిని తిరస్కరించరు. సైనిక చర్యను భాగాన్ని మాత్రమే నిందించడం కేవలం మన వైఫల్యాలను దాచిపెట్టే ప్రయత్నం. కాబట్టి, కామ్రేడ్స్, మా పిబి సభ్యుడు కామ్రేడ్ సోను తీసుకున్న నిర్ణయానికి మద్దతు ఇవ్వాలని మీ అందరినీ మేము అభ్యర్థిస్తున్నాము.మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన మార్గాన్ని మెరుగుపరుచుకుంటే, అది విప్లవ పురోగతిలో ప్రతిబింబించేది. దేశంలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ విప్లవాత్మక ఉద్యమం బలమైన ప్రజా స్థావరాన్ని నిర్మించలేకపోయింది.

ఫలితంగా, మన ఉద్యమం తాత్కాలికంగా ఎదురుదెబ్బను ఎదుర్కొంటోంది. ఇప్పుడు, దండకారణ్యంలో ఉద్యమం కూడా ఉద్యమం తన మార్గాన్ని సరైన దిశలో మెరుగుపరచడంలో విఫలమైందనే వాస్తవాన్ని గుర్తించామని మరియు మార్పులకు ప్రతిస్పందనగా సరైన వ్యూహాలను అవలంబించామని మనల్ని బలవంతం చేస్తోంది.పైన పేర్కొన్న పరిస్థితులలో, మా విభాగం మరియు కంపెనీ 5తో సహా అన్ని విభాగ సహచరులు కామ్రేడ్ సోను అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నారు మరియు సాయుధ పోరాటంలో తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటనకు మద్దతు ఇస్తున్నారు.విప్లవ శుభాకాంక్షలతో సుఖదేవ్ కొడో, ప్రతినిధి,నార్త్ బస్తర్ డివిజనల్ కమిటీ.కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్)


# అలుపెరుగని కమ్యునిస్టు పోరాట యోధుడు మృత్యుం జయుడు

## - అక్టోబర్ 5...పేరేప మృత్యుంజయుని జయంతి



యజుర్వేద శాఖీయులు అయిన పేరేప వంశజులు శ్రీకాకుళానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేప గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నిక గన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి జయంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 – మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933– 34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు. 1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు. 1936 లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు. 1941–42 ప్రాంతంలో యంవియన్ కపర్దీని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. 1937–39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940–42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60– 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుంజయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు...వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940–42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు. 1944 – 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి, ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు. నెక్కల పూడి సుబ్బాయమ్మతో కలిసి "అన్నా చెల్లెలు" పాట (బెంగాలులో కరువుకు సం బంధించి) వేదికల మీద పాడే వారు. "చావుకు వెరవ కురా" అన్న పాట వేదికల నుంచి గంభీర స్వరంతో పాడడమే కాక, తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ చెప్పేవారు. నిజంగా జీవితంలో కూడా ఆయన "చావుకి వెరవని" వ్యక్తి. 1945–46లో పాల కొల్లులో మునిసిపల్ కార్మికుల సమ్మె జయప్రదంగా జరగతంలో ఆయన పాత్ర ఉంది. 1946లోనే సాధారణ ఎన్నికలు జరిగిన క్రమంలో, పార్టీ అభ్యర్థి తరఫున పోలింగు ఏజెంటుగా మోటారు సైకిలు మీద నరసాపురం అసెంబ్లీ నియో జకవర్గం అంతా తిరిగారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య తెలంగాణ పోరాటానికి సహాయం కూడగట్టడానికి వెళ్ళిన సందరంగంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత, పి.సి.జోషి, పి.సుందరయ్యలు ప్రత్యేకంగా ఆయనతో చర్చలు జరిపారు. అంతకుముందు "ప్రజాశక్తి" వార పత్రిక, ద్వైవార పత్రికానున్న సందర్భంగా విరాళాలకి ప్రకటన వచ్చింది. ఆయన తనకి పెళ్లికి అత్తవారిచ్చిన వెండి మరచెంబు, కంచం అమ్మి పంపించారు. 1946లోనే మళ్లీ రహస్య జీవితం మొదలయింది. 1948లో గాంధీజీ హత్య తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం జరిగింది. విజయవాడలో కమ్యూనిస్టు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగగా, అరెస్టు అయి కైకలూరు సబ్ జైలులో దాదాపు 3 నెలలున్నాక తప్పించుకొని మళ్ళీ రహస్య జీవితంలోకి వెళ్లారు. 1948లో పోలీసు చర్య తర్వాత తెలంగాణ లోనే కాక వెన్నుదన్నుగా వున్న కోస్తా ఆంధ్ర జిల్లాలలోనూ కమ్యూనిస్టు శ్రేణులు ఆత్మరక్షణ చేసుకొనే స్థితిలో పడ్డాయి. పార్టీ ఆదేశం ప్రకారం కామ్రేడ్స్ ఇతర ప్రాంతాలకి తరలి వెళ్లారు. మృత్యుంజయుడు, సంకు అప్పారావు, మరి కొందరు, ఒరిస్సా వెళ్లేందుకు రాజమండ్రిలో ఒక రహస్య స్థావరానికి చేరారు. ఇంతలో స్థావరం యిచ్చిన వ్యక్తి ప్రభుత్వం యిచ్చే పారితోషికానికి ఆశపడి పోలీసులకి ఆచూకీ యిచ్చాడు. సుందరయ్య 'వీర తెలంగాణ విప్లవ పోరాటం– గుణపాఠాలు" ప్రకారం మిగతా వారిని పంపించి ఆయన ఖమ్మం ప్రాంతంలో పోరాట శ్రేణుల్లో చేరవలసి వచ్చింది. పట్టుబడిన వారందరూ చిత్ర హింసలకి గురయ్యారు. మృత్యుం జయుడు పట్టుబడిన కబురు తెలిసి అందరూ స్థావరం మార్చుకున్నారు."మా స్థావరం ఆయనకు తెలుసు, వచ్చి మమల్ని కలుసుకోవలసి వుంది. ఆయన ఆ బాధలు భరించినందువల్ల మే బతికిపోయాం" అని రాజేశ్వరరావు, సుందరయ్య చెప్పేవారు. 1950 మే 16 బొమ్మూ రు మొట్ట దగ్గర చనిపోయినట్లు పత్రికల సమాచారం ఇచ్చాయి. కాల్చిన యస్.ఐ తనికెల సుబ్బారావు రిటైరైన తర్వాత... ఫొటోగ్రాఫర్ భూషణ్‌ను కలిసి, కానిస్టేబుళ్ళు మృత్యుంజయుని కాల్చడానికి నిరాకరించగా తాను కాల్చవలసి వచ్చిందని, ఆఖరి గుండు పేల్చే వరకూ ఆయన జయజయ నినాదాలు చేస్తూ నిలబడి వున్నారని చెప్పినట్లు సమాచారం. అప్పటి సహచరులు, కొరియరులు ఎందరో తమ పిల్లలకు మృత్యుంజయుడు అని పేరు పెట్టు కున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర రిక్షా కార్మికులు తమ కాలనీకి మృత్యుంజయ నగర్ అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపు రంలో "మృత్యుంజయ నగర్ కాలనీ", గ్రంధాలయం ఏర్పడ్డాయి. **రామ కిష్టయ్య సంగన భట్లబీ సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# విద్యా హక్కు పరి రక్షణ అందరి బాధ్యత - అక్టోబర్ 5... ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం




ఏటా అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొనే సంప్రదాయం 1994లో ప్రారంభమైంది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం 5 అక్టోబర్, 1966 నాటిది. ఉపాధ్యాయులను మరియు వారి వృత్తిని ప్రభావితం చేసే సమస్యలను విశ్లేషించడానికి ఫ్రాన్స్‌లోని పారిస్ లోని ఉపాధ్యాయుల స్థితిగతులపై ప్రత్యేక ఇంటర్ గవర్నమెంటల్ సమావేశం ఏర్పాటు చేయబడింది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని అంతర్జాతీయంగా గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా జరుపు కోవాలని ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ (ఇఐ) (ప్రపంచవ్యాప్తంగా విద్యా నిపుణులను సూచించే గ్లోబల్ యూనియన్ ఫెడరేషన్) సూచించింది. 100 కి పైగా దేశాలు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాయి. ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ మరియు దాని 401 సభ్య సంస్థల ప్రయత్నాలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడానికి మరియు దాని గుర్తింపుకు దోహద పడ్డాయి. అక్టోబర్ 5 ప్రపంచ పిల్లలకు విద్యను అందించడంలో బోధనా వృత్తి చేసిన కృషిని గుర్తు చేస్తుంది. ఉపాధ్యాయ దినోత్సవం వాస్తవానికి మన జీవితంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న కష్టాలను, సవాళ్లను మరియు అసమానమైన పాత్రను గుర్తించే వేడుక భావి తరాలకు విద్యా ప్రణాళికలు ఎలా ఉండాలనే అంశంపై ఉపాధ్యాయుల మద్దతు కూడగట్టేందుకు విద్యాలయాలలో వేడుకగా దీన్ని నిర్వహిస్తున్నారు. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం ప్రధాన లక్ష్యం 'విశ్వ వ్యాప్తంగా ఉన్న విద్యా వేత్తలను ప్రశంసించడం వారి నైపుణ్యాలను అంచనావేయడం, వాటిని మెరుగు పరచడం'. బోధనకు సంబంధించిన సమస్యలను చర్చించు కోవడానికి దీన్ని ఒక అవకాశంగా పరిగణి స్తున్నారు. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యా యులను అధికంగా తయారు చేయలేక పోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యా యుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసు కుంటారు, ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23.8 కోట్ల మంది మనదేశం లోనే ఉన్నట్లు వెల్లడైంది. 'ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యునెస్కో అక్టోబర్ 5వ తేదీని 'వరల్డ్ టీచర్స్ డే'గా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రసిద్ధ గురువులు ఉన్నారు. న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వా మిత్రుడు, సాందీపుడు, పరశు రాముడు, ఆదిశంకరాచార్యులు, ద్రోణా చార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మన దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపు కుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా పదవీకాలం ముగియ గానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. యావత్ ప్రపంచానికి ఆయన గొప్ప సందేశాన్ని అందించారు. జ్ఞాన సముపార్జన గురువు బోధన వలనే సంపూర్ణంగా సిద్ధిస్తుంది. 'గు'శబ్దంధకారే స్యాత్/ 'రు'శబ్దంతి నిరోధతః, అంధకార నిరోధితం/ గురురీత్య బిదీయతే... అనే ఆర్యుల మాటలను పరికించి చూస్తే 'అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి జ్ఞానమనే కాంతులను వెలిగించే వారినే నిజమైన గురువులుగా భావించవచ్చు. నీతివంతమైన జీవనానికి అలవాటుపడే విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్ద గలగాలి. సమాజాలు మారొచ్చు, సిద్ధాంతాలు మారొచ్చు. కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య సంబంధం శాశ్వతమైనది. ఈ విషయాన్ని యువ ఉపాధ్యా యులు గుర్తుంచు కోవాలి. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సమాచారం అందివ్వడంతోనే ఉపాధ్యాయుడి పాత్ర ముగియదని నిజానికి ఉపాధ్యాయుడు రకరకాల నైపుణ్యాల్ని విద్యార్థులకు అందించ వలసి ఉంటుందని కొఠారి కమిషన్ పేర్కొంది. జాతి నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత కీలకపాత్ర పోషించేది గురువే అవుతాడు. అనేక మంది గురువులు విద్యార్థుల మదిలో ప్రముఖ స్థానాన్ని ఏర్పరుచు కున్నారు. ఇందుకు ఉదాహరణ లుగా శ్రీరాముడు– విశ్వామిత్రుడు, శ్రీకృష్ణుడు– సాందీపుడు, శివాజీ– సమర్థ రామదాసు, వివేకానంద– రామకృష్ణ పరమ హంసలను పేర్కొనవచ్చు. మాతృదేవోభవ– పితృదేవోభవ– ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టేవారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావి పౌరులను తీర్చిదిద్దు తున్నామనే భావన ఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారం గురువు. ఉపాధ్యాయులు తమ మేధో సంపత్తిని పెంపొందించు కోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహించాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషిచేయాలి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 'మార్చలేని గతాన్ని గురించి ఆలోచించవద్దు.. చేతిలోఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు' అనేవారు. ఉపాధ్యాయుడు తన బోధనా పద్ధతుల్ని పునః సమీక్షించుకొని తదనుగుణంగా విద్యార్థులను నవ సమాజానికి అందించాలి. ఒకప్పుడు గుమాస్తాలను తయారుచేసే విధంగా విద్యాలక్ష్యం వుండేది. నేడు సామాజిక ప్రాధాన్యతలు మారి పోయాయి. దేశానికి పరిశోధకులు కావాలి. వ్యక్తుల స్వభావాన్ని, సామర్థ్యాన్ని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ప్రవచించిన అబ్దుల్ కలాం పలుకులకు సార్థకత చేకూర్చాలి. నేటి యువ ఉపాధ్యాయులు అందుకు కంకణ బద్ధులై వృత్తిని నిబద్ధతతో నిర్వర్తించాలి. కోవిడ్ 19 మహమ్మారి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా విద్యావ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఊతమిస్తున్నది. ఇప్పుడు గతంలో కంటే, విద్యా హక్కును పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులతో కలిసి పనిచేయాలి. ఉపాధ్యాయ లోకం కానీ రిమోట్ లెర్నింగ్ అందించ డానికి, వెనక బడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వడానికి, పాఠశాలలను తిరిచునందున అభ్యాస అంతరాలను తగ్గించేలా ఉపాధ్యాయుల కృషి పరంగా ఇది చాలా కీలక సమయం. విద్య యొక్క భవిష్యత్తును మరియు బోధనా వృత్తిని రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యం. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సరే ఒకసారి ట్రంప్ ని పొగుడుదాం అని పొగిడిన మోడీ.. ట్రంప్ ఇగో సాటిస్ ఫై అయ్యిందా?



భారత్ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఒక ట్వీట్ ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. గాజాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను మోదీ బహిరంగంగా ప్రశంసించడం కేవలం ఒక మర్యాదపూర్వక చర్యగా చూడలేం. దీని వెనుక అనేక దౌత్యపరమైన, రాజకీయపరమైన వ్యూహాలు దాగి ఉన్నాయి. ఈ ప్రశంస ట్రంప్ ఇగోకు ఎంతవరకు 'పాజిటివ్ బూస్ట్' ఇచ్చిందో చూద్దాం. మోదీ గతంలోనే ట్రంప్‌తో వ్యక్తిగత, రాజకీయ సంబంధాలను బలోపేతం చేసుకున్నారు. "Howdy Modi" ఈవెంట్ నుంచి "Namaste Trump" వరకు ఈ ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఎప్పుడూ చర్చనీయాంశమే.

ఇప్పుడు ట్రంప్ తిరిగి అధ్యక్షుడిగా ఉన్న సందర్భంలో మధ్యప్రాచ్య శాంతి ప్రయత్నాలకు మద్దతు ప్రకటించడం ద్వారా, మోదీ ఈ ట్వీట్‌తో అమెరికాతో సాన్నిహిత్యాన్ని మరింత బలోపేతం చేయాలని సంకేతం ఇచ్చారు. ఇది ట్రంప్‌తో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని 'రీఫ్రెష్' చేసి, భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సత్సంబంధాలకు పునాది వేసినట్లు కనిపిస్తోంది.

**ట్రంప్ ఇగోకు 'పాజిటివ్ బూస్ట్'...** ట్రంప్ వ్యక్తిత్వంలో 'పబ్లిక్ ప్రైజ్' (బహిరంగ ప్రశంస) అంటే ప్రత్యేకమైన స్థానం ఉంటుంది.

మోదీ లాంటి గ్లోబల్ లీడర్ తన అత్యంత కీలకమైన శాంతి ప్రయత్నాలను ప్రశంసించటం ట్రంప్‌కు వ్యక్తిగత, రాజకీయంగా సంతృప్తినిస్తుంది. ముఖ్యంగా, అమెరికా అంతర్గత రాజకీయాల్లో తన శాంతి ప్రయత్నాలను 'గ్లోబల్ అప్రూవల్'గా చూపించు కోవడానికి ఇది ఆయనకు ఒక పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుంది. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాధినేత నా ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు' అని ట్రంప్ తమ మద్దతు దారులకు గట్టిగా చెప్పుకోగలుగుతారు. కాబట్టి, మోదీ చేసిన ప్రశంస ట్రంప్ ఇగోకు పూర్తిగా సంతృప్తినిచ్చిందనే చెప్పవచ్చు.

**అంతర్జాతీయ దౌత్యంలో భారత్ 'బ్యాలెన్సింగ్'...** భారతదేశం ఎప్పటిలాగే మధ్యప్రాచ్య అంశాల్లో సమతుల్య వైఖరినే పాటిస్తోంది. ఇజ్రాయెల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగిస్తూనే, పాలస్తీనా పట్ల మానవతా దృష్టితో మద్దతు ఇస్తుంది. మోదీ చేసిన వ్యాఖ్యల్లోనూ అదే ప్రతిబింబిస్తోంది. "ఇరువర్గాలకు సమ న్యాయం కలిగే ప్రయత్నాలకు మద్దతు" అని చెప్పడం దానికి ఉదాహరణ. ట్రంప్ ప్రణాళికను మెచ్చుకున్నప్పటికీ, భారత్ యొక్క అంతిమ లక్ష్యం మాత్రం శాశ్వతమైన, సమతుల్యమైన శాంతి అని స్పష్టం చేశారు. తద్వారా భారత్ తన బ్యాలెన్సింగ్ యాక్ట్‌ను విజయవంతంగా కొనసాగించినట్లైంది.

**భారత్ గ్లోబల్ పీస్ ఆర్కిటెక్ట్‌గా ఎదగాలనే సంకేతం...** మోదీ వ్యాఖ్యలు కేవలం ట్రంప్ ప్రశంస మాత్రమే కాదు. భారత్ ప్రపంచ శాంతి కృషిలో సక్రియ పాత్ర పోషిస్తోందని, గ్లోబల్ ప్లేయర్‌గా ఎదగాలనే ప్రయత్నంలో భాగమని కూడా చూడాలి. ఈ ట్వీట్‌తో భారత్ తనను తాను ఒక బాధ్యతాయుతమైన ప్రపంచ శక్తిగా ప్రకటించుకుంది. గాజా యుద్ధం తగ్గుముఖం పట్టే సంకేతాలు కనిపిస్తున్న తరుణంలో మోదీ సందేశం అంతర్జాతీయ వేదికపై భారత్ పాజిటివ్ రోల్ మోడల్‌గా నిలిచే ప్రయత్నంలో భాగం. మోదీ చేసిన ఈ 'ప్రశంసా ట్వీట్'లో అంతర్భాగం రాజకీయ వ్యూహం. ఒకవైపు ట్రంప్ ఇగోను తృప్తిపరుస్తూ, మరోవైపు గ్లోబల్ దౌత్యంలో భారత్ సంతులిత దృక్కోణాన్ని కొనసాగించారు. ఇది అమెరికా–భారత్ సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు, ప్రపంచ వేదికపై భారత్ పాత్రను విస్తరించేలా చేస్తుంది.

చురకలు

## సంపాదకీయం

### పీఓకేను భారత్ స్వాధీనం చేసుకుంటుందా ?

పీఓకేలో ఇపుడు మంటలు చెలరేగుతున్నాయి. అక్కడ నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. అదే సమయంలో పాక్ సైన్యం ఆ నిరసనలను నిర్ధాక్షిణ్యంగా అణచేస్తోంది. వెనక్కి తగ్గేది లేదని పీఓకేలో లో ఆందోళనకారులు స్పష్టం చేస్తున్నారు. ప్రాణాలు అయినా ఇస్తామని వారు తెగిస్తున్నారు. దాంతో పాక్ సైన్యం కూడా దూకుడు ప్రదర్శిస్తోంది. పీఓకేలో ప్రస్తుతం ఆరని చిచ్చుగా రగులుతోంది. హింసా కాండ ప్రబలిన నేపథ్యంలో పది మంది దాకా నిరసనకారులు మరణించారు అని అంటున్నారు

**భారత్ తీవ్ర స్పదన :** పీఓకేలో లో హింసా కాండ పాక్ సైన్యం దారుణంగా వ్యవహరిస్తున్న తీరు మీద భారత్ తీవ్రంగానే స్పందిస్తోంది. ఇంతకంటే క్రూరత్వం ఉండదని భారత్ మండిపడుతోంది. పీఓకేని ఆనాడు చట్ట విరుద్ధంగా ఆక్రమించుకున్న పాక్ అక్కడ వనరులను దోచుకుంటూ స్థానిక ప్రజల నోట్లో మట్టి కొడుతోదని భారత్ విమర్శిస్తోంది ఫలితంగానే పీఓకేలో లో ఇపుడు నిరసనలు వినిపిస్తున్నారని అంటోంది. అయినా సరే ఆయుధాలతో తమ భయంకరమైన నైజంతో ఈ నిరసనలను ఆపాలని చూస్తున్నారని పాక్ మీద నిప్పులు చెరిగింది.

**కీలక డిమాండ్లతో :** ఇదిలా ఉంటే తమకు సంబంధించి 38 డిమాండ్లతో పీఓకేలో ఆందోళనకారులు ఉద్యమిస్తున్నారు. శుక్రవారం నాటికి వారి ఆందోళనలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. తమ డిమాండ్లను సాధిస్తామని వారు వీధుల్లోకి వచ్చి మరీ పోరాడుతున్నారు. మరో వైపు పాక్ ప్రభుత్వం అణచివేతనే నమ్ముకుంది. ఈ నిరసనలలో అధిక సంఖ్యలో పీఓకే ప్రజలు గాయపడ్డారు దీంతో అక్కడ రణ రంగంగా మారుతోంది.

**మానవ ఉల్లంఘన అంటూ :** ఈ నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పాక్ వైఖరిని దుయ్యబెట్టారు. పీఓకే లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న నిరసనల వల్ల , అమాయక పౌరుల ప్రాణాలు పోతున్నాయని ఆయన అన్నారు. పాకిస్తాన్ సైన్యం అకృత్యాలకు పాల్పడుతోందని పాక్ బలగాల దౌర్జన్యాలపై వచ్చిన నివేదికలను తాము పరిగణలోకి తీసుకున్నట్లుగా తెలిపారు. పాక్ తన చట్ట విరుద్ధమైన కార్యక్రమాలను పీఓకేలో కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. మానవ హక్కుల ఉల్లంఘన అక్కడ సాగుతోందని దానికి పూర్తి బాధ్యత పాక్ దే అన్నారు

**పీఓకే స్వాధీనమా :** పీఓకేలో నిరసనకారులు ప్రపంచం తమవైపు చూడాలని ఆదుకోవాలని కోరుతున్నారు. అయితే భారత్ మాత్రమే పక్కన ఉంది. గతంలో కూడా వారు భారత్ తమ పట్ల సానుకూలంగా ఉండాలని కోరారు. ఇపుడు ఏకంగా ఆందోళనలే జరుగుతున్నాయి. పాక్ ఎటూ వారి డిమాండ్లను పరిష్కరించదు. ఈ క్రమంలో భారత్ పీఓకే నిరసనకారుల పక్షం వహిస్తోంది. మరి ఇది మరింతగా ముందుకు సాగి భారత్ లో పీఓకేని విలీనం చేస్తారా అన్నది చర్చగా ఉంది. ఆపరేషన్ సింధూర్ టైం లోనే పీఓకే ప్రస్తావన ఎక్కువగా వచ్చింది. ఇపుడు అంతర్జాతీయ సమాజం కూడా ఆలోచించే విధంగా పీఓకేలో పాక్ దౌర్జన్యాలు ఉన్నాయని అంటున్నారు. అయితే పీఓకేకి సంఘీభావంతో భారత్ సరిపెడుతుందా ఏమైనా వ్యూహం ఉందా అన్నది చూడాల్సి ఉంది.


## కాకలు తీరిన రాజకీయ నేత కాకా - అక్టోబర్ 5...గడ్డం వెంకట స్వామి జయంతి



రాజకీయాల్లో కాకలు తీరిన నేతగా... 'కాకా'గా చెరగని ముద్ర వేసిన కేంద్ర మాజీ మంత్రి, సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి గడ్డం వెంకట స్వామి(92). భారత రాజ్యాంగ రూపకర్త బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కలసి పనిచేసిన వారిలో కాకా ఒకరు. కార్మిక నేతగా ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. భారత దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి అతి సమీపానికి వెళ్ళి, కొందరి స్వార్థం, కుట్రల మూలంగా, ఆ పదవి పొందలేక పోయానని కాకా పదే పదే చెపుతుండే వారు. హైదరాబాద్ లో ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేయించి గుడిసెల వెంకట స్వామిగా గుర్తింపు పొందారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు మొదటిసారి ప్రతిపాదన చేసిన వ్యక్తి వెంకటస్వామి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, పిసిసి అధ్యక్షుడిగా, ఎఐసిసి బాధ్యునిగా, ఎంపీగా , కేంద్ర మంత్రిగా, ఆయన అందించిన బహుముఖ సేవలు నిత్య జ్ఞాపకాలుగా మిగిలాయి. గడ్డం వెంకటస్వామి 5 అక్టోబర్ 1929న హైదరాబాద్ లో జన్మించారు. చిన్న వయసులోనే నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. మొదట ఆర్య సమాజ్‌లో, ఆ తర్వాత రామానందతీర్థ శిష్యుడిగా కాంగ్రెస్‌లో పనిచేశారు. సాయుధ పోరాట సమయంలో జైలుకెళ్లిన కాకా.. హైదరాబాద్ విలీనం అనంతరం రాజకీయాలు వదిలేసి కుటుంబ పోషణ కోసం కూలీ పని చేశారు. అప్పుడే కార్మిక నాయకుడిగా ఎదిగారు. హైదరాబాద్‌లో నిలువనీడ లేకుండా ఉన్న పేదల కోసం ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసి వారి కోసం పోరాడారు. ఆర్థికంగా బలపడ్డాక మళ్లీ రాజకీయాల్లోకి వచ్చిన కాకా అనేక పదవులు అలంకరించారు. 1957- 62 మరియు 1978–84 ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ్యులుగా రెండు పర్యాయాలు ఉన్నారు. 1967లో 4 వ లోకసభకు ఎన్నికైయ్యారు.1969-71 వరకు ప్రజా పద్దుల కమిటీ సభ్యుడు. అవిభక్త కరీంనగర్ జిల్లా పెద్దపల్లి లోకసభ నియోజకవర్గం నుండి పార్లమెంట్ కు ప్రాతినిధ్యం వహించారు. 1971లో 5వ లోకసభకు (2వ పర్యాయం), 1977లో 6వ లోకసభకు (3వ పర్యాయం), 1989లో 9వ లోక్ సభ (4వ పర్యాయం), 1991లో 10వ లోకసభకు (5వ పర్యాయం), 1996లో 11వ లోకసభకు (6వ పర్యాయం), 2002-2004 అధ్యక్షుడి గా, ఎ.ఐ.సి.సి. ( ఎస్ సి %డ% ఎస్ టి ), 2004లో 14వ లోకసభకు (7వ పర్యాయం), ఎన్నికైయ్యారు. 1978 – 1982 లేబర్ మరియు సివిల్ సప్లైస్, ఆంధ్ర ప్రదేశ్ క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 1973 – నవంబర్ 1973 వరకు లేబర్ మరియు పునరావాస కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. నవంబర్ 1973–మార్చి 1977 వరకు సప్లై అండ్ రీహాబిలిటేషన్ కేంద్ర ఉపమంత్రిగా పనిచేశారు. 21 జూన్ 1991 నుండి 17 జనవరి 1993 గ్రామీణాభివృద్ధి కేంద్ర మంత్రిగా, 18 జనవరి1993 నుండి ఫిబ్రవరి 1995 టెక్స్టైల్స్ కేంద్ర సహాయ మంత్రి (ఇండిపెండెంట్ ఛార్జ్)గా, 10 ఫిబ్రవరి నుండి 1995-15 సెప్టెంబర్ 1995 వరకు టెక్స్టైల్స్ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 15 సెప్టెంబర్ 1995 నుండి 10 మే 1996 వరకు కార్మిక శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, 20 ఫిబ్రవరి 1996-16 మే 1996 కార్మిక మరియు వస్త్రాల శాఖ కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. అలాగే డిప్యూటీ లీడర్ కాంగ్రెస్ పార్లమెంట్ పార్టీ, లోకసభ మెంబర్, కమిటీ ఆన్ ఎనర్జీ , మెంబర్, కమిటీ ఆన్ ఇన్ స్టాలేషన్ ఆఫ్ పోర్ట్రైస్ / స్టేట్స్ ఆఫ్ నేషనల్ లీడర్స్, పార్లమెంటేరియన్ ఇన్ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ మెంబర్, కమిటీ ఆన్ ఎథిక్స్ మెంబర్, కన్ సులేటివ్ కమిటీ, మినిస్ట్రీ ఆఫ్ హెవీ ఇండస్ట్రీస్ మెంబర్, స్టాండింగ్ కమిటీ ఆన్ ఎనర్జీ పని చేశారు. కాకా మొదటి కుమారుడు గడ్డం వినోద్, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, రెండవ కుమారుడు గడ్డం వివేకానంద, పెద్దపెల్లి నియోజక వర్గానికి ఎం.పి.గా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారునిగా పనిచేశారు. కాకా 2014, డిసెంబరు 22వ తేదీ హైదరాబాదులో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాత మహీ పతి సూర్యారావు - అక్టోబర్ 5... పీఠాపురం సంస్థానాధీశుల జయంతి




రావు వెంకటకుమార మహీపతి సూర్యారావు పిఠాపురం సంస్థాన చివరి పాలకులు. సాహిత్య చక్రవర్తి, కళా ప్రపూర్ణ, సాహిత్య పోషకులు, డాక్టర్ రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దర్ 1907-1948 పిఠాపురం సంస్థానాధీశులుగా ప్రసిద్ధులు. ఆయన 1885, అక్టోబర్, 5 న మంగాయమ్మ, రావు వేంకట మహీపతి గంగాధర రామారావు దంపతులకు జన్మించారు. ఐదు సంవత్సరాల వయసు వచ్చే సమయానికి తండ్రి మరణించగా, గంగాధర రామారావు దత్తపుత్రుడు వారసుడు కాదని, రాజ్యాధికారం తనదే అని కోర్టుకు ఎక్కాడు. ఈ వ్యాజ్యం ఎక్కువ రోజులు నడిచి చివరకు విజయలక్ష్మి ఆయననే వరించింది. ఈ వ్యాజ్యం కోర్టులో ఉన్నంతకాలం, అనంతరం ఆయన మైనారిటీ తీరేవరకు ఈ సంస్థానం కోర్ట్ ఆఫ్ వార్డ్స్ అధీనంలో ఉంది. ఈ సమయంలో ఆయన మద్రాసు లోని న్యూయింగ్టన్ కళాశాలలో ఉండి విద్యాభ్యాసం చేశారు. ఈ సమయంలోనే సంస్కృతం, తెలుగు, కన్నడం, తమిళం, ఆంగ్ల భాషలను నేర్చుకుని ఈ ఐదు భాషలలో ఉత్తమ గ్రంథాలను పఠించారు. తెలుగు, ఇంగ్లీషు భాషలలో కవిత్వం చెప్పగలిగే నేర్పును సంపాదించారు. తర్వాత నూజివీడు సంస్థానాధిపతియైన రాజా వెంకటరంగయ్యప్పారావు ప్రథమ పుత్రిక అయిన ఆండాళమ్మను 1906, ఏప్రిల్ 2 న వివాహం చేసుకున్నారు. వంశాచార రమును బట్టి ఆండాళమ్మ అత్తింటికి వచ్చిన వెంటనే చిన్నమాంబా దేవిగా తన పేరును మార్చుకున్నారు. తర్వాత 1907, ఫిబ్రవరి 19 న పిఠాపురం సంస్థానపు సింహాసనాన్ని అధిష్టించారు. 1948లో సంస్థానాలు, జమీందారీ వ్యవస్థ రద్దయ్యే వరకు ఇతడు పిఠాపురం మహారాజుగా వెలుగొందారు. ఆయనకు చిన్నమాంబాదేవి ద్వారా మొదట 1910లో గంగాధర రామారావు అనే పుత్రుడు జన్మించారు. తర్వాత వారికి సూర్యారావు అనే కుమారుడు, మంగాయమ్మ, భువయమ్మ, సీతాదేవి, కమలాదేవి అనే కుమార్తెలు కలిగారు. ఆయన కుమార్తె సీతాదేవి బరోడా సంస్థానపు మహారాణి అయ్యింది. రాజా సూర్యారావు గారు 79 సంవత్సరాలు జీవించి 1964, మార్చి 6 వ తేదీన మరణించారు. ఆయన తన తండ్రిచేత స్థాపించ బడిన పిఠాపురం హైస్కూలు, కాకినాడ కాలేజీలను అమితమైన ధనం వెచ్చించి అభివృద్ధి చేసి దక్షిణ ఆంధ్ర రాష్ట్రంలో అటువంటి విద్యాసంస్థలు మరొకటి లేదని పించారు. కాకినాడ కాలేజీని ఫస్ట్ గ్రేడ్‌గా ఉద్ధరించి ఎన్నో భవనాలను కట్టించారు. ఆ కాలేజీలో చదివే స్త్రీలకు, పేద విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పారు. అంతే కాకుండా పట్టభద్రులై విదేశాలకు వెళ్లి, ఉన్నతవిద్య పొందగోరే వారికి సంపూర్ణ ధనసహాయం చేశారు. పిఠాపురం హైస్కూలులో హరిజన విద్యార్థిని విద్యార్థుల కోసం వసతి గృహాన్ని నెలకొల్పి దానికయ్యే వ్యయాన్ని అంతా తానే భరించారు. వారికి ప్రైవేటు టీచర్లను కూడా ఏర్పరిచి అనేకమందిని వృద్ధిలోనికి తీసుకు వచ్చారు. రాజమండ్రి లోని వీరేశలింగోన్నత పాఠశాల ఆయన పోషణలోనే నడిచింది. రఘుపతి వేంకటరత్నం నాయుడు ప్రేరణతో కాకినాడలో బ్రహ్మసమాజ ప్రార్థనా మందిరాన్ని, అనాథ శరణాలయాన్ని ఏర్పాటు చేశారు. రాణీ చిన్నమాంబాదేవి కోరికపై కాకినాడ లేడీస్ క్లబ్‌కు 40 ఎకరాల స్థలాన్ని ఇచ్చారు. రాణీ ఆధ్వర్యంలో పిఠాపురంలో ఘోషా స్కూలును నడిపారు. 1920 ప్రాంతములో విశ్వకవి రవీంద్రనాథ టాగూరు పిఠాపురం సందర్శించి నప్పుడు ఇతడు సుమారు లక్షరూపాయలు పారితోషికంగా ఇచ్చారు. ప్రాచ్య, పాశ్చాత్య విద్యలను సమదృష్టితో గౌరవించి వాటి అభివృద్ధికై ఎంతో ధనాన్ని వెచ్చించారు. ఆయన పోషణ తోనే తెలుగు దేశము లోని అనేక ప్రతి సాహిత్యసంస్థ అభివృద్ధిని చెందింది. ఆంధ్ర భాషాభివర్ధినీ సమాజము, విజ్ఞాన చంద్రికా మండలి, ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలలకు విశేషమైన ధన సహాయం చేశారు. జయంతి రామయ్య స్థాపించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తును ప్రోత్సహించి సూర్యరాయాంధ్ర నిఘంటువు నిర్మాణానికి కారకులు అయినారు. ఎన్నో ప్రాచీన గ్రంథాలను పరిషత్తు ద్వారా లక్షల రూపాయలు వెచ్చించి ముద్రించారు. ఆయన సాహిత్య ప్రపంచానికి చేసిన సేవ అంతా ఒక ఎత్తు, సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాణానికి, ప్రచురణకు పాటు పడటం ఒక ఎత్తు. 1911, మే 12 న జరిగిన ఆంధ్రసాహిత్య పరిషత్తు సభలో జయంతి రామయ్య పంతులు నిఘంటు నిర్మాణానికి చేసిన ప్రతిపాదన విని, ఆ నిఘంటు నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం భరించడానికి సంసిద్ధు లైనారు. ఆ ప్రకటనకు సభలోని వారంతా ఆనందపడ్డారు. జయంతి రామయ్య ఆధ్వర్యంలో ప్రారంభ మైన నిఘంటువుకు "శ్రీ సూర్య రాయాంధ్ర నిఘంటువు" అని నామకరణం చేశారు. ఈ నిఘంటు నిర్మాణానికి కాశీభట్ల సుబ్బయ్య శాస్త్రి, తంజనగరము తేవప్పెరు మాళ్ళయ్య, పురాణపండ మల్లయ్య శాస్త్రి, పేరి పాపయ్య శాస్త్రి, శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రి, కూచి నరసింహం, చర్ల నారాయణ శాస్త్రి, పిశుపాటి చిదంబర శాస్త్రి, వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి, దర్భా సర్వేశ్వర శాస్త్రి, పిశుపాటి విశ్వేశ్వర శాస్త్రి, ప్రయాగ వేంకట రామ శాస్త్రి, అమలాపురపు విశ్వేశ్వర శాస్త్రి, బులుసు వేంకటేశ్వర్లు, చిలుకూరి వీరభద్ర శాస్త్రి, దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి, మధునాపంతుల సత్య నారాయణ శాస్త్రి, చెఱుకుపల్లి అప్పారాయ శాస్త్రి, ఇంద్రగంటి సూర్యనారాయణ శాస్త్రి, చిలుకూరి విశ్వనాథ శాస్త్రి, ఆకుండి వేంకట శాస్త్రి, ఓలేటి సూర్యనారాయణ శాస్త్రి, పాలెపు వెంకటరత్నం, సామవేదం శ్రీరామమూర్తి శాస్త్రి, పన్నాల వేంకటాద్రిభట్ట శర్మ, దివాకర్ల వేంకటావధాని మొదలైన పండితులు పాటుపడ్డారు. పిఠాపురం సంస్థాన చరిత్రలో రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు కాలం స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చు. ఆయన సంస్థానంలో ఆస్థాన పండితులుగా శ్రీపాద లక్ష్మీనరసింహ శాస్త్రి (తర్కశాస్త్రం), తాతా సుబ్బరాయ శాస్త్రి (వ్యాకరణం), చిలుకూరి నారాయణ శాస్త్రి, వేదుల సూర్య నారాయణ శాస్త్రి, గుదిమెళ్ల వేంకట రంగాచార్యులు (విశిష్టాద్వైతము), వడలి లక్ష్మీనారాయణ శాస్త్రి (వేదం), దెందుకూరి నరసింహ శాస్త్రి (వేదాంతం), తుమురాడ సంగమేశ్వర శాస్త్రి (సంగీతం) మొదలైన దిగ్గంతులు ఉండేవారు. ఈ పండితుల సహకారంతో ప్రతియేటా పిఠికాపుర సంస్థాన విద్వత్పరీక్షల పేరుతో విజయ దశమి నవరాత్రి ఉత్సవాల సందర్భంలో శాస్త్ర పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారిని కానుకలతో సత్కరించేవారు. ప్రబంధ రచనలో కూడా పోటీలు నిర్వహించేవారు. ఆనాటి సుప్రసిద్ధ పండితులు ఎందరో ఈ పరీక్షలలో బహూకృతులైనవారే. పానుగంటి లక్ష్మీనరసింహారావు, వేంకట రామకృష్ణ కవులు ఆయన ఆస్థాన కవులుగా ఉన్నారు. వీరు కాక చిలకమర్తి లక్ష్మీనరసింహం, కందుకూరి వీరేశలింగం, టేకుమళ్ల అచ్యుతరావు, దేవగుప్తాపు భరద్వాజము, పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి, శొంఠి భద్రాద్రి రామ శాస్త్రి, వేంకట పార్వతీశ కవులు, దాసరి లక్ష్మణకవి, వేదుల రామచంద్రకీర్తి, శ్రీరాం వీరబ్రహ్మకవి, మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి, కూచి నరసింహము, నడకుదుటి వీరరాజు మొదలైన ఎందరో కవులు ఆయన చేత సన్మాన సత్కారాలను అందు కున్నారు. 1929, జనవరి 29 న మద్రాసు గవర్నరు వెల్లింగ్టన్ ప్రభువు ఆయనకు "మహారాజా", అనే బిరుదును ఇచ్చి గౌరవించారు. 1938, అక్టోబరు 1 వ తేదీన ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు గౌరవ డి.లిట్. పట్టాను ప్రదానం చేశారు. 1953లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## మహిళా గౌరవ రక్షణకు అంతర్జాతీయ సంకల్పం

### అంతర్జాతీయ వ్యభిచార వ్యతిరేక దినోత్సవం - మానవ గౌరవ పోరాటం - అక్టోబర్ 5...అంతర్జాతీయ వ్యభిచార వ్యతిరేక దినం




ప్రతి సంవత్సరం అక్టోబర్ 5న జరుపుకునే అంతర్జాతీయ వ్యభిచార వ్యతిరేక దినోత్సవం మానవ సమాజంలోని ఒక సంక్లిష్టమైన సమస్యను సవివరంగా మన ముందుంచుతుంది. వ్యభిచారం అనేది కేవలం వ్యక్తిగత జీవన విధానం కాదని, అది తరచుగా పేదరికం, నిరక్షరాస్యత, మానవ అక్రమ రవాణా, లింగ అసమానత, సామాజిక దోపిడీ వంటి భయానక మూలాల ఫలితమని ఈ దినం మనకు గుర్తు చేస్తుంది. సమాజంలో అత్యంత బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాన్ని నిలువరించడం, మానవ హక్కులను రక్షించడం, గౌరవప్రదమైన జీవనానికి అవకాశాలు కల్పించడం వంటి లక్ష్యాలతో ఈ దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించ బడుతుంది. వ్యభిచారం మానవ హక్కుల ఉల్లంఘన. ముఖ్యంగా మహిళలు, బాలికలు బలవంతపు వ్యభిచారానికి గురై మానసిక, శారీరక, సామాజిక సమస్యలతో బాధపడు తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఇలాంటి దుర్వినియోగానికి గురవుతున్నారు. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం సుమారు నలభై మిలియన్ల మంది ఈ రంగంలో చిక్కుకుని ఉన్నారు. వారిలో ఎనభై శాతం మంది మహిళలు మరియు బాలికలే. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం ఏటా దాదాపు 4.8 మిలియన్ల మంది బలవంతపు లైంగిక దోపిడీకి గురవుతున్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా మార్కెట్ విలువ సంవత్సరానికి 150 బిలియన్ అమెరికా డాలర్లకు చేరుకోవడం ఈ సమస్య యొక్క తీవ్రతను తెలియజేస్తుంది. ఈ సమస్యపై అంతర్జాతీయంగా దశాబ్దాలుగా పోరాటం కొనసాగుతోంది. 1949లో ఐక్యరాజ్యసమితి "ట్రాఫిక్ ఇన్ పర్సన్స్ అండ్ ఎక్స్‌ప్లాయిటేషన్ ఆఫ్ ప్రాస్టిట్యూషన్ ఆఫ్ అదర్స్" ఒప్పందాన్ని ఆమోదించింది. దీని ద్వారా మానవ అక్రమ రవాణా, వ్యభిచార దోపిడీపై నిషేధం విధించ బడింది. 1979లో సీఈడీఏడబ్ల్యూ ద్వారా మహిళలపై వివక్ష అంతం చేయాలని, బలవంతపు వ్యభిచారాన్ని నిర్మూలించాలని మళ్లీ స్పష్టమైన తీర్మానం వెలువడింది. 2000లో పాలెర్మో ప్రోటోకాల్ ద్వారా మానవ అక్రమ రవాణాపై మరింత కఠినమైన చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటు చేశారు. అనేక దేశాలు తమ తమ చట్టాలను సవరించుకుని బాధితులను రక్షించడానికి, నేరస్తులను శిక్షించడానికి ప్రయత్నాలు చేశాయి. భారతదేశంలో వ్యభిచారం చట్టబద్ధం కానప్పటికీ పేదరికం, నిరుద్యోగం, సామాజిక అసమానతల వలన వేలాది మంది మహిళలు ఈ రంగంలోకి నెట్టబడు తున్నారు. 1956లో సప్రెషన్ ఆఫ్ ఇమ్మోరల్ ట్రాఫిక్ యాక్ట్ అమల్లోకి వచ్చింది. తరువాత దానిని ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) యాక్ట్‌గా సవరించారు. ఈ చట్టం ప్రకారం మైనర్లను వ్యభిచారం లోకి లాగడం, వ్యభిచార గృహాలు నడపడం, బలవంతపు వ్యభిచారానికి కారణ మవడం నేరాలు. చట్టపరమైన చర్యలతో పాటు బాధిత మహిళలకు పునరావాసం కల్పించడం, విద్యా ఉపాధి అవకాశాలు ఇవ్వడం కోసం అనేక స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. అయినప్పటికీ చట్టం సరిపోదు. సామాజిక అవగాహన, నైతిక విలువలు, స్త్రీ శక్తి సాధికారత సమానంగా అవసరమవుతాయి. వ్యభిచారం మూలాలు కేవలం ఆర్థిక సమస్యల్లో మాత్రమే కాకుండా సామాజిక మరియు సాంస్కృతిక నిర్మాణాలలో కూడా దాగి ఉంటాయి. లింగ అసమానత, స్త్రీపై ఆధిపత్య దృక్పథం, విద్యా లోపం వంటి అంశాలు దీనికి మద్దతు నిస్తాయి. సమాజంలోనే దీనిని ప్రోత్సహించే ధోరణులు కూడా ఉన్నాయనే వాస్తవాన్ని నిర్లక్ష్యం చేయలేము. అందుకే ఈ దినోత్సవం సందర్భంగా కేవలం చట్టాలు, పోలీసు చర్యలు సరిపోవు. మన ఆలోచనల్లో మార్పు రావాలి, స్త్రీ గౌరవాన్ని గుర్తించే కొత్త సామాజిక విలువలు పెరగాలి. ప్రపంచ సాహిత్యం, సినిమా, కళారూపాలు కూడా ఈ సమస్యను ప్రతిబింబించాయి. వ్యభిచారం బాధితుల వేదన, వారి బలహీనత, సమాజం వారిని ఎలా వేరు చూస్తుందో ఎన్నో రచనల్లో స్పష్టమవుతుంది. భారత దేశంలో కూడా అనేక సినిమాలు, కథలు ఈ అంశాన్ని చర్చించాయి. ఇవి కేవలం కళాత్మక ప్రతిఫలాలు మాత్రమే కాదు, సమాజాన్ని కదిలించే చైతన్య రూపాలు. మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఇదే లక్ష్యంతో చైతన్య యాత్రలు, సమావేశాలు నిర్వహిస్తూ సమాజంలో అవగాహన కలిగించడానికి కృషి చేస్తున్నాయి. అంతర్జాతీయ వ్యభిచార వ్యతిరేక దినోత్సవం కేవలం ఒక జ్ఞాపక దినం కాదు. ఇది మానవతా సంకల్పం. మహిళా గౌరవం, మానవ హక్కులు, పిల్లల భవిష్యత్తు రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన దినం. బాధితులను నిందించడం కాదు, వారికి సహాయం చేయడం, పునరావాసం కల్పించడం మన బాధ్యత. సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు వస్తేనే వ్యభిచారం వంటి దురాచారం నిర్మూలన చెందుతుంది. ఇది వ్యక్తిగతం మాత్రమే కాదు, సమాజం మొత్తం గౌరవం కోసం జరగవలసిన పోరాటం. మానవ గౌరవాన్ని కాపాడుకోవడమే ఈ దినోత్సవం యొక్క ప్రధాన సంకల్పం.

**రామ కిష్టయ్య సంగన భట్లటీ సీనియర్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# బై సర్వే నంబర్లకు బైబై..!

ఖమ్మం : ప్రభుత్వ స్థలాలు, అసైన్డ్, భూదాన్ భూములను కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారు. నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి వివాదాస్పదం చేస్తున్నారు. ఆయా భూములతోపాటు రహదారులు, ఎస్సారెస్పీ కాల్వల కోసం సేకరించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. బై సర్వే నంబర్లకు బదులు ప్రత్యేక నంబర్లు కేటాయిస్తూ భూధార్ కార్డులు ఇవ్వనున్నారు. గొలుసులు, టేపుల కొలతలతో తప్పులు దొర్లే అవకాశం ఉండటంతో అత్యాధునిక పరికరాలతో క్షేత్రస్థాయిలో సర్వే జరపటానికి సమాయత్తమవుతున్నారు. సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం పది రోవర్లు ఇవ్వనుంది. వీటితో జిల్లావ్యాప్తంగా సర్వే చేయటానికి ఎక్కువ సమయం పట్టనుంది. అందుకే మరో ఐదు రోవర్ల కొనుగోలుకు జిల్లా అధికారులు టెండర్లు పిలిచారు.

**ములుగుమాడులో తొలి అడుగు..**

భూముల సమగ్ర వివరాలను చిటికెలో తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా భూధార్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఐదు జిల్లాల్లో ఐదు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది.



అందులో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడు ఒకటి. ఈఏడాది మే మాసంలో ఈగ్రామంలో 103 సర్వే నంబర్లలోని 845.32 ఎకరాల భూములను అధికారులు డ్రోన్లతో పాటు డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్)తో సర్వే జరిపి నక్షా రూపొందించారు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా మ్యాపులతో హద్దులు గుర్తించారు. ఇక్కడ ఎదురైన లోటుపాట్లను పరిష్కరించి వివాదాలకు తావులేకుండా తొలుత జిల్లాలోని అన్ని ప్రభుత్వ భూములకు, తదుపరి ప్రైవేటు భూములకు భూధార్ కార్డులు ఇవ్వనున్నారు.

**జిల్లాలో 1.84లక్షల ఎకరాలకు పైగా..**

జిల్లాలో 1,84,189.28 ఎకరాల్లో ప్రభుత్వ స్థలం ఉందని అధికారులు తెలిపారు. 47,442.66 ఎకరాల్లో అసైన్డ్ భూములు ఉన్నాయి. వైరా, ఎర్రుపాలెం, నేలకొండపల్లి, సింగరేణి, ముదిగొండ, ఖమ్మం అర్బన్, తిరుమలాయపాలెం, కల్లూరు, ఏన్కూరు మండలాల్లో 1,258.26 ఎకరాల్లో భూదాన్ భూములు ఉన్నాయని అంచనా. ఇందులో 101.20 ఎకరాలపై కోర్టు కేసులు ఉండగా.. 20.13 ఎకరాలపై నమోదైన ఫిర్యాదులను అధికారులు పరిష్కరించారు. 726.27ఎకరాలను ప్రజలకు అసైన్ చేశారు. 'రోవర్లు రాగానే భూసర్వే మొదలుపెట్టి భూధార్ కార్డుల జారీకి మ్యాపులు రూపొందిస్తాం' అని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# సామాజికవర్గాలపై గురి.. ఆసక్తికరంగా ఎన్నికల బరి

భద్రాచలం : ప్రతీ ఓటు పోల్ చేయించాలి. ప్రత్యర్థులను కంగు తినిపించాలి. ఓటర్లు ఎక్కువ ఉన్నా వారి బంధుగణంతో ఒప్పించి రప్పించాలి. అందుకు ఇప్పటి నుంచే భద్రాచలం మన్యంలోని ప్రధాన పార్టీల నాయకత్వం సామాజికవర్గాలపై గురి పెట్టింది. కులాలవారీగా సానుభూతిపరులు అభిమానులు ఎంతమంది ఉన్నారో లెక్కలు కట్టే పనిలో పడ్డారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఉన్న విద్యావంతుల సాయం తీసుకుంటున్నారు. వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్లను ప్రభావితం చేయగల పలుకుబడి ఎవరికి ఉందో ఆరా తీస్తున్నారు. పార్టీలకు అతీతంగా సేవా రంగంలో ఉన్న వ్యక్తులనూ తమ వైపు తిప్పుకునేందుకు సమాలోచనలు సాగిస్తున్నారు.

**అడవి బిడ్డలను ప్రసన్నం చేసుకునేదెవరో..**



ఈ మధ్య కాలంలో ఎస్టీల్లోని రెండు ప్రధాన తెగల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఇటీవల భద్రాచలం కేంద్రంగా 'ధర్మయుద్ధం' పేరిట నిర్వహించిన బహిరంగ సభ డిమాండ్ చేసింది. అదే క్రమంలో లంబాడాలు ఎస్టీలు కాదనడం రాజ్యాంగ విరుద్ధమని హైదరాబాద్‌లో లంబాడా ఐకాస నిర్వహించిన సమావేశం స్పష్టం చేసింది. ఈ రెండు వర్గాల వాదనలు భద్రాచలం మన్యం స్థానిక సంస్థలపై ఏ మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. ఇదే క్రమంలో చత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన గొత్తికోయలను ఎస్టీలుగా గుర్తించాలని ప్రధాన పార్టీల నాయకత్వంతో పాటు ఆదివాసీ సంఘాలు కోరుతుండడంతో ఆ ఓటు బ్యాంకును ఎవరు ప్రసన్నం చేసుకుంటారన్నది ఆసక్తి కలిగిస్తోంది. భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని అన్ని సర్పంచి స్థానాలతో పాటు ఎంపీపీలను ఎస్టీలకే కేటాయించారు. ఈసారి అభ్యర్థుల ఎంపిక ఆషామాషీ కాదని అంటున్నారు.

# నొప్పులొస్తే.. నోములే

దేవరకొండ : అంతరిక్షానికి సైతం అవలీలగా వెళ్లొస్తున్న ప్రస్తుత రోజుల్లో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణులను, అత్యవ సర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు కొన్ని గ్రామాల్లో నేటికీ రోడ్డు వసతి లేదు. కొన్నిచోట్ల ఉన్నా.. వాహనాలు వెళ్లలేని పరిస్థితి. గిరిజన ప్రాంతమైన దేవరకొండ నియోజకవర్గంలో రోడ్డు మార్గాలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా చందంపేట, నేరెడుగొమ్ము, డిండి, పీఏపల్లి మండలాల్లోని కొన్ని గ్రామాలకు నేటికీ రోడ్డు రవాణా సౌకర్యం కల్పించకలేకపోవడం పాలకుల పనితీరుకు అద్దం పడుతోంది. సరైన రోడ్డు మార్గం, వంతెనలు లేక గర్భిణులు, బాలింతలు అంబులెన్స్ సేవలను పొందలేక పోతున్నారు. ఉన్న రోడ్లు సరిగ్గా నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనా లు రాలేని పరిస్థితి నెలకొంది. దేవరకొండ నియోజకవర్గానికి కూతవేటు దూరంలో ఉన్న బుడ్డోనితండా నుంచి మర్రిచెట్టుతండాకు మధ్యలో వాగు దాటాల్సి ఉంటుంది. మూడేళ్ల కిందట ఓ గర్భిణి వాగు దాటుతూ అందులో చిక్కుకొని మృత్యువాత పడగా, ఏడాది క్రితం గిరిజన వృద్ధుడు మృతిచెందాడు. పీఏపల్లి మండలం బూడిదగట్టు, పీఏపల్లి నుంచి అంగడిపేట, దేవరకొండ మండలం కొర్రతండా నుంచి ఎర్రబిచ్యతండా, బుడ్డోనితండా నుంచి మర్రిచెట్టుతం డా, డిండి మండలం గజరాల్ తండా నుంచి చెరుకుపల్లి, బ్రాహ్మణపల్లి నుంచి వావిల్‌కోల్, నిజాంనగర్ నుంచి కందుకూరు, ఉమ్మడి చందం పేట మండలం గువ్వలగుట్ట, కంబాలపల్లి, పొగిళ్ల, నక్కదుబ్బతండా, బండకిందితండా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి

# వేలంలో దక్కించుకున్నా వెనకడుగే..



కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ దుకాణాలపై దుకాణదారులకు ఆసక్తి కరవైంది. నెలన్నర కిందట దుకాణాలు లీజుకు ఇచ్చేందుకు నగరపాలక సంస్థ అధికారులు వేలం నిర్వహించారు. ఆ సమయంలో దుకాణాలు దక్కించుకున్న వారిలో ఒకరిద్దరు మినహా మిగతావారు ముందుకు రావడం లేదు.

**మిగతా దుకాణాల సంగతేంటి?**

స్పోర్ట్స్ కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో 22 దుకాణాలు ఉండగా 8 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వేలంలో 14 దుకాణాలను అర్హులు దక్కించుకున్నారు. మొదటి అంతస్తులో బాంకెట్‌హాల్, రెండో అంతస్తులో డార్మెటరీ, సూట్‌రూమ్‌లున్నాయి. బాంకెట్‌హాల్, డార్మెటరీ, సూట్‌రూమ్‌లకు నెలసరి అద్దె రూ.లక్షల్లో ఉండటం, డిపాజిట్ రూ.10 లక్షలు కావడంతో ఔత్సాహికులు పెద్దగా స్పందించడం లేదు. నెలసరి అద్దెతోపాటు డిపాజిట్ తగ్గించాలనే డిమాండ్ వస్తోంది.

**ఒప్పందం మాటేమిటి**

దుకాణాలను దక్కించుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు వేలంలో పాల్గొని తీసుకున్న వారు ఒప్పందం చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. రిజర్వ్‌డ్ దుకాణాలకు పోటీపడ్డారు. నెలసరి మొత్తం భారీగా ఉండటం, ఆ మొత్తం చెల్లించేందుకు వీలు కలుగుతుందో లేదోనని పేర్కొంటూ డిపాజిట్ చెల్లించేందుకు స్పందించడం లేదు.

**నోటీసులు జారీ చేశాం**

వేలంలో దక్కించుకున్న దుకాణాదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. వెంటనే ఒప్పందం చేసుకోవాలి. లేదంటే వాటిని రద్దు చేసి మిగతా దుకాణాలతోపాటు వీటికి వేలం నిర్వహిస్తాం. త్వరలో చర్యలు తీసుకుంటాం. ఖాదర్ మొహిదుద్దీన్, డిప్యూటీ కమిషనర్, నగరపాలిక

# వ్యర్థం.. ఎరువుతో ప్రయోజనం



గోదావరిఖని : నగరంలోని ఆలయాల్లో నిత్యం నిర్వహించే పూజల్లో.. గణపతి నవరాత్రులు, శరన్నవరాత్రుల్లో.. దసరా, దీపావళి, సంక్రాంతి తదితర పర్వదినాలు.. సద్దుల బతుకమ్మ వేడుకలో పూల వ్యర్థాలు అత్యధికంగా ఉంటాయి. రహదారులు, మురుగు కాలువల్లో పడేయడంతో అపరిశుభ్రత, దుర్గంధంతో పర్యావరణానికి ముప్పు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో సేంద్రియ ఎరువు తయారీతో సమస్య తీరనుండగా.. ఎరువును నగరపాలిక ఉద్యానవనాలు, మొక్కల పెంపకం కేంద్రాలు, డివైడర్లలో ఏర్పాటు చేసిన మొక్కలకు వినియోగించనున్నారు. రామగుండం నగరపాలిక ఆధ్వర్యంలో ప్రస్తుతం కూరగాయల మార్కెట్ నుంచి వెలువడే వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా వెలువడిన సుమారు 5 టన్నుల పూల వ్యర్థాలను గౌతమినగర్‌లోని చెత్త నిర్వహణ కేంద్రానికి మంగళవారం తరలించారు.

శివాజీనగర్‌తో పాటు ప్రధాన కూడలిలో నిత్యం పూల వ్యాపారం జోరుగా సాగుతోంది. మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా నెలాఖరున ఉద్యోగ విరమణ సన్మానాలు, నవరాత్రోత్సవాలు, పర్వదినాలు, వివాహాది శుభకార్యాలు తదితర సీజన్లలో మిగిలిన పూలను మార్కెట్ వ్యర్థాలతో కలిపి చెత్త నిర్వహణ కేంద్రానికి తరలిస్తున్నారు.

నగరపాలక కూరగాయల మార్కెట్ నుంచి నిత్యం సుమారు 2 నుంచి 3 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వెలువడుతుండగా వాటిని ప్రత్యేక ట్రాక్టర్‌లో చెత్త నిర్వహణ కేంద్రానికి తరలిస్తూ సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు.

దేవాలయాల్లో వెలువడే పూల వ్యర్థాలతో అక్కడే సేంద్రియ ఎరువు తయారీకి చర్యలు తీసుకోవాలంటూ గతంలో నగరపాలిక నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా నవంబర్ నుంచి జనవరి వరకు అయ్యప్ప దేవాలయాల్లో పూల వినియోగం ఎక్కువగా ఉంటుంది. వాటిని నగరపాలిక చెత్త నిర్వహణ కేంద్రానికి తరలిస్తుండగా ఎవరికి వారు సేంద్రియ ఎరువు తయారు చేసుకోవాలని సూచిస్తోంది.

వంటింటి వ్యర్థాలతో ఇంటి ఆవరణలోనే సేంద్రియ ఎరువు తయారు చేసుకోవాలంటూ స్వశక్తి మహిళలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రయోగాత్మకంగా పలు నివాసాల్లో తయారు చేయించారు. ఇంటి ఆవరణలో స్థలం లేని ప్రాంతాల్లోని నివాసాలకు సంబంధించి నగరపాలిక ఆధ్వర్యంలో వారికి సమీపంలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# చివరికి తెగుళ్లు.. రైతన్నకు దిగులు



గంగాధర: గత యాసంగిలో వరి కోత దశలో అకాల వర్షాలు ముంచగా ఈ సారి ముందు నుంచే మొగిపురుగు దాడి చేసింది. దీంతో ఇప్పటికే రైతులు రెండు మూడుసార్లు క్రిమిసంహారక మందులు పిచికారీ చేశారు. వరి కోత దశలో సుడిదోమ, అగ్గితెగులు, మెడవిరుపు దాడితో ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఎస్సారెస్పీ వరద కాలువ, ఎల్లంపల్లి జలాలతో యాసంగిలో 2.62 లక్షల ఎకరాల్లో వరి, 43 వేల ఎకరాల్లో పత్తి, 3,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. వరి ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టగా తెగుళ్లతో ఇప్పటికే 20 శాతం పంట నష్టపోయారు. అనంతరం కురిసిన భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. దాని తర్వాత అన్ని గ్రామాల్లో వరికి అగ్గి తెగులు సోకి మెడవిరుపుతో గొలకలు మాడిపోతున్నాయి.

**అవసరమే అదునుగా..**

పంట సాగుకు ముందు దుక్కి దున్ని ఆరబెట్టాలి. పంట మార్పిడి చేపట్టాలి. తెగుళ్ల బారిన పడకుండా నాణ్యమైన విత్తనాల తయారీకి పరిశోధనా కేంద్రాల్లో శాస్త్రవేత్తలు చర్యలు చేపట్టాలి. తెగుళ్లబారిన పడ్డ పంటలను కాపాడుకోవాలనుకునే రైతుల అవసరాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. తెగుళ్ల నివారణకు అవసరమైన మందులు కాకుండా తమ దుకాణంలో ఉన్న మందులను అంటగడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**మూడున్నర ఎకరాల్లో..: మల్లేశం, కారుపాకలపల్లి**

మూడున్నర ఎకరాల్లో వరి వేస్తే తెగుళ్ల దాటికి పంటంతా దెబ్బతింది. మొగి పురుగు నివారణకు రెండు సార్లు మందు పిచికారీ చేయగా ఇప్పుడేమో అగ్గి తెగులు, మెడ విరుపుతో పంటకు నష్టం వాటిల్లుతుంది. మందుల పిచికారీకి రూ.14 వేలు ఖర్చు చేశా. గత యాసంగిలో వడగళ్ల వానతో వరి, మామిడి, కూరగాయలు నేలరాలి తీవ్ర నష్టం జరిగింది.

పంట మార్పిడితో నివారణ : శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి

కొన్నేళ్లుగా ఒకే రకమైన పంట వేయడం, వాతావరణంలో మార్పులతో వరి పంటకు తెగుళ్లు సోకి నష్టం జరుగుతుంది. మొగిపురుగు, అగ్గి తెగులు, మెడవిరుపుతో పంటలు దెబ్బతింటున్నాయి. అగ్గి తెగులు నివారణకు ఐసోప్రోథయోలెన్ 2 మి.లీ లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ లేదా ట్రైసైక్లోజోల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సుడిదోమ సోకితే పంట చుట్టూ కాలిబాటలు తీసి పాయలు చేయాలి. విత్తన ఎంపికలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి.

# ఆధ్యాత్మిక ఒడి.. అడుగుకో గుడి

భద్రాచలం : దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం మహా పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక సౌరభాలు ఉట్టిపడుతుంటాయి. త్రేతాయుగం లో రాముడు వనవాస సమయంలో ఈప్రాంతంలో నడయాడటం ఇక్కడి ప్రత్యేకత. ప్రతి పక్షి, శిల, చెట్టూపుట్టా అన్నీ రామతత్వంతో నిండిపోయాయి. ఈ ఊరిలో అడుగుకో గుడి రా రమ్మని ఆహ్వానిస్తుంటాయి. భద్రాచలం చుట్టుపక్కల రాములోరి జాడలు కనువిందు చేస్తాయి. దర్శనీయ ప్రాంతంగా గుర్తింపు: రాముడి జన్మభూమి అయోధ్య ఉత్తరప్రదేశ్‌లో ఉంది. నేపాల్‌లోని మిథిలా నగరం సీతమ్మవారి స్వస్థలం. రావణుడు పాలించిన లంకా నగరం శ్రీలంకలో ఉంది. రామాయణంలో ఈ మూడు ప్రాంతాలకు ఉండే విశిష్టత అంతాఇంతా కాదు. ఈ మహాకావ్యంలో పూజ్యనీయులుగా సీతారాములవారు ఉన్నారు. ఇలాంటి అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు వనవాస సమయంలో సీతాదేవితో భద్రాచలంలో సేదతీరాడు. త్రేతాయుగంలో ఇక్కడ సంచరించి భద్రుడికి వరం ఇచ్చారు. ఈ వరం కారణంగా భద్రాచలంలో సీతారామలక్ష్మణులు కొలువయ్యారు. కలియుగంలో భద్రాచలం మహా పుణ్యక్షేత్రంగా భక్తుల పూజలందుకుంటోంది. ఆధ్యాత్మికంగా దర్శనీయ ప్రాంతంగా గుర్తింపు పొందింది.

**చూసొద్దాం రండి..**

రామాలయానికి గల అనుబంధ ఆలయాలు ఎంతో ప్రసిద్ధిగాంచాయి. స్థానిక రంగనాయకుల గుట్ట పవిత్రమైన ప్రాంతం. రామాలయానికి అతి సమీపంలో ఉంటుంది. అక్కడ రాములవారి ఆరాధ్య దైవం రంగనాథస్వామి కొలువయ్యారు. ఇక్కడి ధ్యానమందిరం ప్రాంతంలో పూర్వం భక్తరామదాసు నివాసం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పాల్వంచ తహసీల్దారుగా విధులు నిర్వర్తించిన సమయంలో భార్య, కుమారుడితో ఇక్కడ కొన్నేళ్లపాటు ఉన్నారు. రంగనాయకుల గుట్ట నుంచి రాత్రిపూట రామాలయం అందాలు మరింత సుందరంగా కనిపిస్తాయి. గోదావరిపై రెండు వంతెనలు చూడచక్కగా దర్శనమిస్తాయి. గోదావరి కరకట్ట అందాలు ముచ్చట గొలుపుతున్నాయి. రాత్రిపూట విద్యుద్దీపాల కాంతిలో కరకట్ట పైనుంచి గోదావరి ప్రవాహాన్ని చూస్తే ఎంతటి వారైనా ఉబ్బితబ్బిబవుతారు.



రాములవారు ముఖ్య ఉత్సవాలకు రాజవీధి గుండా తిరువీధి సేవలో పాల్గొంటారు. ఈక్రమంలో తాతగుడిలో పూజలు అందుకోవటం సంప్రదాయంగా వస్తోంది. తాతగుడి సెంటర్‌లో గోవిందరాజ స్వామివారు కొలువయ్యారు.

పర్ణశాల ఆలయం భద్రాచలం రామాలయానికి అనుబంధంగా కొనసాగుతోంది. భద్రాచలం నుంచి 35కి.మీ. దూరంలో ఉంటుంది. వనవాసం సమయంలో సీతారాములవారు నివాసం ఉన్న ప్రాంతం ఇది. సీతమ్మవారు నారచీరలు ఆరేసిన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. సీతాదేవిని అపహరించిన చోట విగ్రహాలు ప్రతిష్ఠించారు.

దేవాదాయశాఖకు చెందిన శ్రీఅభయాంజనేయస్వామి కోవెల గోదావరి వంతెన సమీపంలో భక్తులను తన్మయత్వంలో ముంచెత్తుతుంది. ఆర్టీసీ బస్టాండ్ ముందు రోడ్డులో కనకదుర్గ అమ్మవారి ఆలయ దర్శనం ఆనందకరం. హరనాథ్‌బాబా ఆలయం దర్శనీయ ప్రాంతాల్లో ముందువరుసలో ఉంటుంది. ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్నీ వీక్షించాల్సిందే.

# అదనులో 'మీన'మేషాలు!

పెద్దపల్లి : మత్స్యకారుల జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన సమీకృత మత్స్య అభివృద్ధి పథకంలో ఉచిత చేప పిల్లల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటికీ టెండర్లు పూర్తి కాలేదు. జులైలో ప్రారంభించి ఆగస్టులోపు చెరువుల్లో పిల్లలను వదిలితేనే మంచి దిగుబడి రానుంది. సెప్టెంబరు రెండో వారం సమీపించినప్పటికీ టెండరు దశలో ఉండటం ప్రశ్నార్థకంగా మారింది. **.అన్నీ అడ్డంకులే..**

ఉమ్మడి జిల్లాలో 904 మత్స్య సహకార సంఘాల్లో 58 వేల మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది 3,466 జల వనరుల్లో 6.68 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని లక్ష్యం విధించారు.

పెద్ద సైజు (80 నుంచి 100 ఎంఎం) పిల్లలు, చిన్న సైజు (35-40ఎంఎం) పిల్లలను చెరువుల్లో వదలాలి. ప్రతి సీజన్‌లో పిల్లల పరిమాణం, మోతాదు విషయంలోనూ కచ్చితమైన ప్రామాణికత పాటించడం లేదు.

చిన్న సైజ్, కల్తీ విత్తన పిల్లల పంపిణీ చేయడంతో రవ్వు, బొచ్చ రకాల ఉత్పత్తి పెరగకపోవడంతో నష్టం వస్తుంది. చిన్న సైజ్ పిల్లలు పోషకాహార లోపంతో రెండు కిలోలు ఉండాల్సిన చేప అర కిలోకే పరిమితమవుతోంది.

ప్రస్తుతం చెరువుల్లో వదిలితే ఏప్రిల్, మే నెలల్లో చేతికి రానుంది. అప్పటికి నీటి వనరులు ఎండిపోతాయి. దీంతో చేపలు చనిపోతాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రెండేళ్ల బిల్లులు గుత్తేదారులకు చెల్లించాల్సి ఉండటంతో గతేడాది టెండర్లు దాఖలు చేయలేదు. ఈ సారి కూడా ముందుకు రావడం లేదు.

ఈ నెల 12న టెండర్లు తెరవనున్నారు. ఇప్పటి వరకు పెద్దపల్లిలో 2, కరీంనగర్‌లో 3, సిరిసిల్ల 2 చొప్పున దాఖలు చేయగా జగిత్యాలలో ఒక్కటీ రాలేదు.

చేప పిల్లలకు ప్రత్యామ్నాయంగా నగదు బదిలీ అమలు చేయాలని, నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసుకుంటామని మత్స్యకారుల్లో డిమాండ్ పెరుగుతోంది.

మత్స్యకారుల సంఘం జిల్లా డైరెక్టర్ క్రాంతి మాట్లాడుతూ ఆగస్టులోపు పిల్లలను వదలాల్సి ఉండగా, ఇప్పటి వరకు స్పష్టత లేదు అని అన్నారు. పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి నరేశ్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో చేప పిల్లల పంపిణీ టెండర్ ఈ నెల 12న టెండర్లు ఖరారు కావాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో నాణ్యమైన పిల్లలను పంపిణీ చేయనున్నామని చెప్పారు.

# చిన్నారులకేదీ ఏకరూపం!

తాండూరు : అంగన్‌వాడీ చిన్నారులకు ఏకరూప దుస్తులు ఇంకా అందలేదు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు దాటినా వాటి ఊసే లేదు. ఎప్పుడు పంపిణీ చేస్తారోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. గతేడాది త్వరగా ఇచ్చినా, ఈ సారి ఆలస్యం చేయడం ఏమిటని చిన్నారుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. చిన్నారులు ఆసక్తిగా కేంద్రానికి రావాలంటే వెంటనే దుస్తులను అందించాలని కోరుతున్నారు.మహిళా సంఘాలకు బాధ్యత : జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 32,583 మంది ఉన్నారు. 3-6 సంవత్సరాల నిండి, కేంద్రానికి వచ్చే వారికి ఏకరూపం పంపిణీ చేయనున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (సెర్ప్) ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు వస్త్రం అందించి కుట్టించనున్నారు. ఆకర్షణీయంగా బాలురకు చొక్కా, నిక్కర్, బాలికలకు గౌను ఇవ్వనున్నారు. ఒక జత కుట్టేందుకు రూ.80-100 చెల్లించనున్నారు. వస్త్రం పూర్తిగా రాకపోవడంతో ఆలస్యం



అవుతోందని అధికారులు చెబుతున్నారు.

**రంగులతోనే** పాత ఏకరూప దుస్తులు, వివిధ రకాల రంగుల దుస్తులతోనే ఈఏడాది చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రానికి వస్తున్నారు. ఏకరూపం ఉంటే చిన్నారులు ఆసక్తిగా, ఉత్సాహంగా వచ్చేవారని.. ప్రైవేటు వలే కేంద్రానికి వస్తున్నామనే ఆలోచనతో తల్లిదండ్రులు పంపించేవారని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు.

**వస్త్రం వచ్చింది..**

చిన్నారులకు ఏకరూప దుస్తులు కుట్టంచేందుకు జిల్లా కేంద్రానికి వస్త్రం వచ్చింది. త్వరలో మండలాలకు పంపిణీ చేయనున్నారు. మహిళా సంఘాలకు కుట్టే బాధ్యతలివ్వనున్నారు. ఒకరికి రెండు జతల ఏకరూప దుస్తులు అందజేస్తాం.శ్రీలక్ష్మి, సీడీపీఓ తాండూరు

# ఏటా ముంపు .. పరిహారానికి ఎదురుచూపు

గంగాధర: ఉమ్మడి జిల్లాలో యాసంగి పంటలకు నీరందించేందుకు గంగాధర, నారాయణపూర్ జలాశయాలను ఎల్లంపల్లి ప్రాజెక్టుతో నింపుతారు. అయితే ఏడాది పొడవునా నీటి నిల్వతో ముంపు పొంచి ఉంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఈ సమస్య ఏ ఒక్క ఏడాదో కాదు.. కొన్నేళ్లుగా పడుతున్న ఇబ్బందులు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ పరిస్థితి మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ నారాయణపూర్ గ్రామాన్ని సందర్శించినా అడుగు ముందుకు పడలేదని ఆవేదన చెందుతున్నారు.

**ఇళ్లలోని సరకులు తడిసిపోతూ..**

ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రాంతాలకు గంగాధర, నారాయణపూర్ జలాశయాలు ప్రధాన నీటి వనరుగా నిలిచాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఈ రెండింటిని నింపి ఇక్కడి నుంచి జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నారు. అయితే 0.3 టీఎంసీ సామర్థ్యంగల ఈ చెరువుల కట్టలను అభివృద్ధి చేయకుండా ఏళ్లుగా నీటిని నింపుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారాయణపూర్ చెరువు నిండుకుండలా మారి దిగువకు ప్రవహించగా.. ఇళ్లలోకి నీటిఊటలు వచ్చి గోడలు తడిసిపోయాయి. సరకులు తడిసి ఇబ్బందులు పడుతున్నారు.

**రూ.పది లక్షలు.. ప్రకటనకే పరిమితం**

నారాయణపూర్, గంగాధర చెరువుల కింద 236 ఎకరాల వ్యవసాయ



భూములతోపాటు బావులు, పైపులైన్లకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. పదేళ్ల కిందటే రూ.10 లక్షల చొప్పున అవార్డు ప్రకటించినా.. ఇంతవరకు మంజూరు చేయలేదు. మంగపేటలో 11 ఇళ్లు, నారాయణపూర్ చెరువు కట్ట కింద 32 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని గతంలో అధికారులు గుర్తించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఇప్పటివరకు ఒక్క పైసా ఇవ్వలేదు.

**బాధితులను ఆదుకుంటాం** ముంపునకు గురవుతున్న గ్రామాల్లో ఇళ్లను సర్వే చేసి పరిహారం చెల్లిస్తాం. మొదటి విడతలో రూ.23 కోట్ల నిధులకు ప్రభుత్వం అంగీక రించింది. చర్లపల్లి ఎన్, ఇస్తారుపల్లిలో ముంపు సమస్యలు తీరుస్తాం. ఏ ఇళ్లకు నష్టం జరుగుతుందో వారికి న్యాయం చేస్తాం. ప్రాజెక్టు కింద కోల్పోయిన వ్యవసాయ భూములు, బావులు, పైపులైన్లకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయిం చనుంది. నారాయణపూర్ ప్రాజెక్టును విస్తరిస్తాం.మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే

# కలిసొచ్చిన కాలం.. ఉబికివచ్చిన జలం

జగిత్యాల : వానాకాలం చివరి దశకు రాగా జిల్లాలోని చాలా మండలాల్లో భూగర్భ జలాలు తక్కువ లోతులోనే ఉన్నాయి. ఈ సీజన్‌లో సాధారణం కన్నా అధిక వర్షం కురవడంతో వానాకాలంలో అంచనాకు మించి 4.40 లక్షల ఎకరాల్లో(102 శాతం) పంటలు సాగయ్యాయి. వరి సాగు విస్తీర్ణం 3.16 లక్షల ఎకరాలు దాటడం ద్వారా రాష్ట్రంలోనే జిల్లా నాలుగో స్థానంలో నిలిచింది. పసుపు సాగు విస్తీర్ణంలో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలోనే ఉండటంతో వానాకాలం పంటలను ఇబ్బంది లేకుండా చేతికొస్తున్నాయి. మొక్కజొన్న, పెసర, సోయా తదితర పంటలు పూర్తవుతుండగా వరి కోతలు ప్రారంభం కానున్నాయి. అందుబాటులోని భూగర్భ జలాలతో బావులు, బోర్ల ఆధారంగా, ఎస్సారెస్పీ నీరు యాసంగి సాగుకు ఉపకరిస్తుందని భూగర్భ జలవనరులఅధికారి నాగరాజు పేర్కొన్నారు.

# ఆహార వ్యర్థాలతో బయో ఇంధనం




హైదరాబాద్: విద్యార్థులకు పాఠాలు చెబుతూ... వారితో పరిశోధనలు చేయిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో ఆహార వ్యర్థాలను బయో ఇంధనంగా మార్చుతున్నారు. వసతి గృహాల్లోని ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్‌ను తయారుచేస్తున్నారు. వర్సిటీలోని మహిళా వసతి గృహంలో రోజుకు రెండు టన్నుల ఆహార వ్యర్థాలను ఇంధనంగా మార్చే ప్లాంట్‌ను కొద్దినెలల క్రితం ఏర్పాటు చేశారు. దీని వెనుక వసతిగృహాల పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆచార్యులు ఉన్నారు. విశ్వవిద్యాలయంలో వంట చేసేందుకు ఎల్పీజీ గ్యాస్ రోజుకు పది సిలిండర్లు అవసరం. వాటిని వాణిజ్య కేటగిరీలో తీసుకోవాలి. ఒక సిలిండర్ రూ.1800 అనుకున్నా.. రోజుకు పది సిలిండర్లకు రూ.18 వేలు ఖర్చవుతుంది. నెలకు రూ.5.40 లక్షలు.. ఏటా రూ.64.80 లక్షల బిల్లు అవుతుంది. ఇది కేవలం ఒక్క వసతిగృహానికే. విద్యార్థులకు భోజనం, అల్పాహారం చేసిపెట్టాలంటే అధికంగా ఖర్చవుతుందని అంచనా వేశారు. మిగిలిపోయిన అన్నం, కూరలు, అల్పాహారాన్ని పారవేసే బదులు ఇంధనంగా మార్చాలనుకున్నారు. బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం నిపుణులతో చర్చించారు. ప్లాంటు ఏర్పాటుకు కనీసం రూ.కోటి నుంచి రూ.1.25 కోట్లు అవసరమని భావించారు.

**దాతల సహకారంతో సాకారం**

ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరిస్తున్న కొందరు దాతలను వర్సిటీ ఉన్నతాధికారులు, ఆచార్యులు గతేడాది సంప్రదించారు. కేఎంపీజీ సంస్థ, సాహస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.90 లక్షలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. యంత్రాలు, పరికరాలను కొనుగోలు చేశాక మహిళా వసతిగృహంలో రోజుకు రెండు టన్నుల ఆహార వ్యర్థాలను శుద్ధిచేసి బయోగ్యాస్‌గా మార్చే ప్లాంట్‌ను ప్రారంభించారు. వర్సిటీలోని విద్యార్థినీ, విద్యార్థుల వసతి గృహాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను రోజూ విద్యుత్తు వాహనాల ద్వారా సేకరించి ప్లాంట్‌కు సమీపానికి చేర్చుతున్నారు. ఆహార వ్యర్థాలు అన్నింటినీ ఒకచోటికి చేర్చి ప్లాంట్‌లో వేస్తున్నారు. పైపుల ద్వారా వసతిగృహంలోని వంటశాలకు బయోగ్యాస్‌ను అందిస్తున్నారు.

# మూసీ సరికొత్త సొబగుల అంచనా



వికారాబాద్ :మూసీ నదిలోకి చుక్క మురుగు చేరకుండా పటిష్ఠ కార్యాచరణకు ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. ఎస్టీపీలు ఏర్పాటు చేస్తున్నా సీవరేజీ నెట్‌వర్క్‌లేని ప్రాంతాల నుంచి శుద్ధి లేకుండానే మూసీ చేరుతోంది. 1450 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఓఆర్ఆర్ వరకు విస్తరించిన మహా నగరం నదికి ఇరువైపులా ఉంది. వందశాతం మూసీలోకి చేరుతున్న మురుగునీటిని సేకరించేలా ట్రంక్ మెయిన్‌లను ప్రతిపాదించారు. డీపీఆర్ సిద్ధమైన నేపథ్యంలో నిధుల సమీకరణపై రాష్ట్ర ప్రభుత్వం వివిధ అవకాశాలను అధ్యయనం చేస్తున్నట్లు తెలిసింది.

పథకం: మూసీ ప్రక్షాళన, పరివాహక ప్రాంత అభివృద్ధి

లక్ష్యం: శుద్ధి చేయని మురుగు మూసీలో చేరకుండా అరికట్టడం

సమస్య: ప్రధాన నగరంలో మిహహా మిగిలిన ప్రాంతాల నుంచి మూసీలోకి, స్థానిక చెరువుల్లోకి మురుగు చేరుతోంది.

ఏం చేస్తారంటే?: నదికి ఇరువైపులా 55 కి.మీ. ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు

మురుగు శుద్ధి ఇలా..

ప్రధాన నగరం: 100 %

ఓఆర్ఆర్ ప్రాంతాలు20 %

ఇతర ప్రాంతాలు: 70 %

గ్రేటర్ పరిధిలో ఇలా..రోజూ వచ్చే మురుగు 1950 ఎంఎల్‌డీలు

ఈ నెలలో పూర్తయ్యే ఎస్టీపీలు 45

నవంబరు నుంచి శుద్ధి అయ్యే మురుగు 1878 ఎంఎల్‌డీలు

2036 నాటికి నగరంలో ఏర్పడే మురుగు 2800 ఎంఎల్‌డీలు

అమృత్ 2.0లో ఇటీవల శంకుస్థాపన చేసిన ఎస్టీపీలు 39

# అతిగా ఆశించకు.. వంచనకు గురికాకు!




వికారాబాద్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం చరవాణి కాలర్ టోన్ సందేశం వినిపిస్తోంది. నకిలీ రుణ యాప్‌లు, సైబర్ నేరాలు జరిగే తీరుపై పోలీసులు కళాజాత బృందాలతో తరచూ ప్రదర్శనలు ఇస్తున్నారు. విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సైబర్ కాంగ్రెస్ ప్రాజెక్టు పేరిట శిక్షణ ఇచ్చి సైబర్ నేరాలపై ప్రజలను చైతన్య పర్చాలని అంబాసిడర్లుగా నియమించారు. వీటితో పాటు సైబర్ నేరాల తీరుపై పోలీసులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లాలో 20 మంది స్టేషన్ రైటర్లను వారియర్లుగా నియమించి శిక్షణ ఇచ్చారు.

**వారియర్ల విధులు**

సైబర్ మోసాలను పసిగట్టడం

వాటిని ఎలా ఎదుర్కోవాలన్న వ్యూహం

సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన

బాధితులకు సలహాలు, సూచనలు ఇవ్వడం

కారణాలు..సైబర్ నేరాలు, మోసాలు ఎలా జరుగుతాయన్నది పరిజ్ఞానం లోపించడం. అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తే వినిపించుకోకపోడం. స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్నా ఆపరేట్ చేసేందుకు పరిజ్ఞానం లేకపోవడం

మోసపోతే ఎవరిని సంప్రదించాలనేది తెలియకపోవడం

కొన్ని సంఘటనలు తాండూరులో ఓ వ్యాపారికి అపరిచిత యువతి నుంచి ఫోన్ రావడంతో మాట్లాడాడు. తీయని మాటలు చెప్పడంతో ఆమె వలలో చిక్కి నగదు సమర్పించుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేధింపులు ఆగిపోయాయి.

వికారాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారికి తెలియని వ్యక్తి నుంచి డబ్బులు వచ్చాయి. వాటిని తిరిగి ఇవ్వమని అభ్యర్థించడంతో పంపించాడు. ఇంతలోనే అతని ఖాతానుంచి రూ.వేలల్లో డబ్బులు మాయమయ్యాయి.

అపరిచితులతో ఫోన్‌లో మాట్లాడొద్దు..

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకు ఖాతా నంబర్లు చెప్పవద్దు. మోసపోతే జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ)కు ఫిర్యాదు చేయాలి. వెంటనే ఆ నగదు ఇతర ఖాతాల్లోకి జమ కాకుండా నిలిపి వేస్తాం. జిల్లా పరిధిలో నెలకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. తెలియని లింక్‌లు, అపరిచితులతో ఫోన్ మాట్లాడవద్దు.

కాజల్ జైస్వాల్, డీఎస్పీ, సైబర్ నేరాల నియంత్రణ, వికారాబాద్

ఫిర్యాదు ఇలా: 1930 లేదా డయల్ 100కు ఫోన్ చేయాలి

పోలీసు ఠాణాలు: 20

అందిన ఫిర్యాదులు: 535 (ఇప్పటి వరకు)

నమోదు చేసిన కేసులు: 363

ఫ్రీజ్ చేసిన మొత్తం: రూ.54.1 లక్షలు

180 కేసుల్లో బాధితులకు అందజేసింది: రూ.28.56 లక్షలు

నష్టపోయింది: రూ.1.87 కోట్లు

# ప్రయాస ప్రాంగణాలు

కోరుట్ల : జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో అరకొర వసతులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చాక ప్రయాణికుల సంఖ్య పెరిగింది. సరిపడా బస్సులు సమకూర్చకపోగా, ప్రయాణ ప్రాంగణాలను ఆధునీకీకరించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంస్థకు లాభాలను తీసుకొస్తున్న కార్గో సెంటర్లకు వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**వాహనాలు నిలిపే చోటేదీ!**

జగిత్యాల ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో స్థానిక డిపోతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న బస్సుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ప్లాట్‌ఫాంలు సరిపోవడం లేదు. ప్రాంగణం నుంచి మరుగుదొడ్ల వరకు పైకప్పు లేకపోవడంతో వర్షం కురిసినపుడు ప్రయాణికులు తడవాల్సి వస్తోంది. కార్గో కేంద్రం వద్దనే వాహనాల పార్కింగ్ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌కు వచ్చే ప్రైవేటు వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలం లేకపోవడంతో సమస్యగా మారింది.

**అరకొర ప్లాట్‌ఫాంలు.. అపరిశుభ్రత**

కోరుట్ల ప్రాంగణంలో బస్సులు నిలిపేందుకు ప్లాట్‌ఫామ్‌లు సరిపడా లేకపోవడంతో బొమ్మెన, దేశాయిపేట మార్గాల్లో వెళ్లే బస్సులను మరుగుదొడ్ల ముందే నిలుపుతున్నారు. దుర్గంధంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. బస్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి, వ్యర్థాలు పేరుకుపోవడంతో చిత్తడిగా మారింది. బస్టాండ్




ఆవరణలోని 6 సీసీ కెమెరాలకు అనుసంధానించిన కంప్యూటర్‌లో స్టోరేజీ నిండిపోవడంతో ఫుటేజీ నిక్షిప్తం చేసే వీల్లేకుండా పోయింది. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీఎం కొన్ని నెలలుగా పని చేయడం లేదు. రెండు టీవీలు ఏర్పాటు చేసినా ఆరు నెలల క్రితం తొలగించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపైనే బస్టాండు ఉండటంతో ఖాళీ స్థలంలో దుకాణ సముదాయాలు నిర్మిస్తే ఆర్టీసీకి రూ.లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశమున్నా పట్టించుకోవడం లేదు.

**బస్సుల కోసం చెట్ల కింద నిరీక్షణ**

సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన మెట్‌పల్లి బస్టాండ్ నిర్మాణం శిథిలావస్థకు చేరింది. జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు కూడలిగా ఉండటంతో నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. కేవలం 5 ప్లాట్‌ఫాంలు ఉండటంతో ప్రయాణికులు చెట్ల కింద నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. అసలే ప్లాట్‌ఫాంలు సరిపోకపోగా అదే చోట కార్గో కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూత్రశాలల మార్గంలో కార్గో పార్సిళ్లను అడ్డుగా పెడుతుండటం అసౌకర్యంగా మారింది. బస్టాండ్ ఆవరణలో మురుగు కాలువలు లేక చిన్నపాటి వర్షానికే బురదమయమవుతోంది.

# మాడవీధి స్థలం.. అప్పగింతకు రంగం సిద్ధం

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ మాడవీధి స్థలాన్ని దేవస్థానానికి అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. భవిష్యత్తులో రూ.350 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వీలుగా ఈ జాగాను రామాలయానికి ఇచ్చేందుకు రెవెన్యూశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన దస్త్రాలను అధికారులు తయారుచేశారు. అన్నీ అనుకూలిస్తే ఈ స్థలం దస్త్రాలను రామాలయం ఈఓ దామోదర్‌రావుకు బుధవారం అందించనున్నారు. రామాలయానికి దక్షిణం, తూర్పు, పడమర వైపు 43 గృహాలు ఉండగా వీటిని తొలగించారు. పూర్తిస్థాయి ప్యాకేజీలకు రూ.60.20 కోట్లు అవసరమని అంచనా వేశారు. తొలి విడతగా రూ.34.45 కోట్లు కేటాయించారు. ఈ మొత్తాన్ని నిర్వాసితులకు చెల్లించి ఇళ్లను తొలగించి చదును చేశారు. ఇందులో 1.30 ఎకరాల స్థలం ఉండగా రహదారులు పోగా మిగతా స్థలం దేవస్థానం సొంతం కానుంది.

**నత్తనడకే నయం..!**

నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో సుమారు మూడున్నర ఎకరాల ఖరీదైన స్థలం కేటాయించారు. ఇందులో తుప్పలు, రాళ్లగుట్టలు ఉండటంతో సుమారు నాలుగు నెలలుగా యంత్రాల సాయంతో చదును చేసే పనులు కొనసాగిస్తున్నారు. ఎక్కువ యంత్రాలను ఉపయోగించే వీలున్నా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగే వ్యవహరిస్తే



దసరా నాటికి కూడా పనులు పూర్తవుతాయో లేదో అంతు చిక్కటం లేదు. 43 కుటుంబాలకు సంబంధించి 72 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి. ఇందులోనే రహదారులకు కొంత జాగా వదులుతారు. విద్యుత్తు లైన్లు, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. నిర్వాసితులకు రూ.7.50 లక్షల చొప్పున ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలి. దేవస్థానం అభివృద్ధి కోసం అందరితో పాటు మా కుటుంబానికి చెందిన ఇంటి స్థలాన్ని అప్పగించాం. నష్టపరిహారం ఇచ్చారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ సత్వరం చెల్లిస్తామని అధికారులు చెప్పి మమ్మల్ని ఖాళీ చేయించారు. ఇప్పుడు దీని ఊసెత్తటం లేదు. కాలనీ నిర్మాణానికి బ్రిడ్జి సెంటర్‌లో స్థలం చూపించినా ఎప్పటికి అప్పగిస్తారో తెలియదు.

**కాకరాల శర్మ, నిర్వాసితుడు**

రామాలయం పక్కన ఇళ్లను తొలగించగా వచ్చిన స్థలాన్ని దేవస్థానం ఈఓకు అప్పగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ త్వరలోనే అందుతుంది. వారికి బ్రిడ్జి సెంటర్‌లో కేటాయించిన స్థలాన్ని నివాస యోగ్యంగా మార్చుతున్నాం.

ఎం.వెంకటేశ్వర్లు, తహసీల్దారు, భద్రాచలం

చురకలు



# కొత్త కార్డుదారుల ప'రేషన్'

సూర్యాపేట : 'నూతనకల్ మండలానికి చెందిన ఏనుగ శిరీష రేషన్ కార్డు కోసం ఏడేళ్లుగా నిరీక్షించింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా ఆమెకు నెల రోజుల క్రితం రేషన్‌కార్డు వచ్చింది. బియ్యం కోసం రేషన్ దుకాణానికి వెళ్లగా కార్డ్ అప్‌డేట్ కాలేదు.. వచ్చే నెల ఇస్తామని డీలర్ చెప్పడంతో నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. అధికారులు స్పందించి తనకు బియ్యం వచ్చే విధంగా చూడాలని కోరుతోంది.'

**పదేళ్ల నిరీక్షణ..**

తర్వాత కొత్తగా రేషన్ కార్డులు మంజూరవడంతో లబ్ధిదారులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలనలో.. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి అధికారుల పరిశీలన అనంతరం విడతల వారీగా మంజూరవుతున్నాయి. జూన్‌లో మూడు నెలలకు సంబంధించి ఒకేసారి బియ్యం పంపిణీ చేయగా.. అందులో కొత్త కార్డులు పొందిన వారిలో కొందరికే బియ్యం అందజేశారు. ఈ మూడు నెలల వ్యవధిలో దరఖాస్తు చేసుకొని రేషన్ కార్డు వచ్చిన లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి బియ్యం పంపిణీ చేస్తున్నారు. కాగా కొందరు లబ్ధిదారులకు



బియ్యం పంపిణీలో వింత సమస్య ఎదురవుతోంది. కార్డు అప్‌డేట్ లేని కారణంగా డీలర్లు బియ్యం పంపిణీ చేయడం లేదు. దీంతో ఆయా లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. కార్డు వచ్చినా బియ్యం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు.

**వెంటనే అప్‌డేట్ చేస్తున్నాం: శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్‌వో, సూర్యాపేట**

ప్రతి నెల కొత్తగా రేషన్ కార్డులు వచ్చిన వారి వివరాలు బియ్యం పంపిణీ కోసం 25వ తేదీ వరకు అప్‌డేట్ చేస్తున్నాం. వారికి మాత్రమే మరుసటి నెల బియ్యం పంపిణీ చేస్తారు. 25వ తేదీ అనంతరం మా వద్దకు వస్తే అప్పుడు అప్‌డేట్ చేస్తే ఆ మరుసటి నెల నుంచి బియ్యం వస్తాయి. రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కార్డులు వచ్చిన ప్రతి ఒక్కరికి బియ్యం అందుతాయి.

# రైతు వేదికలో యూరియా

మిర్యాలగూడ : యూరియా సరఫరాలో సమస్యతో రైతులు ఎరువుల దుకాణాలు, పీఏసీఎస్‌ల ఎదుట బారులు తీరకుండా ఉండేలా రైతు వేదికల్లో యూరియా అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించి ంది. ఈ మేరకు పీఏసీఎస్‌లు అందుబాటులో లేని ప్రాంతాల్లో రైతు వేదికల్లో యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు విక్రయించనున్నారు. వ్యవసాయశాఖ అధికారులు, పీఏసీఎస్ సిబ్బంది పర్యవేక్షణలో రైతు వేదికల్లో యూరియాను విక్రయిస్తే సమీప గ్రామాల రైతులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా రద్దీని తగ్గించవచ్చనేది ప్రభుత్వ ఉద్దేశం. జిల్లాలో ప్రధాన స్టాక్ పాయింట్‌గా ఉన్న మిర్యాలగూడకు ఇతర ప్రాంతాల నుంచి రైతులు వస్తుండగా ఇక్కడి రైతులకు యూరియా లభించడం లేదని గుర్తించిన అధికారులు రైతు వేదికల పరిధిలోనే




ఇవ్వాలని నిర్ణయించారు. జిల్లాలో రైతు వేదికలను గుర్తిస్తున్నామని వాటిలో యూరియా నిల్వలు అందుబాటులో ఉంచుతామని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు.

**జిల్లాలో ఎంపిక చేసిన వేదికలు ఇవే...**మొలకచర్ల, రామడుగు, కుపాశిపల్లి, చందంపేట, బంగారిగడ్డ, కుర్మేడ్, కొండ్రపోల్, కమలాపూర్, చెర్యాకుపల్లి, గట్టుప్పల్, గుడిపల్లి, భీమారం, ఇప్పాలగూడెం, పెండ్లిపాకల, ధర్మాపురం, మునుగోడు, చందుపట్ల, పాలెం, జీకే అన్నారం, దోమలపల్లి, అప్పాజీపేట, సుంకిశాల, అక్కినేపల్లి, నెమ్మాని, అమ్మనబోలు, నేరేడుగొమ్ము, ముప్పారం, రేగులగడ్డ, పర్వేదుల, ఎస్‌జీ కొత్తపల్లి, మాదారం, తిరుమలగిరి, పెద్దదేవులపల్లి, రావులపెంట రైతు వేదికల్లో యూరియా నిల్వలు అధికారులు గుర్తించారు.

## చెరువుల్లో నీళ్లు.. గుట్టలపై అక్రమార్కుల కళ్లు

సంగారెడ్డి : జిల్లాలో ఇటీవల జోరుగా వర్షాలు కురిశాయి. జల వనరులు కళకళలాడుతున్నాయి. అక్రమార్కులకు వీటిలో మట్టి తవ్వకాలు వీలుకాక పోవడంతో సమీప గుట్టలు, అసైన్డ్ స్థలాలపై కన్నేశారు. రాత్రి, పగలనే తేడా లేకుండా తవ్వకాలు చేపడుతూ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు తరలిస్తూ రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులకు రాజకీయ అండదండలు ఉండటంతో అధికారులు చర్యలకు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, కొండాపూర్, అందోలు, పుల్కల్, చౌటకూర్, మునిపల్లి, వట్‌పల్లి, హత్నూర, తదితర మండలాల్లో జోరుగా ఈ దందా కొనసాగుతోంది.

**హత్నూర మండలంలో జోరుగా..**

హత్నూర మండలం సిరిపుర, కాసాల, బ్రాహ్మణగూడ, సికింద్లాపూర్, దేవునిగుట్ట తదితర ప్రాంతాల్లో మట్టి దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ, అటవీ భూముల్లో రాత్రి వేళలో యంత్రాలతో తవ్వకాలు చేపట్టి వెంచర్లు, పరిశ్రమల అవసరాలు, గృహ నిర్మాణాలకు తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.6వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక్కడ గుట్టలూ కనుమరుగు అవుతున్నాయి.

**పెరిగిన నేతల ఒత్తిళ్లు**

మట్టి తవ్వకాలు జోరుగా సాగే ప్రాంతాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోని తీరుపై విమర్శలొస్తున్నాయి. అప్పుడప్పుడు ఈ అధికారులు మట్టి టిప్పర్లను పట్టుకున్నా.. వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

**జిల్లాలోని మిగతా చోట్ల..**జహీరాబాద్ మండలం శేఖాపూర్, దిడ్గి, కోత్తూర్-బి, ఝరాసంగం మండలం పొట్టిపల్లి, కోహీర్ మండలం చింతలఘాట్, తదితర గ్రామాల్లో మట్టి తవ్వకాలతో గుట్టలు కరిగిపోతున్నాయి. చింతలఘాట్‌లో అర్ధరాత్రి జేసీబీతో తవ్వుతుండగా ఇటీవల మట్టి పెళ్లలు మీదపడి డ్రైవర్ మృతిచెందాడు. కొండాపూర్ మండలం గొల్లపల్లి, మునిదేవునిపల్లి తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్, ఇస్మాయిల్‌ఖాన్‌పేట, కంది మండలం బ్యాతోల్, చిద్రుప్ప, మామిడిపల్లి, కాశీపూర్ తదితర గ్రామాల్లో మట్టి దందాను అడ్డుకునే వారు కరవయ్యారు.విచారణకు ఆదేశాలు జారీచేస్తాం అసైన్డ్, ప్రభుత్వ భూములు, గుట్టల్లో ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు. వెంటనే పరిశీలించాల్సిందిగా తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తాం. అక్రమార్కులు ఎంతటివారైనా వదిలిపెట్టం.సీహెచ్ రవీందర్‌రెడ్డి, ఆర్డీవో, సంగారెడ్డి

# పరస్పర బదిలీలు.. పైరవీలకు దారులు



కరీంనగర్ : జిల్లా విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటులో ఇష్టారాజ్యం నెలకొంది. రాష్ట్ర విద్యాశాఖ నిబంధనలకు అధికారులు తిలోదకాలు పలికారు. పలుకుబడి, పైరవీలకు పెద్దపీట వేసి దూర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని కరీంనగర్ చుట్టుపక్కల బడులకు సర్దుబాటు చేశారు. ఉత్తర్వుల జారీ తర్వాత కూడా కొందరికి అవకాశం కల్పించడం ఉపాధ్యాయుల్లో చర్చకు దారి తీస్తోంది. సర్దుబాటులో పరస్పర డిప్యుటేషన్లు కల్పించవద్దనే నిబంధన ఉన్నా జిల్లాలో పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల పదోన్నతుల అనంతరం అవసరమున్న పాఠశాలలకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో పైరవీలు, సిఫారసులు భారీగా చేయనున్నారనే చర్చ జరుగుతోంది. గత నెలలో విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన అవసరమైన పాఠశాలలకు మిగులుగా ఉన్న 123 మంది ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ సర్దుబాటు చేసింది. వీణవంక మండలంలోని కనపర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఒకరు మొదట్లో ఓ ప్రజాప్రతినిధి సిఫారసుతో గత నెలలో జరిగిన సర్దుబాటుకు దరఖాస్తు చేసుకోగా.. పరిశీలించిన జిల్లా విద్యాశాఖ పక్కన బెట్టింది. తీరా ఈనెల 11న అదే ఉపాధ్యాయుణ్ని కరీంనగర్ రూరల్ మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాలకు సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖలోని కొందరు అధికారులు ముడుపులు తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది.

వీణవంక మండలంలోని హిమ్మత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీని రామడుగు ప్రాథమిక పాఠశాలకు, అక్కడ పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీని ఇక్కడికి పరస్పర డిప్యుటేషన్‌పై సర్దుబాటు చేస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

కరీంనగర్ సమీపంలోని తీగలగుట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోని టీచర్‌ను జమ్మికుంట మండలం వావిలాలకు, ఇక్కడ పనిచేస్తున్న టీచర్‌ను అక్కడికి పరస్పర ఒప్పందంపై సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. **రాష్ట్ర విద్యాశాఖ చొరవ అవసరం**

సర్దుబాటులో వెళ్లిన ఉపాధ్యాయులకు పరస్పర డిప్యుటేషన్లకు ఆస్కారంలేదని రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన నిబంధనల్లో స్పష్టంగా ఉన్నా... పైరవీలకు దారులు తెరిచారు. రాష్ట్ర విద్యాశాఖ చర్యలకు ఉపక్రమిస్తే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయనే చర్చ నడుస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులు, ఉన్నతాధికారుల కుటుంబ సభ్యులకు కూడా సర్దుబాటులో పెద్దపీట వేసి కరీంనగర్ సమీపానికి తీసుకొచ్చారు. చాలామంది కరీంనగర్ సమీపంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా విద్యాశాఖలోని ఇద్దరు, ముగ్గురు అధికారులు ఈ పరస్పర డిప్యుటేషన్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ స్పందించి సర్దుబాటులో పలుకుబడి కేటాయింపులు, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన వ్యవహారాలపై విచారణ చేసి చర్యలు చేపట్టాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# పురోగతి లేని ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు



గోదావరిఖని: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ పనుల్లో పురోగతి లేకుండా పోయింది. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగి ఎనిమిది నెలలు గడిచినా కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అనుమతి రాలేదు. దీంతో రామగుండంలో నిర్మించ తలపెట్టిన ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ(2400 మెగావాట్లు) 800 మెగావాట్ల మూడు యూనిట్ల పనులు మొదలు కాలేదు. ఇందులోని 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రానికి సంబంధించి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదిరింది. ఒక యూనిట్ విద్యుత్తు రూ.4.12 పైసల చొప్పున కొనుగోలుకు ఈఆర్‌సీ ఆమోదం తెలిపింది. ఏప్రిల్ నెలలో అవగాహన కుదిరింది. మిగతా రెండు యూనిట్లకు సంబంధించి ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదరలేదు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం పనులు వేగంగా సాగుతాయని ఆశించినప్పటికీ ఎలాంటి కదలిక లేదు.ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ పనులకు కేంద్ర పర్యావరణ శాఖ నుంచి ఇంకా అనుమతులు రాలేదు. మొదటి దశలో (1600 మెగావాట్లు) 800 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లను నిర్మించింది. రెండో దశలో 2400 మెగావాట్ల మూడు విద్యుత్తు కేంద్రాలను నిర్మించాల్సి ఉంది. దీనికి సంబంధించి పర్యావరణ అనుమతులతో పాటు రెండు యూనిట్లకు పీపీఏ(విద్యుత్తు కొనుగోలు ఒప్పందం) చేసుకోవాల్సి ఉంది. కేవలం ఒక యూనిట్‌లో ఉత్పత్తయ్యే విద్యుత్తు కొనుగోలుకు అవగాహన కుదిరింది. ఈ ఏడాది జనవరి 28న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. దీనికి సంబంధించిన అభిప్రాయాలను కేంద్ర పర్యావరణ శాఖకు కాలుష్య నియంత్రణ మండలి నివేదించింది. ఎనిమిది నెలలు గడిచినా అనుమతులు రాకపోవడంతో పురోగతి లేకుండా పోయింది.

**తగ్గిన విద్యుత్తు డిమాండ్‌తో సందేహాలు**

రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ తగ్గడంతో ప్రాజెక్టు నిర్మాణంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మిగులు విద్యుత్తు ఉండే పరిస్థితి నెలకొంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కేవలం ఒక యూనిట్(800 మెగావాట్ల)లో ఉత్పత్తి చేసే విద్యుత్తుకు మాత్రమే కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. మిగతా రెండు యూనిట్లకు సంబంధించి ఎలాంటి అవగాహన కుదరలేదు. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలంటే ఒకేసారి మూడు యూనిట్లకు సంబంధించిన పనులు మొదలు పెట్టాల్సి ఉంటుంది. విద్యుత్తు డిమాండ్ తగ్గడంతోనే నిర్మాణానికి జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**విభజన చట్టంలో భాగం**

రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తెలంగాణ కోసం 4000 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించాల్సి ఉంది. దీని ప్రకారం ఎన్టీపీసీ సంస్థ రామగుండంలో 4000 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర విభజన అనంతరం చేపట్టాల్సిన పనులు ఆలస్యమయ్యాయి. ఎట్టకేలకు మొదటి దశలో 1600 మెగావాట్ల రెండు యూనిట్లు నిర్మించింది. గతేడాది నుంచి పూర్తిస్థాయిలో ఈ ప్లాంట్ల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. రెండో దశ పనులపై జాప్యం నెలకొంది. వీటిని 2030 నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

# అందుబాటులో ఇసుక.. పనులు ఆగవిక



కొత్తగూడెం: ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు తొలగనున్నాయి. కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) ఇసుక బజార్లు ఏర్పాటు చేసింది. నేటి నుంచి విక్రయం చేపట్టాలని నిర్ణయించింది. తొలుత కూసుమంచిలో ఏర్పాటు చేసిన ఇసుక బజారును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతోపాటు మరో వారం రోజుల్లో సత్తుపల్లి, మధిర, ఖమ్మం, కామేపల్లి, వైరా బజార్లలో కూడా అందుబాటులో రానున్నాయి.

**నిర్వహణ మహిళా సంఘాలదే..**ఇసుక బజార్ల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకుగాను టన్నుకు రూ.100 సంబంధిత సంఘానికి చెల్లించనున్నారు. రికార్డుల నిర్వహణ మొదలు అన్ని పనులను వీరే చూస్తుంటారు. మైనింగ్ విభాగం పర్యవేక్షిస్తుంది. మహిళా సంఘాల బలోపేతమూ లక్ష్యంగా ప్రభుత్వం ఇసుక బజార్లను ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు.

**టన్నుకు రూ.1,100** వర్షాకాలం వాగుల్లో వరద ప్రవాహంతో ఇసుక తీయడం కష్టంగా మారింది. దీని ప్రభావం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై పడింది. సమస్యను పరిష్కరించడంతో పాటు నాణ్యమైన గోదావరి ఇసుకను లబ్ధిదారులకు అందించేందుకు ఇసుక బజార్లు ఏర్పాటుచేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు టన్నుకు రూ.1,100.. మిగతా వాటికి రూ.1,300 వసూలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. హౌసింగ్ శాఖ లబ్ధిదారులు జాబితా, తహసీల్దార్ ఇచ్చిన కూపన్ల ఆధారంగా ఇసుక విక్రయాలుంటాయి. ఆన్‌లైన్‌లో బుకింగ్ ఉంటుందని ఏవైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబరు 155242ను సంప్రదించవచ్చు.

**తొలగనున్న ఆర్థిక భారం**

టీజీఎండీసీ అధికారుల తాజా నిర్ణయంతో వెతుకులాట ఇబ్బందులు తొలగడంతో పాటు ఆర్థిక భారం తగ్గనుంది. లబ్ధిదారులు బయట మార్కెట్‌లో ఇసుక కొనుగోలు చేయాలంటే టన్నుకు రూ.1,500 చెల్లించాల్సి వస్తోంది. అదే టీజీఎండీసీ ద్వారా టన్ను రూ.1,100లకే అందనుంది. రవాణా వ్యయాన్ని మాత్రమే నిర్వాహకులు వసూలు చేయడంతో ప్రాంతాలను బట్టి ధరలు మారనున్నాయి. కూసుమంచిలో టన్ను రూ.1,100లకు దొరికితే.. వైరాలో ఇంకా తక్కువకే లభిస్తుంది. దీంతోపాటు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడనుంది.

'లాభాపేక్ష లేకుండా టీజీఎండీసీ ద్వారా ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక అందించాలని మంత్రులు ఆదేశించారు. ఈ మేరకు ఇసుక బజార్లను ఏర్పాటుచేశాం. వీటి ద్వారా లబ్ధిదారుల నుంచి కేవలం రవాణా ఛార్జీలు వసూలు చేసి నాణ్యమైన ఇసుక అందిస్తాం.'శంకర్‌నాయక్, టీజీఎండీసీ పీఓ, భద్రాద్రి కొత్తగూడెం.

# జ్వరం.. ఆసుపత్రులకు వరం

మెదక్ : ఉమ్మడి మెదక్ జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లో ఇంటికొకరు జ్వరం బారిన పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన సేవలందని కారణంగా జ్వర పీడితులు ప్రైవేటు బాటపడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు దవాఖానాల్లో సాధారణ కిట్లతో నిర్ధారణ పరీక్షలు చేస్తూ.. ప్లేట్‌లెట్లు(రక్తకణాలు) కొంత తగ్గినా డెంగీగా పేర్కొంటూ.. బాధితులను ఆందోళనకు గురిచేస్తున్నారు. ప్రత్యేక చికిత్స పేరిట రూ.వేలల్లో దండుకుంటున్నారు.

**ఆందోళనకు గురిచేసి.. అడ్డగోలుగా బిల్లులేసి..**

ఇటీవల మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన రోగికి జ్వరం రాగా చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. ఎర్ర రక్తకణాలు భారీగా పడిపోయాయని ఆందోళనకు గురిచేసి ప్లేట్‌లెట్లు ఎక్కించాలని నిర్దేశించారు. రోగికి చికిత్స నిమిత్తం రోజుకు రూ.20వేల చొప్పున మూడు రోజులకు రూ.60వేలు వసూలు చేశారు.

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిమ్మాపూర్‌లో అపరిశుభ్రత కారణంగా డెంగీ ప్రబలింది. స్థానిక ఆర్‌ఎంపీ, పీఎంపీల సూచనలతో రోగులు ప్రైవేటు ఆసుపత్రుల బాట పట్టారు. ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గాయనే నెపంతో రోగుల నుంచి భారీగా వసూలు చేసిన విషయంపై స్థానికులు



వైద్యారోగ్యశాఖకు ఫిర్యాదు చేశారు.

**అమలుకు నోచని ఆదేశాలు**

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు టీ-హబ్ కేంద్రాలలో నిర్ధారణ తర్వాతే డెంగీ కేసుల వివరాలు వెల్లడించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు జారీచేశారు. ఇందుకు విరుద్ధంగా ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గగానే డెంగీగా నిర్ధారిస్తూ రోగిని బెంబేలెత్తిస్తున్నారు. ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాల్సిన వైద్యశాఖ అధికారులు మిన్నకున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మూడు జిల్లాల డీఎంహెచ్‌వోలను వివరణ కోరగా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.సంగారెడ్డి జిల్లా నారాయణరెడ్డి కాలనీకి చెందిన ఓ చిన్నారి జ్వరంతో పేరొందిన పిల్లల ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా మొదటగా వైరల్ జ్వరమని చికిత్స చేశారు. రెండు రోజులు కాగానే డెంగీగా నిర్ధారించి ప్లేట్‌లెట్లు ఎక్కించామని రెండు రోజులకు కలిపి రూ.45వేలు తీసుకున్నారు.

# ఒక్క అడుగు పడితే ఒట్టు!


మెదక్: మెతుకు సీమలో ప్రభుత్వ వైద్య కళాశాల, వసతి ఏర్పాటు కోసం నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరై రెండేళ్లు దాటింది. నిర్మాణ విషయంలో ఒక్క అడుగు ముందుకు పడలేదు. నిర్మాణ బాధ్యతలను ఒక ప్రభుత్వ శాఖ నుంచి మరో శాఖకు అప్పగించారు. ఇంకా భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో అద్దె భారం తప్పడం లేదు.

**అద్దె భవనంలో..**

జిల్లాలో ఉన్నత విద్యకు సంబంధించి ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వపరంగా లేకపోవడంతో విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిందే. 2023లో మెదక్‌కు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరైంది. వంద సీట్లను కేటాయించారు. గతేడాది నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 50 సీట్లే అందుబాటులోకి తీసుకొచ్చారు. తరగతులు ప్రారంభానికి పట్టణ పరిధి పిల్లికొట్టాల వద్ద ఓ ప్రైవేటు భవనం ఎంపిక చేశారు. గతేడాది అక్టోబరులో తరగతులు మొదలయ్యాయి. గతంలో ఇదే భవనంలో సమీకృత కలెక్టరేట్ కొనసాగింది.

**స్థల సేకరణ జరగక..**

వైద్య కళాశాల భవన, వసతిగృహ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. పట్టణంలోని చేగుంట మార్గంలో మాతాశిశు సంరక్షణ కేంద్రం నిర్మించగా, దీని పక్కనే అత్యవసర కేంద్రాన్ని (క్రిటికల్ కేర్) ఏర్పాటుచేస్తున్నారు. వైద్య కళాశాల సైతం ఇక్కడే నిర్మాణం చేపట్టాలని గతంలో నిర్ణయించారు. 2023 అక్టోబరులో శంకుస్థాపన చేశారు. కళాశాలకు 20 ఎకరాలు అవసరం. రాజ్‌పల్లికి వెళ్లే దారిలో ప్రభుత్వ భూమి ఉండటంతో 12.5 ఎకరాలు సేకరించారు. మరో 7.5 ఎకరాలు అవసరం. మాతాశిశు సంరక్షణ కేంద్రానికి వెళ్లే దారిలో పట్టా భూములను సేకరించాల్సి ఉంది. ఇది పూర్తయితే పనులు షురూ అయ్యే అవకాశం ఉంది.



గతంలో నిర్మాణ పనులను ర.భ. శాఖకు అప్పగించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థకు బదలాయించారు.

మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో.. సీట్లు: 50

ఏర్పాటైంది: 2024-25 అక్టోబరు

నిధుల మంజూరు: రూ.180 కోట్లు

భవన నిర్మాణానికి కావాల్సిన స్థలం: 20 ఎకరాలు

సేకరించింది: 12.5 ఎకరాలు

టెండర్ దశలో ఉంది శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, విద్యా,సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ వైద్య కళాశాల భవన నిర్మాణానికి సంబంధించి టెండర్ దశలో ఉంది. 7.5 ఎకరాలను సేకరించాల్సి ఉంది. సివిల్ పనులకు రూ.130 కోట్లు, యంత్రాలు సమకూర్చేందుకు రూ.50 కోట్లు కేటాయించారు. టెండర్ ప్రక్రియ పూర్తయి.. మిగిలిన స్థలాన్ని అప్పగిస్తే పనులు షురూ చేస్తాం.

# తీర గ్రామాలకు బహుళార్థక వరం

పాయకరావుపేట: ఆక్వారంగం మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మత్స్యకారులు జీవన స్థితిగతులు మార్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా కేంద్ర మత్స్యశాఖ ప్రధాని మత్స్య సంపద యోజన కార్యక్రమంలో భాగంగా (పీఎంఎంఎస్‌వై) సుమారు రూ.నాలుగు కోట్లు వెచ్చించి జిల్లాలోని పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం, పాయకరావుపేట మండలం పెంటకోట తీరాల్లో బహుళార్థక సాధక కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఒక్కో కేంద్రానికి రూ.రెండు కోట్లు కేటాయిస్తున్నారు. వీటిని అత్యంత వెనుకబడిన, తీరానికి అతి సమీపంలో ఉండే గ్రామాల్లో నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా హోంమంత్రి అనిత ఈ పనులకు ఇటీవలే శంకుస్థాపన చేశారు. ప్రధానంగా సముద్రంపై వేటతో జీవనోపాధి పొందే మత్స్యకారులకు అన్ని రకాల సౌకర్యాలతోపాటు వాణిజ్య, ఉపాధి రంగాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దేలా అందుబాటులోకి తెస్తున్నారు. తీరంలో పర్యావరణ హితంగా అన్ని వసతులు ఉండేలా ప్రణాళికలు చేపట్టారు.

**ప్రయోజనాలు ఇలా...**

ఈ కేంద్రాల వద్ద చేపలు ఎండబెట్టుకోవడానికి వీలుగా విశాలమైన పర్యావరణహితమైన ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టనున్నారు.

మత్స్యసంపద శుభ్రంచేసి మార్కెట్ చేసుకునేందుకు అనుగుణంగా నీటి వసతి.. ఉత్పత్తులు నేరుగా తరలించేందుకు రవాణా సౌకర్యం అందుబాటులోకి తెస్తారు. వాతావరణంలో ముందుగానే తెలుసుకునే శాటిలైట్ పరికరాలు, సముద్రంలో చేపలు ఎక్కువగా లభించే ప్రాంతాలను గుర్తించే ఆధునిక సమాచార వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. చేపలు నిల్వ చేసుకునేందుకు వీలుగా ఐస్ తయారీ కేంద్రంతోపాటు భారీ శీతల గది, వలలు భద్రపర్చుకునేందుకు అనువైన గదుల నిర్మాణం. తీరంలో నిరంతరం వాణిజ్యం జరిగేలా 250 హైమాస్ట్ సోలార్ దీపాలు అమరుస్తారు. మత్స్యకార యువత, మహిళలకు మత్స్య ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, హేచరీల నిర్వహణ, పెంపకం వంటి



అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు. సముద్రంలో ప్రమాదాలు జరిగితే తక్షణ వైద్య సాయం అందించేందుకు ప్రాథమిక చికిత్స పరికరాలు ఉంటాయి.

జనవరి నాటికి అందుబాటులోకి: వచ్చే జనవరి నాటికి బహుళార్థక సాధక కేంద్రాలు జిల్లాలో అందుబాటులోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందనేందుకు ఇదే నిదర్శనం. మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మత్స్య ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు చేసేలా శిక్షణ కేంద్రంతోపాటు అన్ని సౌకర్యాలతో వీటిని నిర్మిస్తున్నాం. జిల్లాలో మరిన్ని చోట్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. వంగలపూడి అనిత, హోంమంత్రి

# ఆక్రమణదారుల అనుభవం

నంద్యాల: కొలిమిగుండ్ల మండల కేంద్రంలో రూ.లక్షల విలువైన ప్రభుత్వ భూములకు బేరం పెట్టారు. ఇటిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీకి ఆనుకొని వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. అవన్నీ కొండలు, గుట్టలతో కూడుకొని ఉన్నాయి. వాటిని చదును చేసి రెండున్నర సెంట్ల చొప్పున ప్లాట్లు వేశారు. ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.లక్ష లోపే విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉండటంతో చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే 40 ప్లాట్ల వరకు అమ్మేశారు. వాటిని కొనుగోలు చేసిన వారు ఇంటి నిర్మాణానికి పునాదులు వేస్తున్నారు. వెయ్యి వరకు ప్లాట్లు చేసి విక్రయించాలన్న ఆలోచనలో ఆక్రమణదారులు ఉన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

**పుట్టుకొస్తున్న పట్టాలు**

ఆక్రమణదారులు ఏకంగా అనుభవదారు పట్టాలు పుట్టించి ఇస్తున్నారు. అనుభవదారు పట్టాలు ఇవ్వాలంటే ముందుగా వీఆర్వో ఆ దరఖాస్తును పరిశీలించాలి.. దరఖాస్తుదారు అక్కడ ఉంటున్నారా? ఉంటే ఎంతకాలం నుంచి నివాసం ఉంటున్నారు? ఆ స్థలం ఎంత విస్తీర్ణంలో ఉంది? తదితర వివరాలతో తహసీల్దారుకు నివేదిక ఇవ్వాలి. దాని ప్రకారం పట్టాలు పంపిణీ చేస్తారు.. ఇక్కడ వీఆర్వోలు అందినకాడికి దండుకుని తప్పుడు నివేదికలు ఇస్తున్నారు.

ఉప్పలపాడు గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో పోలీసులు తనిఖీ చేయగా అక్కడ విక్రయించడానికి సిద్ధం చేసిన 80 అనుభవదారు పట్టాలు దొరికాయి. ఇటిక్యాల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని విక్రయించడానికి వీలుగా వాటిని సిద్ధం చేసి పెట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వాటిని స్వాధీనం చేసుకొన్న పోలీసులు



కొలిమిగుండ్ల మండల తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు.

**విచారణలో ఆలస్యం ఎందుకో**

ఇటిక్యాల వీఆర్వో చెన్నయ్య నిబంధనలకు విరుద్ధంగా పలువురికి నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీలు) ఇవ్వడంతో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. మళ్లీ ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. ఆయన సస్పెన్షన్‌కు దారితీసిన పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి అక్రమార్కులను గుర్తిస్తే భారీ భూకుంభకోణం వెలుగులోకి వచ్చేది. కానీ ఎలాంటి విచారణ చేయలేదు. అనుభవదారు పట్టాలకు సంబంధించి పోలీసులు సాక్ష్యాధారాలతో సహా కొలిమిగుండ్ల తహసీల్దారుకు ఇచ్చినా నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. తహసీల్దారు కార్యాలయ సీళ్లు, కొందరి సంతకాలు ఉన్నట్లు సమాచారం. నిగ్గుతేల్చాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. కనీసం కేసులు కూడా పెట్టకుండా అంతులేని తాత్సారం చేస్తున్నారు. "ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. వారిచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని" తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

# మాగుడు గడ్డితో ఉపాధి



ఉరవకొండ: వారిద్దరూ సాధారణ రైతులు. పొట్టేళ్ల మేత కోసం గతంలో ఇతర ప్రాంతాల్లో మాగుడు గడ్డి కొనుగోలు చేయడానికి తిరిగి.. విసిగి వేసారిపోయారు. స్థానికంగా ఎందుకు ఉత్పత్తి చేయకూడదనే ఆలోచన.. వారిద్దరూ కలిసి ముందడుగు వేసేలా చేసింది. ప్రభుత్వం అందించే రాయితీతో యంత్రాలు సమకూర్చుకుని.. మొక్కజొన్న ఆధారిత మాగుడి గడ్డి ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మరో 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

**కొనుగోలు చేసి.. బేల్స్‌గా మార్చి..**

మొక్కజొన్న కోతకు రాకముందే ఎకరా పంటను రూ.30 వేల నుంచి రూ.42 వేలతో రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. పాల కంకి దశలోనే నూతన సాంకేతిక విధానంలో, ఆధునిక యంత్రాలతో నూర్పిడి చేసి... కొన్ని పోషకాలు కలిపి మాగుడు గడ్డి బేల్స్‌గా సిద్ధం చేస్తారు. వీటిని పశువుల దాణాగా వినియోగిస్తారు. టన్ను రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు విక్రయిస్తారు.

బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, శ్రీకాళహస్తి, నెల్లూరు తదితర ప్రాంతాల్లోని రైతులు పశువులు, జీవాల మేతకు.. ఆర్డర్ల మీద కొనుగోలు చేస్తుండటం గమనార్హం. గత నెలలో అనంత కలెక్టర్‌గా పనిచేసిన వినోద్‌కుమార్... ఉత్పత్తి కేంద్రం తీరును తెలుసుకుని.. ఇద్దరు రైతులను అభినందించారు.

**పది నెలలపాటు..**

విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన ఉమామహేష్, పాల్తూరుకు చెందిన నజీర్ మాగుడు గడ్డికి ఉన్న ప్రాధాన్యం గుర్తించారు. దశలవారీగా ఆరు యంత్రాలు, మూడు ట్రాక్టర్లు సమకూర్చుకొని.. ఏడాదిలో పది నెలలపాటు మాగుడు గడ్డిని ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.20 కోట్లు పెట్టుబడి పెట్టగా అందులో రూ.45 లక్షలు రాయితీ వచ్చింది. తద్వారా నెలకు రూ.1.20 లక్షల రుణ కంతు చెల్లింపుతోపాటు రూ.1.5 లక్షలు నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.

**రెండు నెలలకు పైగా నిల్వ**

**– నజీర్, ఉమామహేశ్**

మేము గతంలో పశువులు, జీవాల మేతకు చాలా అవస్థలు పడ్డాం. వాటిని అధిగమించడానికి కొత్త మార్గంలో నడవాలనే ఆలోచన వచ్చింది. మేము చేసిన ప్రయత్నం ఫలించింది. మాగుడు గడ్డికి సంబంధించి ఒక బేల్ రెండు నెలలకు పైగా నిల్వ ఉంటుంది. బేల్ విప్పితే వారం రోజుల వరకు వాడుకోవచ్చు.

# ఆక్రమణల్లో పెద్ద చెరువు



నంద్యాల : నంద్యాల పట్టణ శివారులోని పెద్ద చెరువు శిఖం భూమి పెద్దఎత్తున ఆక్రమణలకు గురైంది. జలవనరుల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు ఆయా భూముల్లో పంటలు సాగు చేపట్టారు. మరికొందరు దొంగ పట్టాలు సృష్టించి ప్లాట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు.

**విస్తీర్ణం తగ్గుతూ..**

నంద్యాల శివారులోని పెద్ద చెరువు 126 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో ఎస్‌ఎస్ ట్యాంకును 20 ఏళ్ల కిందటే నిర్మించారు. సర్వే నంబరు 2331–ఏలో ఉన్న ఈ భూమి మహానంది రోడ్డు నుంచి ఎస్బీఐ కాలనీ శివారు వరకు విస్తరించి ఉంది. గతంలో వేలాది ఎకరాల ఆయకట్టు దీని పరిధిలో ఉండేది. రానురాను తగ్గుతూ వచ్చి ప్రస్తుతం 40 ఎకరాలకే పరిమితమైంది. ఇటీవల పెద్ద చెరువును నూతన ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణానికి కేటాయించారు. కేసీ కాలువ పరిధిలోని ఈ చెరువును ఇటీవలే పురపాలక సంఘానికి బదలాయించారు. ఇక్కడే అసలు కథ ప్రారంభమైంది.

**ఉన్నదాంతో సరిపెట్టుకుని...**

ప్రస్తుతం పెద్ద చెరువును కేసీ కాలువ నుంచి పురపాలక సంఘానికి బదిలీ చేశారు. తమకు స్వాధీనం చేసిన భూమిలోనే నూతన ఎస్‌ఎస్ ట్యాంకును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం చెరువు ఉన్న వరకే స్వాధీనం చేసుకోవాలని.. ఆక్రమిత భూముల జోలికి వెళ్లకుండా ఉండేలా అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. మున్సిపల్, కేసీ కాలువ అధికారులు సమన్వయంతో సర్వే జరిపించి బదలాయింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ముందుగా రెవెన్యూ శాఖను సంప్రదించి సర్వేయర్లతో కొలతలు వేసి ఎంతవరకు భూమి ఉందో ఆ మేరకు స్వాధీనం చేసుకోవాలి. ఇవేమీ లేకుండా బదలాయింపు ప్రక్రియ పూర్తవడం గమనార్హం.

**ప్లాట్లుగా చేసి..**

ఆక్రమణలకు గురైన భూమి 20 ఎకరాలకు పైగా ఉంది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి విలువ రూ.50 కోట్లకుపైగా ఉంది. దీనికి సంబంధించి ఏక్‌సాల్ పట్టాలను కొందరు పుట్టించారు. మరికొందరు దొంగ పట్టాలతో సాగు చేస్తున్నారు. ఎస్బీఐ కాలనీలో పెద్ద చెరువు శిఖం భూమిని గత ప్రభుత్వ హయాంలో కొందరు ఆక్రమించి చదును చేశారు. పక్క సర్వే నంబర్లు వేసి ఈ భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించి సొమ్ము చేసుకున్నా వీరిపై కనీస చర్యలు లేవు. భూమి ఆక్రమణలకు గురైనట్లు గతంలోనే కేసీ కాలువ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సర్వే చేయించాలని రెవెన్యూ శాఖను కోరారు. అయినా తీసుకున్న చర్యలు శూన్యమే. ఈ నేపథ్యంలో భూమి ఆక్రమణలకు గురవుతూనే వచ్చింది.

**అక్రమాలు తొక్కిపెట్టి..** పెద్ద చెరువు పక్కనే మహానంది మార్గం నుంచి ఎస్బీఐ కాలనీకి వెళ్లేందుకు కొన్నేళ్ల కిందట మెటల్ రోడ్డు నిర్మించారు. పట్టణం నుంచి మహానందికి వెళ్లేందుకు ఇది దగ్గరి దారి అవుతుంది. చెరువు శిఖం భూమిలోనే ఈ మార్గం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మెటల్ రహదారి– చెరువు కట్ట మధ్య ఉన్న భూమిని కొందరు ఆక్రమించారు. ఆక్రమిత స్థలంలో దశాబ్దానికిపైగా పలువురు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. కొంత విస్తీర్ణంలో ఏకంగా మునగ తోట పెంచుతుండటం గమనార్హం. భూమి విస్తీర్ణానికి సంబంధించి జలవనరుల శాఖ వద్ద ఒక రకంగా, రెవెన్యూ దస్త్రాల్లో మరోలా ఉంది. ఇదే అవకాశంగా కొందరు అక్రమార్కులు గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల అండతో భూమిని ఆక్రమించారు.

# స్వచ్ఛతకు పట్టుగొమ్మలు

నరసరావుపేట : ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూడకుండా కొన్ని గ్రామాల్లో స్వచ్ఛందంగా గ్రామస్థులే స్వచ్ఛతకు నడుం కట్టారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా ఏళ్లుగా మురుగు కాలువలను బాగు చేసుకుంటూ వీధులను పరిశుభ్రంగా ఉంచుకుంటూ రోగాలు దరిచేరనివ్వకుండా ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంటింటా చెత్త సేకరణ విషయంలో ఐవీఆర్‌ఎస్ సర్వేలో జిల్లా రాష్ట్రస్థాయిలో 11వ స్థానంలో ఉంది. అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛత విషయంలో రాణిస్తున్న గ్రామాలపై ప్రత్యేక కథనం. **వీధులన్నీ శుభ్రం:** గురజాల మండలం పల్లెగుంత గ్రామంలోని వీధుల్లో చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుతున్నారు. ఇళ్లల్లో చెత్తను వీధుల్లోకి వచ్చే వాహనాల్లో మాత్రమే వేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించడం.. దానికి గ్రామస్థుల సహకారంతో ఇది సాధ్యమైంది. ఇదే మండలంలోని పులిపాడు గ్రామంలో విద్యావంతులు అధికం. వీళ్లూ స్వచ్ఛత విషయంలో సహకరిస్తున్నారు.

**గతంలో అవార్డు:** రొంపిచర్లలో నిత్యం హరితరాయబారులు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేపడుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా మారుస్తున్నారు. గతంలో రొంపిచర్లలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలో వ్యర్థాల నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసిన నేపథ్యంలో ఉత్తమ స్వచ్ఛ పంచాయతీ అవార్డు దక్కింది. నరసరావుపేట మండలం రంగారెడ్డిపాలెం, ఉప్పలపాడు గ్రామాల వీధులు శుభ్రంగా ఉంటున్నాయి. నూజండ్ల మండలం జంగాలపల్లిలో నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. వీధుల్లో మురుగు నిల్వలేకుండా చర్యలు తీసుకుంటున్నారు. దోమలకు ఫాగింగ్ ప్రతీరోజూ చేస్తున్నారు. ఘనవ్యర్థ నిర్వహణ కేంద్రం నడుస్తోంది. వీధుల్లో సోలార్ విద్యుద్దీపాలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసుకున్నారు. మైదానం, పార్కు కూడా అందుబాటులో ఉన్నాయి. చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం పెద్దదైనా ఊరంతా శుభ్రంగా ఉంటుంది. డ్రైనేజీ వ్యవస్థ ఉంది. దండమూడి పంచాయతీలో హరితరాయబారుల పనితీరు మెరుగ్గా ఉంది. చెత్త అనేది ఎక్కడా కనిపించదు. నకరికల్లు కండ్లకుంట గ్రామం కూడా స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుస్తోంది.

# భూచోళ్ల 'ఎత్తు'గడలు

ఆదోని : డిమాండ్ ఉన్న భూములు గుర్తించడం.. వాటి చుట్టుపక్కల ఉన్నవి చౌకగా కొనుగోలు చేయడం.. సమస్య సృష్టించడం.. నయానో భయానో డిమాండ్ ఉన్న ఆ భూములను తక్కువ ధరకు దక్కించుకొంటున్నారు. నాడు 'అధికార' అండదండలతో రెచ్చిపోయిన వైకాపా 'భూ'తాలు నేడూ తమ పంథాను కొనసాగిస్తున్నాయి. ఆదోని పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో వైకాపా నాయకుడి నిర్వాకం వల్ల వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయి.

**కర్షకుల గగ్గోలు**

"వ్యవసాయమే తమ జీవనాధారం.. పత్తి, వాము, శనగ, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేస్తున్నాం.. వచ్చిన దాంతో కుటుంబాలు పోషించుకుంటున్నాం. వైకాపా నాయకుడు పొలం కొనుగోలు చేశాక గత ఐదేళ్లుగా మా భూములు నీటిలో నానుతున్నాయి. ఫలితంగా పంటలు సాగు చేసుకోలేక అర్ధాకలితో జీవనం సాగిస్తున్నాం.. నీటి మళ్లింపునకు మేము ఏర్పాటు చేసిన పైపులు బలవంతంగా తొలగించారని" రైతులు రమేష్, మహబూబ్‌బాషా, విఠల్, గంగన్న, మల్లికార్జున తదితరులు వాపోయారు. ఆ నాయకుడిని ప్రశ్నిస్తే భూములు అమ్మాలని బెదిరింపులకు దిగుతున్నారు.. జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో అక్కడ ఎకరా రూ.కోటి వరకు పలుకుతోంది.. తమకు న్యాయం చేయాలని రైతులు విన్నవిస్తున్నారు.



**వంక పూడ్చి.. రైతులను ముంచి**

ఆదోని పట్టణ శివారు మీదుగా 167వ జాతీయ రహదారి వెళ్తోంది. రహదారి నుంచి జగనన్న కాలనీ వైపు వెళ్లే మార్గంలో వైకాపా నాయకుడు ఒకరు సర్వే నంబరు 750లో రెండెకరాలు కొనుగోలు చేశారు. ఆ భూమి వంకకు ఆనుకుని ఉండటంతో అడ్డుగా ఎత్తుగా మట్టిపోశారు. అడ్డుకట్ట వేయడంతో వర్షం నీరు పారే దారిలేక వెనుకున్న వ్యవసాయ పొలాలు ముంపునకు గురవుతున్నాయి.

సర్వే నంబరు– 190, 191లో సుమారు 50 మంది రైతులకు సంబంధించి వంద ఎకరాల సాగు భూమి ఉంది. వర్షం నీరు పారేందుకు వీలుగా ఎప్పటినుంచో వంక ఉంది. ఆ వంకను వైకాపా నాయకుడు పూడ్చేసి తన భూమిలో కలిపేసుకోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. గతంలో జగనన్న కాలనీకి నిర్మించిన రహదారి ఆనవాళ్లు లేకుండా పోయింది.

# పట్టణాల్లో జలధార

పార్వతీపురం : రానున్న 30 ఏళ్లలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఏఐఐబీ ప్రాజెక్టు పనుల్లో కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చింది. ఇటీవల మిగులు పనుల ప్రారంభానికి అవసరమైన అంచనాలను ప్రజారోగ్య శాఖ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించింది. వీటికి అనుమతులు జారీ చేయడంతో పాటు టెండర్లకు నివేదికలు సిద్ధం చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. అన్నీ సక్రమంగా జరిగితే నవంబరులో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. గత తెదేపా కాలంలో ప్రారంభమైన పనులకు తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మరోసారి భూమి పూజ చేసింది. గుత్తేదారులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆపేశారు. ప్రస్తుతం ఆ అంచనాలు భారీగా పెరిగాయి. బొబ్బిలిలో నామమాత్రంగా పనులు జరగ్గా, విజయనగరంలో ముషిడిపల్లి పథకం పైపులైను మార్చాల్సి ఉంది.

**కొత్తగా టెండర్లు..**

పార్వతీపురం, బొబ్బిలిలో పనులు చేసిన గుత్తేదారులకు గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించక పనులు అసంపూర్తిగా నిలిచాయి. అక్కడ జరిగిన పనుల మేరకు బిల్లులు చెల్లించి కొత్తగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు ప్రాజెక్టుల పూర్తికి పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి



నిధి (యూఐడీఎఫ్) బ్యాంకు రుణం మంజూరుకు అనుమతించింది.

**సవరించిన అంచనాలకు ఆమోదం..**

ఉమ్మడి జిల్లాలో సాలూరు, పాలకొండ, నెల్లిమర్ల పట్టణాల్లో పనులకు సంబంధించి అంచనాలు సవరించారు. ఈ మూడు పట్టణాల్లో రూ.46 కోట్ల మేర భారం పడనుంది. గతంలో రూ.171 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించగా ప్రస్తుతం రూ.217 కోట్లకు అంచనాలు చేరాయి. వీటిని ప్రభుత్వం ఆమోదించి డీపీఆర్‌లకు అనుమతులు మంజూరు చేసింది. ఇక్కడ ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి వచ్చిన నిధులతో పనులు చేయనున్నారు. విజయనగరం, రాజాంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా నిర్మించనున్నారు. త్వరలో పనుల ప్రారంభం..: జ్యోతి, ప్రజారోగ్య శాఖ, ఈఈ విజయనగరం తాజాగా పంపించిన డీపీఆర్‌లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పార్వతీపురం, బొబ్బిలి పట్టణాల్లోని పథకాలకు యూఐడీఎఫ్ నుంచి రుణం పొందేలా అనుమతులు వచ్చాయి. ఏఐఐబీ ప్రాజెక్టులకు త్వరలో టెండర్లు పిలుస్తాం.

# నిలువ నీడే కాదు.. నీరూ ఇస్తోంది!

బొబ్బిలి సాధారణంగా బస్టాప్ అంటే.. వాహనాలు వచ్చే వరకు నిరీక్షించడం, ఎండ, వానకు తడవకుండా ఉండటం. బొబ్బిలి పట్టణంలోని పాత బొబ్బిలి కూడలిలో ఈ బస్టాప్ మాత్రం ప్రత్యేకం. ఇక్కడ సేద తీరడమే కాకుండా 24 గంటలపాటు తాగునీటి వసతి కల్పించారు. అందుకే అంతా వాటర్ బస్టాప్ అని పిలుస్తుంటారు. ఈ దారిలో సుమారు 25 గ్రామాలున్నాయి. ముఖ్యమైన ఈ కూడలిలో ఎలాంటి బస్టాప్, నీటి వసతి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని గుర్తించిన పాత బొబ్బిలికి చెందిన పాల వ్యాపారి మోదీ శంకరరావు వినూత్నంగా ఆలోచించారు. సొంత నిధులు సుమారు రూ.2 లక్షలతో మూడు నెలల క్రితం బస్టాప్‌ను నిర్మించారు. 1,000 లీటర్ల ట్యాంకును పైన అమర్చారు. కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రయాణికులే కాకుండా పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు దాహార్తి తీర్చుకుంటున్నారు. తీర్థయాత్రలు, దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఆగి స్నానాలు చేసి వెళ్తున్నారు. 'ట్యాంకును రోజుకు అయిదుసార్లు నింపుతున్నా. నెలకు రూ.వేయి విద్యుత్తు బిల్లు వస్తోంది. పదిమందికీ ప్రయోజనం కలుగుతోందనే సంతృప్తితో దీన్ని నిర్వహిస్తున్నా.' అని చెబుతున్నారు శంకరరావు.

# వరద ముంచింది.. నష్టం మిగిలింది

ఆదోని : ఆదోని పట్టణాన్ని వరద ముంచెత్తింది. వీధులన్నీ జలమయ మయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరింది. రోజుల తరబడి నీరు నిల్వ ఉ ంది. ఆదోని పట్టణంలో వరద నష్టంపై బృందాలు సర్వే కార్యక్రమం చేపట్టాయి. ఇందుకు సంబంధించి పురపాలక యంత్రాంగం అధికార బృందాలను నియమించింది. వరద నీటి ప్రవాహంతో రహదారులు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, పురపాలక ఆస్తులకు సంబంధించి నష్టం వాటిల్లింది. దీంతో సర్వే చేపట్టి, నివేదికను ప్రభుత్వానికి అందించాలని భావిస్తోంది. కొంతవరకైనా వరద నివారణ నిధులు మంజూరైతే.. వాటి ద్వారా మౌలిక వసతుల కల్పన పనులు చేయాలని భావిస్తోంది. స్థానిక సంస్థల నిధులు తక్కువగా ఉండటంతో, అత్యవసరంగా చేపట్టాల్సిన వాటికి నిధులు సమకూర్చడం కష్టంగా మారుతోంది. దీంతో ప్రభుత్వం స్పందించి నిధులిచ్చి ఆదుకుంటే.. కొంతలో కొంతైనా ఉపశమనం చర్యలు చేపట్టి, ప్రజల ఇబ్బందులను దూరం చేయాలను కుంటున్నారు.ఏవెవరు.. ఏపీ పనులు: నివాసాలకు సంబంధించి



నష్టం అంచనా వేసేందుకు వీఆర్వోలు, రహదారులు, నీటి సరఫరా, కాల్వల పరిశీలన బాధ్యతలను అమినిటీ కార్యదర్శులకు అప్పగించారు.

**పనులు.. నిధులు**

ప్రధానంగా రాంజల చెరువు నుంచి వచ్చే నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు సీసీ లైనింగ్ పనులు చేపట్టాలంటే రూ.3 కోట్లు అవుతుంద ని భావిస్తున్నారు. చెరువు ప్రాంతం నుంచి హౌసింగ్‌బోర్డు వరకు పనులు చేపట్టాల్సి ఉంది. వరద నీటి ప్రవాహం వెళ్లే మార్గంలో చాలా చోట్ల వంకర్లున్నాయి. హౌసింగ్ బోర్డు నుంచి ఆవుదూడ వంక మీదుగా సీసీ లైనింగ్ గతంలో నిర్మించారు. టీజీకే.నగర్ నుంచి శివారులోని రాయనగర్ వరకు లైనింగ్‌పనులు చేపట్టాల్సి ఉంది. పొడవు 750 మీటర్లు వరకు ఉంటుందని అంచనా. ఇక సుమారు వంద కి.మీ. వరకు మురుగు కాల్వలు దెబ్బతిన్నాయి. పది కి.మీ. వరకు వంకల ప్రాంతంలో నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది.

పట్టణంలో కార్వన్‌పేట, కౌడల్‌పేట, హవన్నపేట, బుడ్డేకల్లు, బోయగేరి, పట్టణంలో ప్రధాన దారులు, ఫారెస్ట్‌లైన్ ప్రాంతం, వాల్మీకి నగర్ శివారు ప్రాంతాల్లో దెబ్బతిన్న మురుగు కాల్వలు, రహదారులు నిర్మించాల్సి ఉంది. కొన్ని చోట్ల వర్షాలకు దీపాలు పాడవడం, స్తంభాలు దెబ్బతినడం, తీగలు కాలిపోవడం వంటివి జరిగాయని సిబ్బంది చెబుతున్నారు. వరద ప్రభావిత వార్డుల్లో కనీసం రూ.2 కోట్ల చొప్పున పనులు చేపట్టాల్సి ఉంటుందని అంచనా. వీటిపై సమగ్ర నివేదిక తయారు చేసి.. బృందం ద్వారా జిల్లా కలెక్టర్‌కు అందించి. అక్కడి నుంచి ప్రభుత్వానికి నివేదించే దిశగా యోచిస్తున్నారు.

**రాజకీయాలకు అతీతంగా**

పట్టణంలో వరద నివారణ పనులు చేపట్టేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని పట్టణ వాసులు భావిస్తున్నారు. పంతాలు పక్కన పెట్టి, పట్టణ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తద్వారా నిధులు రాబట్టేలా చేస్తే మేలు జరుగుతుందంటున్నారు. ఇప్పటికే బసాపురం నీటి కుంట దెబ్బతింది. రహదారుల విస్తరణ లేక ట్రాఫిక్ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, అస్తవ్యస్తమైన మురుగు వ్యవస్థ, మౌలిక వసతుల లేమి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారం అందకపోవడంతో జనమంతా అసంతృప్తిగా ఉన్నారు. వరద సమయంలోనైనా సమిష్టిగా నిధులు సాధించుకోస్తే.. సమస్యల పరిష్కారమవుతాయని పట్టణ వాసులు భావిస్తున్నారు.పురపాలిక: ఆదోని

వార్డులు: 47


నివాస గృహాలు: 36 వేలు

జనాభా: రెండు లక్షలు

# అడవికి అభయం.. అవనికి అందం

పెద్దదోర్నాల: జీవ వైవిధ్యానికి నిలయం నల్లమల. పచ్చదనంతో కళకళలాడే ఈ అరణ్యంలో అరుదైన వృక్షజాతులు ఉ న్నాయి. వాటి సంరక్షణకు చేపడుతున్న చర్యలు, ప్రజల భాగస్వామ్యంపై అవగాహన కల్పించేందుకు అటవీశాఖ ప్రతి ఏడాది అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఈసారికూ డా ఈ కార్యక్రమం చేపట్టింది.ఆగని స్మగ్లర్ల బెడద: నల్లమల అభయార ణ్యంలో పులులు, చిరుత పులులు, పంగోలిన్ వంటి జంతువుల అవయవాలకు విదేశీ మార్కెట్లో మంచి ధర ఉంది. దీంతో స్మగ్లర్లు వాటిని వేటాడి చంపేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి వలలో పడకుండా అటవీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మార్కాపురం డివిజన్ పరిధిలో అయిదేళ్లలో ఐదుకు పైగా పంగోలిన్ అక్రమ రవాణ కేసులు నమోదు కాగా 30కి పైగా ఇతర వన్యప్రాణులను వేటాడిన కేసులు నమోదయ్యాయి.

**నిబంధనలు గమనించండి**



వన్యప్రాణులను పెంచుకోవడం, వేటాడటం, వాటి మాంసం కలిగి ఉండటం నేరం. కేంద్ర ప్రభుత్వం 1972లో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టం తీసుకువచ్చింది. వన్యప్రాణులను వేటాడితే ఏడేళ్ల జైలు శిక్ష, రూ.50,000 నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా, రెండోసారి పునరావృతమైతే ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు.

**ఇవీ వివరాలు..**

తెలుగు రాష్ట్రాల్లో నల్లమల్ల విస్తీర్ణం 5,938 చ.కిమీ

జిల్లాలో.. 3,296.31 చ.కిమీ.

రాష్ట్ర పరిధి అటవీ ప్రాంతంలో పులుల అభయారణ్యం 1401.72 చ.కిమీ.ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం

– హరి, అటవీ క్షేత్రాధికారి, పెద్దదోర్నాల

అటవీ ప్రాంతంలో జంతువుల సరంక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. చెంచు గిరిజన గూడేలు, అటవీ సమీప గ్రామాల్లో ప్రజలకు అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం.

# అడ్డగోలుగా నిర్మాణాలు



అనకాపల్లి : అనకాపల్లి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుంది. చుట్టూ ఉన్న గ్రామాల స్వరూపం మారుతోంది. పట్టణానికి దీటుగా గ్రామాలు సైతం అభివృద్ధి చెందుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో ఎటుచూసినా బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అడ్డగోలుగా పనులు చేపడుతున్నారు.

అనకాపల్లి మండల పరిధిలో 32 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 250కిపైగా గ్రామాలు ఉన్నాయి. జిల్లా ఏర్పడక ముందు గ్రామాల్లో పెంకుటిళ్లు మాత్రమే ఉండేవి. నేడు ఎటుచూసిన బహుళ అంతస్తుల నిర్మాణాలు పట్టణానికి ఆధునిక సాంకేతికతకు దీటుగా సాగుతున్నాయి. భవనాలు జీం ప్లస్ 2, 3, 4 అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. కొందరు పంచాయతీ అనుమతులు తీసుకోవడం లేదు. తుమ్మపాల, కొత్తూరుతో పాటు అక్కిరెడ్డిపాలెం, రేబాక, మారేడిపూడి, భట్లపూడి, కోడూరు, చింతనిప్పుల అగ్రహారం, గొలగాం, ఊడేరు తదితర గ్రామాల్లో జీం 3 పద్ధతిలో భవనాలు నిర్మిస్తున్నారు.

నీ సాధారణంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలంటే ముందుగా ప్లాన్ కోసం పంచాయతీకి దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు ప్లాన్ పరిశీలించి చలానా కట్టించుకుని అనుమతులు ఇస్తారు. రెండు అంతస్తులకు మాత్రమే పంచాయతీకి అనుమతి ఉంటుంది. ఆపైన నిర్మాణాలు వీఎంఆర్‌డీఏ పరిధిలోకి వస్తాయి. గ్రామాల్లో అంతకు మించిన పైఅంతస్తులు, దుకాణ సముదాయాలు నిర్మిస్తున్నారు. అటు వీఎంఆర్‌డీఏ ఇటు పంచాయతీ అనుమతులకు దరఖాస్తు చేసుకోవడం లేదు. ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.

**కన్నెత్తి చూడని అధికారులు**

గ్రామాల్లో అడ్డగోలుగా పదుల సంఖ్యలో బహుళ అంతస్తుల నిర్మాణాలు, దుకాణ సముదాయాలు కళ్లముందే చకచకా రూపుదిద్దుకుంటున్నా అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. నిర్మాణ పనులు పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు కాసులకు కక్కుర్తిపడి అటువైపు వెళ్లడం లేదు. దొడ్డిదారిన పనులు పూర్తవగానే పన్నులు వేస్తున్నారు. నేతల సిఫార్సులతో అధికారులు వీటి జోలికి వెళ్లడం లేదు.

**అనుమతులు తప్పనిసరి**

గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న బహుళ అంతస్తులు, దుకాణ సముదాయాలు గుర్తించి అందరికీ నోటీసులు జారీ చేస్తాం. పంచాయతీ పరిధిలో జీప్లస్–2 వరకే అనుమతి ఉ ంది. ముందుగా నిర్మాణదారులు పంచాయతీ అనుమతికి దరఖాస్తు చేసుకోవాలి. పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే నిర్మాణానికి అనుమతులు ఇస్తాం. పంచాయతీల్లో పూర్తిగా కార్యదర్శులే పర్యవే క్షించాలి.

– ప్రసాద్, ఈవోఆర్డీ, అనకాపల్లి

# రావే నీళ్లు.. ఆగవే కన్నీళ్లు



పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పురపాలక సంఘాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి. ఏం చేద్దాం: రక్షిత పథకాలకు నిధులు కోరుతూ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు 2005లో ప్రజారోగ్య శాఖ ద్వారా ప్రతిపాదనలు.

ఓ వరం: కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ సుస్థిర తాగునీటి పథకం కింద 2007లో పుత్తూరు– రూ.56 కోట్లు, పుంగనూరు– రూ.33.33 కోట్లు, నగరి – రూ.35 కోట్లు, పలమనేరు కౌండిన్య వద్ద ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరు చేసింది.

**ఎక్కడ ఎలా?**

పుత్తూరు: గాలేరు–నగరి ప్రాజెక్టు నీటితో ఎస్ఎస్ ట్యాంకు నింపి ప్రజల గొంతు తడపాలి. ప్రాజెక్టు పనులు ఆగిపోవడంతో 2010లో ట్యాంకు పూర్తయినా చుక్క ఇవ్వలేని దుస్థితి. గత తెదేపా పాలనలో ఏఐఐబీ నిధులు రూ.138.72 కోట్లు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. 2019లో వైకాపా ప్రభుత్వం పనులు ప్రారంభించినా, గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో అటకెక్కాయి. ప్రస్తుతం యూఐడీఎఫ్ నిధులతో పూర్తి చేసి నీరివ్వాలని యోచిస్తున్నారు.

పుంగనూరు: ఎస్ఎస్ ట్యాంకును రూ.33.33 కోట్లతో నిర్మించారు. 2010లో పూర్తయిన ఈ ట్యాంకులోకి హంద్రీ–నీవా ప్రాజెక్టు నీటిని నింపి ప్రజలకు అందించాలని అనుకున్నారు. హంద్రీ– నీవా పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో ట్యాంకు నిరుపయోగంగా మారింది. కౌండిన్య వద్ద రూ.25 కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు నిర్మించి తాగునీరు ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టు నీరు కలుషితం అవుతోంది. దీనికి తోడు భవిష్యత్తులో ఎద్దడి తలెత్తకుండా రూ.25 కోట్లతో గంగన్న శిరస్సు వద్ద మరో ట్యాంకు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినా.. నిధులు విడుదల కాలేదు.

నగరి: కొండల నడుమ ట్యాంకు నిర్మించడంతో ఏటా వర్షాకాలంలో నిండుతోంది. దీంతో ఇబ్బంది లేకుండా ప్రజలు గొంతు తడుపుకొం టున్నారు.

# రోడ్లపై స్తంభాలు.. ప్రమాదాలకు పిలుపులు



మడకశిర : జాతీయ రహదారులు, ప్రధాన గ్రామీణ రహదారులకు ఆనుకుని, రహదారులపై సైతం విద్యుత్తు స్తంభాలు ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకునేందుకు ఆస్కారముంది. ఆర్అండ్‌బీ, విద్యుత్తు శాఖల మధ్య సమన్వయం లోపించడంతో వాహనదారులకు శాపంగా మారింది. రోజురోజుకు వాహనాల రాకపోకలు అధికమై రహదారులు ఇరుకుగా మారుతున్నాయి. ఇలాంటి తరుణంలో రోడ్లపై స్తంభాలు ఉండడం మరింత సమస్యగా మారుతోంది.

**ఎక్కడెక్కడంటే..**

మడకశిర పట్టణానికి సమీపంలో వ్రజపాళ్యం వద్ద దానిమ్మతోట సమీపంలో రొళ్లకు వెళ్లే జాతీయ రహదారిపై 11కేవీ విద్యుత్తు స్తంభం ఉంది. ఇటీవల రోడ్డు నిర్మించిన ఆర్అండ్‌బీ అధికారులు అలాగే తారు వేశారు. అసలే జాతీయ రహదారి వేగంగా వచ్చే వాహనాలు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొంటే పెద్ద ప్రమాదమే చోటుచేసుకుంటుంది. అమరాపురం మండలంలో హేమావతి, హలుకూరు, కాచీకుంట, చిట్నడుకు గ్రామాలలో రహదారులకు ఆనుకుని విద్యుత్తు స్తంభాలను తొలగిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.గుడిబండ మండలం చిగతుర్పి, ఫళారం, జమ్మలబండ, మోపురుగుండు రహదారి మధ్యన విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి.

రొళ్ల, హెుసకెర రోడ్డులో దాదాపు 10 చోట్ల ఇలా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం కర్ణాటక, ఆంధ్రా గ్రామాలకు వెళ్లే వాహనాలతో రద్దీగా ఉంటుంది. సత్వరమే స్తంభాలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**విద్యుత్తుశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

–మూర్తి, ఆర్అండ్‌బీ ఇంజినీరు, మడకశిర రోడ్లపై ఉన్న విద్యుత్తు స్తంభాలను వేరే చోటకు మార్చాలని ఆశాఖ అధికారులకు పలుమార్లు తెలియజేశాం. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టే సమయంలో ఇబ్బందిగా ఉంటుంది. స్తంభాలను మార్చితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

# ప్రమాదకరంగా గొట్టా బ్యారేజీ రహదారి

హిరమండలం: హిరమండలం మండల పరిధిలోని గొట్టా బ్యారేజీ నుంచి న్యూ బ్యారేజీ సెంటర్ వరకు ఉన్న రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇది సింగిల్ లైన్ రోడ్ కావడం, వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత 20 ఏళ్లుగా పాలకులు మారుతూనే ఉన్నా వాగ్దానాలు ఇస్తున్నా మాటలకే పరిమితం అవుతున్నాయి. గొట్టా బ్యారేజీ రహదారి పరిసర గ్రామాల ప్రజలు రోడ్డు విస్తరణ చేయాలని కోరుతున్నారు. కూటమి ప్రభుతం స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



# ప్లాంట్ల ఊపిరి తీశారు

ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్ల నిర్వహణ అధ్వానంగా మారింది. ప్రాణవాయువు అందించాలంటే పైకం చెల్లించాల్సి వస్తోంది. కొవిడ్ సమయంలో ప్రాణవాయువు అత్యవసరంగా మారింది. వీటి సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022లో పీఎస్ఏ ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఒక్కో ప్లాంటుకు రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వెచ్చించినట్లు సమాచారం. ప్రస్తుతం వీటి నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో మూలకు చేరాయి.

**వినియోగంలోకి తేవాలంటే..**

కొన్ని ఆస్పత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు పనిచేయక సుమారు నాలుగేళ్లవుతో ంది. అందుబాటులోకి వస్తే సొంతంగా ఆక్సిజన్ ఉత్పత్తి చేసుకోవచ్చు. అత్యవసర సమయంలో నిరంతరాయంగా సరఫరా చేసుకునేందుకు వీలవుతుంది. మరమ్మతులు చేయకుంటే అవి ఎందుకూ పనికిరాకుండా పోతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

**గత ప్రభుత్వం పట్టించుకోక..**

కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు చొప్పున, ఆదోనిలోని మాతాశిశు ఆస్పత్రి, ఎమ్మిగనూరు, డోన్, బనగానపల్లి ప్రాంతీయ ఆస్పత్రుల్లో వంద పడకలకు సంబంధించి ప్లాంట్లు ఏర్పాటుచేశారు. ప్రారంభంలో కొన్నాళ్లపాటు వీటి సేవలందాయి.



నిర్వహణపై గత వైకాపా ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. నిర్వహణకు నిధులివ్వక.. సిబ్బందిని నియమించకపోవడంతో నెమ్మదిగా ఒక్కో ప్లాంటు పనిచేయకుండా పోయింది.

ప్లాంటు ఏర్పాటు సమయంలో నిర్వహణకు సంబంధించి నిపుణులను నియమించారు. ఆరు నెలల గడువు తీరడంతో వీరిని పట్టించుకోలేదు.

**ఎక్కడ ఎలా ఉందంటే..**

కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు ప్లాంట్లు పనిచేయకపోవడంతో బయటి నుంచి ట్యాంకర్ల ద్వారా ఆక్సిజన్ తెప్పించుకుంటున్నారు. వీటికోసం టెండర్లు పిలిచి పనులు అప్పగించినట్లు తెలుస్తోంది. ఇక్కడి ఆస్పత్రికి రెండు రోజులకోసారి రెండు కేఎల్ (కిలో లీటరు) స్థాయిలో ఆక్సిజన్ అవసరం. దీనికోసం సుమారు నెలకు రూ.30 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.నంద్యాలలోనూ అదే పరిస్థితి. ఇక్కడా ప్రతి నెలా నాలుగైదు ట్యాంకర్ల వరకు ఆక్సిజన్ తెప్పించుకుంటున్నారు. నెలకు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదోనిలోని ప్రభుత్వ మాతాశిశు ఆస్పత్రిలో ప్లాంటు పనిచేయకపోవడంతో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల ద్వారా రోగులకు సేవలందిస్తున్నారు. విద్యుత్తు ఉంటేనే ఇవి పనిచేస్తాయి.. విద్యుత్తు లేని సమయంలో జనరేటర్లు వినియోగిస్తామని వైద్యులు చెబుతున్నా.. ఎంతవరకు సేవలందుతున్నాయో తెలియని పరిస్థితి. ఈ వైద్యాలయం లో నెలకు 450 ప్రసవాలు జరుగుతాయి. ఈ ఆస్పత్రిలోని మేడపై నవజాత శిశు సంరక్షణ వైద్య కేంద్రం ఉంది.. దీనికి ఆక్సిజన్ సమస్యలు వెంటాడుతున్నాయి. నాబార్డు ద్వారా కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనానికి ఆక్సిజన్ పైపులు ఏర్పాటుచేయాల్సి ఉంది. ఆదోని జీజీహెచ్‌లో రెండు ప్లాంట్లు పనిచేయడం లేదు. దీంతో ప్రతి నెలా డబ్బులు చెల్లించి ఒకటి రెండు ట్యాంకర్ల ఆక్సిజన్ తెప్పించుకుం టున్నారు. ఎమ్మిగనూరు ఆస్పత్రిలోనూ మరమ్మతులకు గురైంది. డోన్‌లో పాత భవనంలోని ఆస్పత్రిలో ప్లాంటు బిగించారు. కొత్త భవనంలోకి మార్చేందుకు సుమారు రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో అలానే వదిలేశారు. బనగానపల్లిలోని ప్రాంతీయ ఆస్పత్రిలో ప్లాంటు మరమ్మతులకు గురైంది.

# కందిపప్పు.. ఉడికేదెన్నడో చెప్పు!

చిన్నమండెం: ఏ నెలకు ఆ నెల కంది పప్పు వస్తుందని ఎదురు చూస్తున్న పేదలకు ఈ నెలా నిరాశే మిగిలింది. ఈ సారి బియ్యం, పంచదారతో పాటు రాగులు పంపిణీ చేస్తున్నారు. గురువారం విజయ దశమి పండుగ కాగా ఇదే నెలలో దీపావళి కూడా రానుంది. ఈ తరుణంలో పేదింట కందిపప్పు ఉడకని స్థితి నెలకొంది. ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా తెల్లరేషను కార్డు లబ్ధిదారులకు బియ్యం, పంచదార మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి ఈ నెలలో మూడు కిలోలు తగ్గకుండా రాగులు అందిస్తున్నారు. బియ్యానికి బదులుగా రాగులు తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు అంటున్నారు. ఇవి కూడా ఉచితమేనని వివరిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ప్రజలకు కందిపప్పు సరఫరా ఆగిపోయింది. చౌక దుకాణాల్లో కేవలం రూ.67లకే కిలో వచ్చేది. ఆ కిలో కూడా పేదలు భాగ్యంగా భావించేవారు. కారణం బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైనవి కిలో రూ.140 వరకు పలుకుతున్నా యి. గత నెల 25 నుంచి 65 ఏళ్ల పైబడిన వారికి డీలర్లు ఇంటి వద్దకే సరకులు సరఫరా చేశారు. బుధవారం నుంచి లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. వచ్చిన ప్రతి లబ్ధిదారుడు కందిపప్పు వచ్చిందా అని డీలరును అడుగుతుండగా రాలేదని చెప్పడంతో నిరాశగా వెళ్లిపోతు న్నారు. చౌకదుకాణాల ద్వారా బియ్యం, అర కిలో పంచదారతో పాటు



గోధుమపిండి, పామాయిల్, జొన్నలు, రాగులు వంటివి అందజేస్తే తమకు మేలు జరుగుతుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పౌర సరఫరాలశాఖ ఉప తహసీల్దా రు వెంకటరెడ్డిని వివరణ కోరగా కొన్ని నెలలుగా స్టాకు రాలేదని, అందుకే పంపిణీ చేయలేకపోతున్నామన్నారు.5 వేల కిలోల కందిపప్పు పంపిణీ: లక్కిరెడ్డిపల్లె గోదాంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన కందిపప్పు నిల్వలు ఎక్కువగా ఉండడంతో ఉన్నతాధికారుల అనుమతితో 5 వేల కిలోల కందిపప్పును కొన్ని దుకాణాలకు సరఫరా చేశామని చిన్నమండెం గోదాం ఇన్‌ఛార్జి మల్లికార్జునబాబు తెలిపారు. చిన్నమండెంలోని మూడు దుకాణాలకు వెయ్యి కిలోల వరకు, మిగతావి లక్కిరెడ్డిపల్లె పరిధిలోని కొన్ని దుకాణాలకు ఇచ్చామన్నారు.

జిల్లాలోని మండలాలు: 30

చౌక దుకాణాలు: 1123

మొత్తం కార్డులు: 5 లక్షలకు పైగా

జిల్లాకు వచ్చిన స్మార్టు కార్డులు: 4.87 లక్షలు

## మాయ చేసి.. మాయం చేసేసి!

ఒంగోలు : వేసవి కాలం ఆరంభమయ్యే ఏప్రిల్, మేలలో పంటల సాగు ఊసే ఉండదు. బోర్లు కింద కొన్నిచోట్ల కూరగాయల పంటలు వంటివి మాత్రమే వేస్తుంటారు. వీటికి వంద కాదు.. రెండొందలు కాదు.. వేల టన్నుల యూరియా వినియోగించినట్లు దస్త్రాల్లో సృష్టించారు. సీజన్‌కు ముందే తెలివిగా వ్యాపారులు సరకు అమ్మేసినట్లు లెక్కలు చూపారు. యూరియా పక్కదారి పడుతున్న విషయాన్ని పట్టించుకోని వ్యవసాయాధికారులు ఆమ్యామ్యాలతో చోద్యం చూశారు. జిల్లాలో 1.29 లక్షల హెక్టార్లలో వివిధ పంటల సాగవుతున్నాయి. గత నెల ఆరంభంలోనే పంటల సాగు ముమ్మరం కావాల్సి ఉన్నా వర్షాభావ పరిస్థితులతో సాగు జాప్యమై గత నెలాఖరు నుంచి మొదలైంది. ప్రస్తుతం జిల్లాలో 58 వేల హెక్టార్లలో పంటలు వేశారు. యాభై శాతం పంటలు వేయకున్నా యూరియా వినియోగం మాత్రం వేల టన్నులకు చేరుకుంది. తీరా పంటలకు అవసరమయ్యే సమయానికి నిల్వలు అందుబాటులో లేక రైతులు నల్లబజారులో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాకు అవసరమెంతో? సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో ఎంత వరకు అందుబాటులో ఉంచాలనే దానిపై ప్రణాళికతో సిద్ధంగా ఉండాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించారు. దీంతో రూ.266 ధర ఉన్న యూరియా బస్తాను రైతులు రూ.400కు కొనుగోలు చేయాల్సి వస్తోంది. లేదంటే మిశ్రమ ఎరువులను రైతులకు



అంటగడుతున్నారు. రైతులు రూ.1,500 వెచ్చించి డీఏపీ బస్తా కొనుగోలు చేస్తే రూ.300 ధరకు యూరియా బస్తా ఇస్తున్నారు. ఇదేమని డీలర్లను అడిగితే నిల్వలు అందుబాటులో లేవని, నచ్చితే కొనండి.. లేకుంటే లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

జిల్లాలోని ఓ స్వయంసమృద్ధి సంఘానికి 525 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించగా, దీనిలో 258 మెట్రిక్ టన్నుల యూరియా ఉండగా, సీజన్‌కు ముందే నిల్వలు ఖాళీ అయిపోవడం గమనార్హం. వాస్తవానికి ఏప్రిల్, మే, జూన్‌లలో ఉద్యాన పంటలకు యూరియా అవసరమనుకున్నా వందల టన్నుల్లోనే ఉంటుంది. వేల టన్నులు ఏమైందో దేవుడికే ఎరుక. జులైలో పంటల సాగు 25 శాతం కూడా దాటలేదు. ఒక్క నెలలోనే 3 వేలకుపైగా టన్నులు ఎవరికిచ్చారో అర్థం కావడంలేదు. ఈ విషయమై జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో తోటలకు యూరియా వినియోగం జరిగి ఉంటుందని చెబుతున్నారు. యూరియా అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో దాడులు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

## ఆ'గని' ప్రమాదాలు!

ఒంగోలు : ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ క్వారీల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలతో కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల పరిధిలో వివిధ రకాల క్వారీలు ఉన్న నేపథ్యంలో ఆయా గనుల్లో భద్రతను పర్యవేక్షించాల్సిన డీడీఎంఎస్ (డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ) కార్యాలయం పక్క రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉండడం గమనార్హం. జిల్లాలో గ్రానైట్ గనులు వెలుగులోకి రాక ముందు నెల్లూరులో డీడీఎంఎస్ కార్యాలయం ఉండేది. దీని పరిధిలో ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని చీమకుర్తి, కనిగిరి, మార్కాపురం, బల్లికురవ, గురిజేపల్లి తదితర ప్రాంతాల్లోని గనులుండేవి. తరచూ భద్రతా విభాగం అధికారుల తనిఖీలు జరుగుతుండేవి. అలాంటిది 2021లో నెల్లూరులోని కార్యాలయాన్ని హైదరాబాద్‌కు తరలించడంతో గనుల్లో భారీ ప్రమాదాలు చోటుచేసుకుంటే తప్ప తనిఖీలు ఉండటంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలోని చీమకుర్తి ప్రాంతంలోని గ్రానైట్ క్వారీల్లో 15 ఏళ్ల కిందట తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. ఏడాదిలో పది మందికిపైగా మృత్యువాత పడేవారు. చీమకుర్తి మండలం రామతీర్థంలోని ఓ గ్రానైట్ క్వారీలో 2010లో హైవాల్ విరిగి పడి 13 మంది కార్మికులు దుర్మరణం చెందారు. దీంతో పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు చేపట్టడంతోపాటు రామతీర్థంలో వృత్తి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి భద్రతా అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించడంతో గత దశాబ్ద కాలంలో ప్రమాదాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. దీంతో భద్రతా పరంగా యాజమాన్యాల్లో ఉదాసీనత పెరిగిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గతంలో భద్రతా వారోత్సవాలు నిర్వహించే సమయంలో వారం రోజులపాటు భద్రతా బృందాలు గనుల్లో భద్రతా అంశాలు పరిశీలించి తగిన సూచనలు చేసేవారు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన



వారోత్సవాల్లో అవేవీ కనిపించకపోవడం గమనార్హం. ఇటీవల ఓ క్వారీలో పైగోడల నుంచి భారీగా రాళ్లు కిందకు జారిపడిన ఘటనలో కార్మికులెవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో క్వారీని సందర్శించిన జిల్లా గనుల శాఖ అధికారి క్వారీల యజమానులు, మేనేజర్లతో సమావేశం ఏర్పాటు చేసి సూచనలిస్తామని, క్వారీల్లో భద్రతా పరంగా చేపట్టాల్సిన చర్యలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌లోని డీడీఎంఎస్ కార్యాలయాన్ని ఒంగోలుకు మార్పు చేయాలనే డిమాండు గత కొంతకాలంగా వినిపిస్తోంది. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో సుమారు 100 క్వారీలుండగా, భద్రతా అంశాలను పర్యవేక్షించాల్సిన డీడీఎంఎస్ కార్యాలయం హైదరాబాద్ ఉండడమేమిటని ప్రశ్న తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో డీడీఎంఎస్ కార్యాలయాన్ని ఒంగోలులో ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## 'మంట'.. ఉపశమనం ఉండదంట!



అనకాపల్లి : 1. ఇటీవల పరవాడలోని జేఎన్ ఫార్మాసిటీలోని ఎస్.ఎస్ ఫార్మాలో కొన్ని నెలల క్రితం విషవాయువు లీకై.. ఇద్దరు చనిపోగా, ఒకరు అస్వస్థతకు గురయ్యారు. గాయపడిన కార్మికుడిని విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు.

2. కొన్ని నెలల క్రితం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 17 మృతి చెందారు. మరో 30 మందికి పైగా గాయాలయ్యాయి. అత్యవసర చికిత్స అందక ఐదుగురు వరకు చనిపోయారు.

అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో (సెజ్‌లో) వందకు పైగా కంపెనీలున్నాయి. వాటిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. పక్కనున్న పరవాడ ఫార్మాసిటీలో మరో 60 వేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఈ రెండు పారిశ్రామికవాడల్లో రసాయన పరిశ్రమలు ఎక్కువే. ఈ కారణంగా చిన్నపాటి ప్రమాదం సంభవించినా ఎక్కువ మందికి కాలిన గాయాలే అయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎంత త్వరగా వైద్యమందితే అంత మంచిది. కానీ అచ్యుతాపురం, పరవాడలోని ఏ ఆసుపత్రిలోనూ బర్నింగ్ వార్డు లేదు. దాంతో ప్రతి ప్రమాదకర సందర్భంలోనూ అనకాపల్లి, విశాఖపట్నం తరలించాల్సి వచ్చింది. అచ్యుతాపురంలో కొత్తగా కడుతున్న కార్మిక రాజ్య బీమాసంస్థ (ఈఎస్ఐ) ఆసుపత్రి నిర్మాణానికి ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఏపీఐఐసీ 2021లో ఇందుకోసం రెండెకరాల స్థలం ఉచితంగా కేటాయించింది. 2024లో రూ. 62 కోట్లతో 30 పడకల ఆసుపత్రికి భూమిపూజ జరిగింది. ఇప్పటికీ మందకొడిగానే పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణానికి వైకాపా చొరవ చూపలేదు. దీంతో చాలా వరకు పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సకల సౌకర్యాలు కల్పిస్తున్నా..

నిర్మాణాల్లో జాప్యం జరుగుతుంది. జిల్లాలో 1.2 లక్షల మంది ఈఎస్ఐ పరిధిలో ఉన్నారు. వేలాది మంది కార్మికులు డిస్పెన్సరీ సేవలకే పరిమితం కావాల్సి వస్తోంది. ఈఎస్ఐ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే కాలిన గాయాలకు విశాఖపట్నం వెళ్లాల్సిన అవసరం ఉండదని కార్మికులు భావించినా వారికి నిరాశే ఎదురవుతోంది. కొత్త ఆసుపత్రిలో ప్రసూతి వార్డు, చిన్న చిన్న గాయాలకు, గుండె సంబంధిత వ్యాధుల చికిత్సకు మాత్రమే వార్డులు ఏర్పాటు చేస్తున్నారు తప్ప బర్నింగ్‌వార్డు ఏర్పాటు ఉండదనే సమాచారంపై కార్మిక సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కార్మికులకు పూర్తిస్థాయిలో రక్షణ, చికిత్స ఉండేలా బర్నింగ్ వార్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. **త్వరలో నిర్మాణం..: విజయ్‌కుమార్, ఎలమంచిలి, ఎమ్మెల్యే** ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిర్మాణం జరుగుతోంది. ఎటువంటి చిన్న ప్రమాదం వచ్చినా.. అన్నిరకాల సేవలందేలా దీని నిర్మాణం జరుగుతుంది. బర్నింగ్ వార్డు తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చూస్తాం.

## అటు ఖర్చు.. ఇటు కాటు



కాకినాడ : కాకినాడ నగరంలో శునకాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీధుల్లో పదుల సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. పలువురిపై దాడి చేస్తున్నాయి. కొన్ని చోట్ల ద్విచక్ర వాహనాలు, సైకిళ్ల వెంట పరుగులు తీస్తుండడంతో చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆసుపత్రులకు కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. శస్త్రచికిత్సల పేరుతో నిధులు ఖర్చు చేస్తున్నా, శునకాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. **గుంపులు గుంపులుగా...** నగరంలో శునకాలు గుంపులుగుంపులుగా సంచరిస్తున్నాయి. మొత్తం 11 వేలకు పైగా వీధి కుక్కలుంటాయని అంచనా. గత అయిదేళ్లుగా శునకాలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇప్పటివరకు 6 వేల వరకు చేశారని చెబుతున్నారు. అయినప్పటికీ వాటి సంఖ్య తగ్గడం లేదు. గతంలో పోలిస్తే రెట్టింపుగా కనిపిస్తున్నాయి. వీధి కుక్కల విషయంలో నగరపాలక సంస్థ వద్ద స్పష్టత లేదు. రెండేళ్ల కిందట సర్వే నిర్వహించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించి, తెల్లవారు జామున ఏక కాలంలో వీధుల్లో సంచరించి గణన చేశారు. నివేదికను మాత్రం వెల్లడించలేదు.

**ఒక్కో ఆపరేషన్‌కు రూ.1300**

వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేసే బాధ్యతను సొసైటీ ఫర్ నేచర్ అండ్ యానిమల్ ప్రొటెక్షన్ (స్నాప్) అనే సంస్థకు అప్పగించారు. ఇద్దరు వైద్యులు, సిబ్బంది సాయంతో ఆపరేషన్లు చేస్తున్నారు. ఇందుకు ఒక్కో దానికి రూ.1300 వరకు నగరపాలక సంస్థ వెచ్చిస్తోంది. ఇంత చేసినా కుక్కల సంతాన నియంత్రణలో తేడా కనిపించటం లేదు. ఎక్కడ చూసినా పెద్దసంఖ్యలో దర్శనమిస్తూ జనాలపైకి ఎగబడుతున్నాయి.

**సజావుగానే చేస్తున్నాం**

నగరంలో వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు సజావుగానే జరుగుతున్నాయి. నగర శివారు గ్రామాల నుంచి కొన్ని నగరంలో రావడంతో ఎక్కువగా కనిపిస్తున్నాయి. మిగిలిన వాటికి కూడా శస్త్రచికిత్సలు పూర్తిచేసి వాటి సంఖ్యను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. డాక్టర్ పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో, నగరపాలక సంస్థ, కాకినాడ

## ఉద్యానాలను గాలికొదిలేశారు..



రామచంద్రపురం : పురపాలక సంఘాల్లోని ఉద్యానవనాలు అసౌకర్యాలతో ఉన్నాయి. నిర్వహణ కొరవడి తుప్పలు పెరిగి.. వ్యర్థాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం, అమలాపురం, మండపేట పట్టణాల్లోని ఉద్యానవనాలను అభివృద్ధి చేయకుండా ఆరేళ్లుగా వదిలేశారు.

**రామచంద్రపురం.. 6** రామచంద్రపురంలోని ఆరు పార్కుల్లో ఒక్కటీ ఉపయోగంలో లేదు. శివాలయం వీధిలోని నందివాడ సత్యనారాయణ పార్కులో దీపాలు వెలగవు. సగం ట్రాక్‌ను అభివృద్ధి చేసి వదిలేశారు. పిల్లలు ఆడుకునే సామగ్రి పాడై అన్యాక్రాంతమయ్యాయి. బ్రాడీపేటలోని ఎస్ఆర్‌కే విజయాదేవి పార్కు పక్కనే చెత్త వేయడం, పిల్లలు ఆడే వస్తువులు పాడవడంతో సందర్శకులు తగ్గిపోయారు. రత్నంపేట పురపాలక పార్కులో ఆట వస్తువులు ఏర్పాటు చేస్తామని మరిచారు. వైఎస్సార్‌నగర్, అఫీషియల్‌కాలనీ, రాజబాబునగర్‌లో ప్రహరీలు నిర్మించి వదిలేశారు. **అమలాపురంలో..** అమలాపురం పట్టణంలో చంద్రబాబునాయుడు ఉద్యానవనం, తామరచెరువు పార్కు, గోఖలేవీధిలో పిల్లల పార్కు, నల్లవంతెన నుంచి ఎర్రవంతెన వరకు ఉన్న కాటన్‌పార్కు, తామరచెరువు పార్కు, పిల్లల ఉద్యానాల్లో రెండు మాత్రమే ఫర్వాలేదు. మంచినీటి చెరువు వద్ద ఉన్న పార్కును నిర్వీర్యం చేసేశారు. రూ.20 లక్షలు కేటాయించి అభివృద్ధి చేస్తామని పనులను ప్రారంభించలేదు. **మండపేటలోనూ అంతే..** కొండపల్లివారివీధిలో నందమూరి తారకరామారావు పార్కులో పరికరాలు, ఫౌంటైన్ ధ్వంసమయ్యాయి. 19వ వార్డు పరిధి వల్లూరి రామస్వామి ఉద్యానంలో క్రీడా పరికరాలు తుప్పుపట్టాయి. 11వ వార్డు న్యాకాలనీ అంబేడ్కర్ ఉద్యానవనంలో బల్లలు విరిగిపోయాయి.

**త్వరలోనే అభివృద్ధి చేస్తాం..** పట్టణంలోని ఉద్యానవనాలను నిధుల మంజూరును బట్టి త్వరలోనే అభివృద్ధి చేస్తాం.

## భళా నుంచి దివాలాకు!

ఒంగోలు : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు లాభాలు చేకూర్చేందుకు ఒంగోలు నగరంలో రెండేళ్ల కిదంట మహిళా మార్ట్ ఏర్పాటు చేశారు. దీనిని నగరంలోని పొదుపు సంఘాల మహిళలు ఒక్కొక్కరు రూ.150 చొప్పున పెట్టుబడులు పెట్టి రూ.లక్షల వ్యయంతో ప్రారంభించారు. అధికారుల తీరుతో ప్రస్తుతం దివాలా అంచుకు చేరింది. లాభాల మాట అటుంచితే పెట్టుబడి రూపంలో పెట్టిన రూ.లక్షలు ఏమయ్యాయోయని పొదుపు సంఘాల మహిళలు ఆందోళన చెందుతున్నారు.

మహిళా మార్ట్ ఏర్పాటుకు రెండేళ్ల కిందట ఒంగోలులోని 4 వేల పొదుపు సంఘాల నుంచి రూ.48 లక్షలు వసూలు చేశారు. అప్పటి ప్రజా ప్రతినిధులు కూడా రూ.లక్షల్లో సాయం అందించారు. మార్ట్‌లో వచ్చే లాభాలను సభ్యులందరికీ పంచుతామని అధికారులు పేర్కొన్నారు. మార్ట్ ప్రారంభమైన అనంతరం కొంతకాలంపాటు లాభాలొచ్చినట్లు లెక్కలు చూపారు. తరువాత ఏం జరిగిందో మార్ట్‌లో సరకులు ఖాళీ అవుతూ రావడంతోపాటు బ్యాంకు ఖాతాలో నగదు ఖాళీ అవుతూ వచ్చింది. నగదు నిల్వలు కరిగిపోవడంతో పొదుపు మహిళలు ఆందోళన చెందుతూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

సరకులు విక్రయించిన నగదు ఏం చేశారని ప్రశ్నిస్తే, లెక్కలు సరిచూస్తామని చెప్పుకొస్తున్నారు తప్ప ఏం జరుగుతుందనే దానిపై అధికారులు విచారణ ప్రారంభించలేదు. ప్రస్తుతం మార్ట్ మూతపడే దశకు చేరుకుంది. గతేడాది అక్టోబరు నాటికి ఓ అధికారి బదిలీ అయినప్పుడు రూ.6.70 లక్షల విలువైన సరకులు లెక్కలు చూపారు.



అంత తక్కువ సరకులు ఉండటంపై అప్పట్లోనే పెద్ద చర్చకు దారి తీసింది. బ్యాంకు ఖాతాను పరిశీలిస్తే రూ.20 లక్షల మేర నగదు ఉంది. నిర్వహణ పేరుతో ఆ ఖాతా నుంచి నగదును తీసి సిబ్బంది జీతాలు, నిర్వహణ ఖర్చుల పేరిట ఖర్చు పెట్టేశారు. తమకు లాభాలు పంచకపోగా, అసలు సొమ్మునే మాయం చేస్తుండడంపై పొదుపు సంఘాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**విచారణ కమిటీని నియమించాం :** మార్ట్ నిర్వహణలో లోపాలను గుర్తించేందుకు విచారణ కమిటీని నియమించాం. రెండేళ్ల కిందట మహిళా మార్ట్ ప్రారంభమైనప్పటి నుంచి నెలవారీ లావాదేవీల వివరాలు సేకరిస్తున్నాం. బ్యాంకు ఖాతాలను సైతం పరిశీలిస్తున్నాం. విచారణలో అక్రమాలు బయటకు తీయిస్తాం.
శ్రీహరి, పీడీ, మెప్మా

## గ'తుక్కు'మనక్కర్లేదు!

ఒంగోలు :పచ్చని పర్యావరణాన్ని ప్లాస్టిక్ భూతం కబళిస్తోంది. దీని నియంత్రణకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా పూర్తిస్థాయిలో ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. ఈ నేపథ్యంలో గుంటూరు గ్రామీణ మండలంలో ఈ ఏడాది జులై 10వ తేదీన పైలట్ ప్రాజెక్టు కింద 'స్వచ్ఛ రథం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అక్కడ మంచి ఫలితాలు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేయాలని ఆదేశిస్తూ తాజాగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా తొలివిడతగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 8 మండలాలను ఎంపిక చేసి చేసినట్లు జడ్పీ సీఈవో చిరంజీవి తెలిపారు.

**ఏమిటీ ప్రాజెక్టు..**

ఇళ్లల్లో నిరుపయోగమైన సామగ్రిని ఒకేసారి తీసుకెళ్లి రహదారులు, ఖాళీ ప్రదేశాల్లో పడేస్తుంటారు. దీంతో పలుచోట్ల వ్యర్థాలు పేరుకుపోయి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఇకపై పనికి రాని ప్లాస్టిక్, గాజు, ఇనుప వస్తువులు, అట్టపెట్టెలు, పుస్తకాలు తదితర సామగ్రిని నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సేకరిస్తారు. ఆ ధరకు సమానంగా కిరాణా సరకులు ఇస్తారు. అందుకు 'స్వచ్ఛ రథం' కింద సంచార వాహనాలను సిద్ధం చేయనున్నారు. ఎంపిక చేసిన మండలాల్లో రోజుకొక గ్రామం చొప్పున ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనం తిరుగుతుంది. ఆయా మండలాల్లో విజయవంతమైతే జిల్లాలోని మిగతా మండలాల్లోనూ పథకం విస్తరించనున్నారు. స్క్రాప్ డీలరును 'స్వచ్ఛ బంధు'గా నియమిస్తారు. వీరికి మండల ప్రజాపరిషత్తు నుంచి నెలకు రూ.25 వేలు చొప్పున పారితోషికం ఇవ్వనున్నారు.

**ఎంపిక చేసిన మండలాలు:** చీమకుర్తి, మద్దిపాడు, కొత్తపట్నం, పామూరు, టంగుటూరు, బల్లికురవ, మార్టూరు, వేటపాలెం

స్వచ్ఛ రథంలో లభించే సామగ్రి: కొబ్బరినూనె సీసా, సర్ఫ్ ప్యాకెట్, దస్తుల సబ్బులు, ఒంటి సబ్బులు, టీ/కాఫీ ప్యాకెట్లు, కంఫర్ట్ ప్యాకెట్లు, లేస్, షాంపు ప్యాకెట్లు, పేస్టలు, ఉల్లిపాయలు, పెన్నులు, పెన్సిళ్లు, గోధుమ పిండి కిలో ప్యాకెట్, వేరుశనగ, మినపపప్పు, కందిపప్పు.

## అందంపై శిక్షణ.. అతివలకు ఆలంబన

తాళ్లూరు: కాలంతోపాటు ఉపాధి రంగంలోనూ అనేక మార్పులు వస్తున్నాయి. గతంలో వీటిపై ఎక్కువగా పట్టణ ప్రాంత మహిళలు మక్కువ చూపేవారు. ఇప్పుడు గ్రామీణ ప్రాంత వనితలు సైతం నేర్చుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి పథంలో పయనించేందుకు కృషి చేస్తున్నారు. అందుకు తాజా ఉదాహరణగా పట్టణాలకే పరిమితమైన బ్యూటీషియన్ కోర్సు ప్రస్తుతం గ్రామాలకు విస్తరించడాన్ని పేర్కొనవచ్చు.కేంద్రం, జన శిక్షణ సంస్థాన్ తోడ్పాటుతో..కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన శిక్షణ సంస్థాన్ తోడ్పాటుతో పల్లెల్లోని మహిళలు బ్యూటీషియన్ రంగంలో ప్రావీణ్యం గడించేందుకు అవకాశం కలుగుతోంది. ప్రధానంగా పుట్టినరోజు, పెళ్లి, ఇతర శుభ కార్యాలకు సమీప బ్యూటీపార్లర్లకు వెళ్లి అందంగా ముస్తాబై రావడం ఇప్పుడొక అవసరంగా మారింది. బ్యూటీషియన్లు గతంలో పట్టణాల నుంచి రావాల్సి వచ్చేది. ఇక ఆ అవసరాలు లేకుండా నేరుగా గ్రామీణ మహిళలే చేసేందుకు వీలు కలుగుతోంది. ఇప్పటి వరకు పల్లె ప్రాంత వాసులకు కేవలం కుట్టు, అల్లికలు, అంబ్రాయిడరీపైనే శిక్షణకు అవకాశం దక్కగా.. ప్రస్తుతం తాళ్లూరు మండలంలోని నాగంబొట్లపాలెంలో మహిళలకు ప్రథమంగా బ్యూటీషియన్ కోర్సులో తర్ఫీదు పొందేందుకు అవకాశాలు కల్పించారు. రెండు నెలలపాటు తూర్పుగంగవరానికి చెందిన ట్రైనరు పాల్వాది సునీత 20 మంది బృందానికి నిత్యం శిక్షణ ఇస్తున్నారు. ఐబ్రోస్, బ్లీచింగ్, వ్యాక్సింగ్, మానిక్యూర్, పెడిక్యూర్, వివిధ రకాల హెయిర్ కట్స్, ఫేషియల్స్, బ్రైడల్ మేకప్ తదితర అంశాలపై మహిళలు, యువతులకు వివరిస్తున్నారు. నేర్చుకున్న వారంతా ఉపాధి పొందేందుకు బాసటగా దీనిని మలుచుకుంటున్నారు.
ఉత్సాహంగా ముందుకొస్తున్నారు... బ్యుటీషియన్ కోర్సు నేర్చుకోవడానికి గ్రామీణ ప్రాంతం నుంచి మహిళలు ముందుకు వస్తారో, రారో అని మొదట్లో సందేహించాను. కానీ శిక్షణ ప్రారంభించాక మహిళలు చాలా ఉత్సాహంతో హాజరవుతున్నారు. విషయాలన్నింటినీ శ్రద్ధగా తెలుసుకొని ఆచరిస్తున్నారు. పాల్వాది సునీత, శిక్షకురాలు

## 'తల'కెక్కించుకోకుంటే జేబుకు చిల్లే..!

కాకినాడ: 'శిరస్త్రాణం (హెల్మెట్) లేకుండా వాహనంతో రోడ్డెక్కితే పోలీసులు ఏం చేస్తారు..? ఫొటో తీస్తారు, ఈ-చలానా పంపిస్తారు. డబ్బులున్నప్పుడు జరిమానా కడతాం. లేకుంటే అలానే తిరుగుతాం' ఇదీ కొంత మంది తీరు. ఇకపై శిరస్త్రాణం లేకుండా బండి ఎక్కితే లైసెన్స్ కూడా రద్దయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ప్రమాద కేసుల్లో చిక్కుకున్నవారి లైసెన్స్‌లనే రద్దు చేస్తున్నారు.

**వందలో 20 మందే వినియోగం..**

రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నవారిలో ఎక్కువ మంది శిరస్త్రాణం, సీటుబెల్ట్ ధరించనివారే ఉంటున్నారు. జిల్లాలో ఎనిమిది లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు శిరస్త్రాణం లేకుండా ప్రయాణించే వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో రూ.100 అపరాధ రుసుము ఉండగా ఇప్పుడు రూ.1,035కు పెంచారు. ముఖ్యంగా కాకినాడ నగరంలో ప్రతి వంద ద్విచక్ర వాహనదారుల్లో 20 నుంచి 25 మంది మాత్రమే శిరస్త్రాణం ధరిస్తున్నట్లు రవాణాశాఖ పరిశీలనలో తేలింది. నిబంధనలిలా ..

హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతూ మొదటిసారి చిక్కితే మూడు నెలలు లైసెన్సు రద్దు చేయవచ్చు. రెండోసారి దొరికితే ఆరు నెలలు రద్దు చేస్తారు. మూడోసారి కూడా చిక్కితే కోర్టు ఆదేశాలతో శాశ్వతంగా రద్దుచేసే అవకాశం ఉంది. లైసెన్స్ రద్దు తర్వాత వాహనం నడిపితే



రూ. 5 వేల అపరాధ రుసుం విధిస్తారు.

**ఏడాదిలో 4300 లైసెన్స్‌లు రద్దు..**

జిల్లాలో గత ఏడాది కాలంలో సుమారు 4,300 మంది ద్విచక్ర వాహనదారుల లైసెన్స్‌లు రద్దు చేశారు. సగటున నెలకు 330 నుంచి 350 వరకు రవాణాశాఖ అధికారులు వీటిని సస్పెండ్ చేస్తున్నారు. సెక్షన్ 304ఎ కింద నమోదైన కేసుల్లో లైసెన్స్‌లు ఆటోమేటిగ్గా ఆరు నెలలు రద్దయిపోతున్నాయి. ఇలా జిల్లాకు చెందినవారు నెలకు 200 వరకు ఉంటే ఇతర జిల్లాలకు చెందినవారు 150 మంది ఉంటున్నారు.

**ఆలోచనా ధోరణి మారాలి..**

ద్విచక్రవాహనదారుల్లో చాలామంది శిరస్త్రాణం ధరించడం లేదు. కొంతమంది లైసెన్స్‌లు లేకుండానే నడుపుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కేసుల్లో చిక్కుకుంటే చాలా ఇబ్బందులు పడాలి. వాహనదారుల ఆలోచన మారాలి. మోటార్ వాహనాల చట్టంపై కళాశాలలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం.

శ్రీధర్, రవాణశాఖ ఉప కమిషనర్, కాకినాడ

## గుట్టలన్నీ గుటకాయ స్వాహా

పాయకరావుపేట: పోలవరం కాలువ గ్రావెల్ అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. పోలవరం ఎడమ కాలువ, రెవెన్యూ, పోలీసు శాఖల మౌనం వీరికి వరంగా మారింది. ఇక్కడ గుట్టలుగా ఉన్న గ్రావెల్‌ను రాత్రి, పగలు తేడాలేకంఉడా తరలిస్తూ సొమ్ములు వెనకేసుకుంటున్నారు. చీకటి పడిన తర్వాత నుంచి యథేచ్ఛగా వాహనాలు అధికారుల కళ్లముందే పరుగులు తీస్తున్నా ఎవరూ వాటిని అడ్డుకునే సాహసం చేయడం లేదు. పాయకరావుపేట, పి.ఎల్.పురం, సీతారాం పురం, నక్కపల్లి మండలం దేవవరం, ఎస్.రాయవరం మండలం పలు గ్రామాల పరిధిలో పోలవరం ఎడమ కాలువ పనులు తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ కాలువ ఏర్పాటుకు పాయకరావుపేట నుంచి మూడు మండలాల పరిధిలోని కొండలను తవ్వాల్సి వస్తోంది. దీంతో పెద్దఎత్తున గ్రావెల్ వస్తోంది. వీటికోసం ప్రత్యేకంగా డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి అక్కడే గ్రావెల్ వేస్తున్నారు.

ఒకప్పుడు ఇవన్నీ చిన్నసైజు కొండలను తలపించేవి. గ్రావెల్ మాఫియా కన్ను వీటిపై పడింది. అంతే అడ్డగోలు తరలింపునకు తెరలేపారు. లే అవుట్ల చదునుకు, ఇంటి నిర్మాణాలు, రోడ్ల పనులు చేపట్టే వారితో ఒప్పందాలు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ట్రాక్టర్లు, రాత్రిపూట లారీలపైనా పంపిస్తున్నారు. గ్రావెల్ వాహనాల్లో నింపేందుకు పొక్లెయిన్లను వినియోగిస్తున్నారు. పైసా పెట్టుబడి లేకుండానే రోజుకు లక్షలాది రూపాయలను వెనకేసుకుంటున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీలపై గ్రావెల్ తరలిస్తూ దందా కొనసాగిస్తున్నారు. వీటి రాకపోకలు అధికారుల ముందే సాగుతున్నా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనిపై సీఐ అప్పన్నను వివరణ కోరగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

## ఆపరేషన్ స్వర్ణ.. అవశ్యం

తిరుపతి : ప్రకృతి ప్రేమికులు, భక్తులు, సామాజిక స్పృహ కలిగిన వారిలో స్వర్ణముఖి ప్రక్షాళన ఆకాంక్ష దశాబ్దాల కిందటే ఆవిష్కృతమైంది. ఆచరణలో మాత్రం అదో కలగా మిగిలిపోగా.. ఇటీవల స్వర్ణముఖి అంశాన్ని తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆమోదం తెలపడంతో 'ఆపరేషన్ స్వర్ణ' తెరపైకి వచ్చింది.స్వర్ణముఖి ప్రక్షాళన చేయాలన్న ఆలోచన మినహా ఇప్పటి వరకు ఎలాంటి విధివిధానాలు రూపొందించలేదు. తుడాతోపాటు రెవెన్యూ, జలవనరులు, సర్వేశాఖలు సహా తొమ్మిది మంది సభ్యులతో కమిటీ నియమించారు.

పట్టణాలు, నగరాలు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో పరివాహక ప్రదేశాల్ని సుందరీకరించి పర్యాటక ప్రదేశాలుగా మార్చడం, ఇసుక రవాణాకు అవకాశం లేకుండా చేసి భూగర్భ నీటిమట్టం పెంచడం, కలుషితం కాకుండా పవిత్రతను కాపాడటం.వరదల నియంత్రణకు ఆనకట్టల బలోపేతం, చెక్‌డ్యాంలు, అడ్డుకట్టలతో నీటిని నిల్వచేసి భూమిలోకి ఇంకించడం.నదీ పరివాహక ప్రాంతమైన 3.10 లక్షల హెక్టార్లను సర్వేచేసి పరాధీనంలో ఉన్న 15 వేల ఎకరాలను స్వాధీనం చేసుకొని.. హద్దులు నిర్ణయించడం, బఫర్ జోన్‌లోని ఆక్రమణలు తొలగించి సంరక్షించడం. **ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఉపేక్షించం** భావితరాలకు నీటివనరుల కొరత లేకుండా చేయడం, ప్రకృతి విపత్తులు అధిగమించాలంటే స్వర్ణముఖి సంరక్షణే శరణ్యం. తుడా ప్రథమ ప్రాధాన్యం ఆపరేషన్ స్వర్ణకే. ఒక్కోచోట 60 అడుగులు, మరోచోటు 300 అడుగుల వెడల్పుతో ఉండాల్సిన నది కుంచించుకుపోయింది. భవన నిర్మాణ వ్యర్థాలు, పంటపొలాలు, కంచెలు వేసి సేద్యం చేస్తున్నారు.

# వామ్మో.. జ్వరాలు!



అనంతపురం : ఇటీవల కురిసిన వర్షాలు, వాతావరణంలో మార్పులు, తాగునీరు కలుషితం.. లోపించిన పారిశుధ్యం.. తదితర కారణాలతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇంట్లో ఒకరికి జలుబు, దగ్గు, జ్వరం వచ్చిందంటే వారంలోపు మిగతా వారు బాధితులు అవుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వరుస కడుతున్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు దోపిడీకి పాల్పడుతున్నాయి. జ్వరాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు సేవలు అందించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**'సర్వజన'లో తాకిడి**

అనంత ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీకి జలుబు, దగ్గు, జ్వరం, లక్షణాలున్న వారు సగటున 350 నుంచి 450 వరకు వస్తుండటం గమనార్హం. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ వార్డుల్లో 90 మందికిపైగా చికిత్స పొందుతున్నారు.

కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ లక్షణాలు ఉన్నాయని.. ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని చెబుతూ ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారు. దాతల నుంచి సేకరించే ప్లేటెలెట్స్‌కు సగటున రూ.11 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఎక్కించటానికి అదనంగా ఇవ్వాలి. ఆర్‌డీపీ ద్వారా ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తే ఐదు ప్యాకెట్‌లైనా రూ.1500 తీసుకుంటున్నారు. ఈక్రమంలో మొదటి విధానానికే మొగ్గుచూపుతూ రోగులపై భారం మోపుతున్నారు. సర్వజన వైద్యశాలలో చికిత్స పొందే రోగులకు సింగిల్ డోనర్, ఆర్‌డీపీ ప్లేట్‌లెట్స్ ఉచితంగానే అందిస్తారు.

కూడేరు మండలం కలగల్లు నుంచి జ్వరంతో భాగ్యమ్మ కుమారుడిని వెంటబెట్టుకొని సోమవారం సర్వజన వైద్యశాలకు వచ్చారు. వరుసలో నిల్చోలేక సొమ్మసిల్లిపోయారు. తరువాత ఐపీ విభాగానికి తరలించారు.

**తగిన చర్యలు తీసుకుంటాం : డాక్టర్ ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో, అనంతపురం**

కిట్‌ల ద్వారా పరీక్ష చేసి డెంగీ నిర్ధారించరాదు. ఎలిసా పరీక్షలో పాజిటివ్ వస్తేనే నిర్ధారించాలి. ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా పెడతాం. జ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. బీ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలున్న వారు సమీపంలో ఉండే విలేజ్‌హెల్త్ క్లినిక్ లేదంటే యూహెచ్‌సీ, పీహెచ్‌సీలకు వెళ్లి వైద్యులను సంప్రదించాలి.

**గత నెలలో చేసిన ఫీవర్ సర్వే ఇలా..**

వారానికి పైగా జ్వరం ఉన్న వారు : 3,783

వారంలోపు ఉన్న బాధితులు : 13,756

# ఈ కనికట్టు.. ఎవరు కనిపెట్టు!!




విశాఖపట్నం : మొదట... రూ.105 కోట్లతో ఏడు రోడ్లకు టెండర్లు పిలిచారు!

ఆ తర్వాత... వాటిని రద్దు చేశారు!

మళ్లీ.. అంచనాలు సవరించి రూ.120 కోట్లతో టెండర్లు పిలిచారు!

కొద్ది రోజుల తర్వాత... ఏమైందో ఏమోగాని పలు కారణాలు చూపించి మళ్లీ వాటిని రద్దు చేశారు!

తాజాగా.. అంచనాలను భారీగా పెంచేసి అదనంగా ఒక రోడ్డును కలిపి రూ.207 కోట్లతో కొత్త టెండర్ పిలిచారు!!

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లేందుకు అనువుగా విస్తరించ తలపెట్టిన రోడ్ల అంచనాలు, తెర వెనుక వ్యూహాలు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి.

ఓ గుత్తేదారుకు పనులు అప్పగించేందుకే ఇందంతా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు అనుకున్న సమయానికి రోడ్లు పూర్తికాకపోతే ట్రాఫిక్ ఇక్కట్లు తప్పవని జనం భయపడుతున్నారు.

అడుగైనా పడలేదు: విమానాశ్రయానికి అనుసంధానంగా విస్తరించే రోడ్ల పనులు మరింత ఆలస్యమయ్యేలా ఉన్నాయి. త్వరితగతిన అందుబాటులోకి తెచ్చి నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించాలనేది ఆలోచన. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పలు సమావేశాల్లో వీటి ఆవశ్యకతను ప్రస్తావించారు. ఇప్పటికే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉన్నా ఒక్క అడుగైనా ముందుకు పడ లేదు. టెండర్లను రద్దు చేసి మళ్లీ మళ్లీ పిలుస్తూ అంచనాలను ఊహించని స్థాయిలో పెంచడం గమనార్హం.

మొత్తం రోడ్లు : 8

కి.మీ. : 33.27

అంచనా : రూ.207 కోట్లు

గతంలో ఏడు రోడ్లను ప్రతిపాదించగా ఇప్పుడు అదనంగా ఒకటి జత చేశారు.

ఒకే ప్రాజెక్టు కింద: వాస్తవానికి వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, రహదారులు, భవనాలశాఖ ఆధ్వర్యంలో ఈ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. ప్రతి రోడ్డుకు వేర్వేరుగా టెండరు పిలవాలి. అయితే పురపాలకశాఖ ఈ రోడ్లన్నింటినీ ఒకే ప్రాజెక్టు కిందికి తీసుకొచ్చింది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో ఒకరికే అప్పగించే అవకాశాలున్నాయి.

# పేరు రైతులది.. సరకు వ్యాపారులది!



నర్సీపట్నం : నాతవరంలో కొంతమంది వ్యాపారులు జీడి పిక్కలు అనధికారికంగా నిల్వ చేశారన్న సమాచారంతో మార్కెటింగ్ శాఖ అధికారులు కొద్దిరోజుల కిందట రెండు గోదాముల్లో తనిఖీలు చేశారు. గోదాములు తెరించేందుకు సిబ్బంది యత్నించినప్పుడు కొందరు వచ్చి ఈ సరకు రైతులది, గిట్టుబాటు ధర లేక దాచుకున్నారు. మార్కెట్లో ధర ఉన్నప్పుడు అమ్ముకుంటారని చెప్పుకొచ్చారు. ఆ రైతుల చిరునామా కోసం ప్రయత్నించినా వీలుకాలేదు. గోదాములను సీజ్ చేస్తున్నామంటూ రెవెన్యూ, పోలీసు సిబ్బందిని పిలవగానే వ్యాపారులు పరుగున వచ్చి సరకు తమదేని అంగీకరించారు. వీరు సెస్ చెల్లించకుండా నిల్వ చేసినట్లు గుర్తించి అప్పటికప్పుడు బకాయిలన్నీ కట్టించారు. జీడి తోటల విస్తీర్ణం, దిగుబడి లెక్కలకు, మార్కెటింగ్ శాఖకు జమవుతున్న సెస్‌కు పొంతనే లేదు. నర్సీపట్నం పరిసర మండలాల్లో 10 నుంచి 15 మంది జీడిపిక్కల టోకు వ్యాపారులు ఉన్నారు. పంట దిగుబడి వచ్చినప్పుడు ధరల్లేవంటూ తక్కువకు రైతుల నుంచి కొనుగోలు చేసి గ్రామాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని నిల్వ చేస్తున్నారు. సీజన్ ముగిసిన తర్వాత ధర వచ్చినప్పుడు విక్రయిస్తున్నారు. దూర ప్రాంతాలకు ఎగుమతి చేసేటప్పుడు కొనుగోలు ధర కంటే తగ్గించి చూపుతున్నారు. తక్కువ మొత్తం చూపుతున్నారని తెలిసినా చెక్‌పోస్టు సిబ్బంది చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. సిబ్బంది కొరతను సాకుగా చూపి మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్లు, కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు చెక్‌పోస్టులపై నిఘా పెట్టడం లేదు. వ్యాపార అవసరాలకు తీసుకువెళ్లే సరకు విలువలో ఒక శాతం సొమ్మును మార్కెటింగ్ శాఖకు సెస్‌గా చెల్లించాల్సి ఉంది. పర్యవేక్షణ ఉంటే ఇప్పుడొస్తున్న సెస్‌కు రెట్టింపు వసూలయ్యే అవకాశం ఉంది.నోటీసులు ఇస్తున్నాం.. ఎవరెవరు జీడిపిక్కల వ్యాపారం చేస్తున్నారో ఆరా తీసి నోటీసులు ఇస్తున్నాం. వాణిజ్య పన్నుల శాఖకు చూపుతున్న టర్నోవర్‌కు అనుగుణంగా సెస్ చెల్లిస్తున్నారా, లేదా పరిశీలిస్తున్నాం. ఎవరైనా చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కొంతమంది బస్సుల్లో, పార్శిల్ సర్వీసు వాహనాల్లో తరలిస్తున్నారు. సెస్ రసీదు లేకుండా తరలింపు అనుమతించవద్దని ఆర్టీసీ డిపో మేనేజర్, పార్శిల్ సర్వీసుల యాజమానులను కోరుతున్నాం. సెస్ ఎగవేత లేకుండా పక్కాగా చర్యలు తీసుకుంటాం. గవిరెడ్డి వెంకటరమణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి, నర్సీపట్నం

## ప్రసవానికి వేదన

గూడూరు : జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవానికి వేదన పడాల్సి వస్తోంది. 58 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 203 ప్రసవాలు మాత్రమే జరిగినట్లు వైద్యశాఖ లెక్కలు తేల్చింది. వీటిలో 12 కేంద్రాల్లో ఒక్కటీ జరగలేదు. మరో 10 కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున మమ అన్పించారు. ప్రతి కేంద్రంలో నెలకు పది కాన్పులు జరగాలన్న నిబంధన ఉన్నా.. వైద్యులు, సిబ్బంది కొరత, పలు కేంద్రాల్లో అన్నీ ఉన్నా పట్టించుకోక పోవడంతో పేదలు ప్రైవేటు వైద్యశాలలకు తరలిపోతున్నారు.

15 శాతమే.. ప్రతి నెలా ఒక్కో కేంద్రంలో పది కాన్పులు చొప్పున జిల్లాలో మొత్తం నెలకు 580 జరగాలి. ఆ లెక్కన ఐదు నెలలకు 2,900 కాన్పులు జరగాల్సి ఉండగా 203 మాత్రమే చేశారు. 15 శాతం మాత్రమే లక్ష్యానికి చేరుకున్నారు.

**ఒక్కటీ జరగక..** కోటాల, చిట్టమూరు, గునపాటిపాలెం, తొగరాముడి, పెదపరియ, వి.వి.పాలెం, అత్తివరం, కమ్మపల్లి, దాసుకుప్పం, తడ, బాలిరెడ్డిపాలెం, జీకేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఐదు నెలలుగా ఒక్క కాన్పు చేయలేదు. ఇవన్నీ జిల్లాలో మారుమూల గ్రామాలు.



ఇక్కడ ఎక్కువగా నిరుపేదలే ఉంటారు.

**ఒక్కటితో సరి** చినతోట, ఈశ్వరవాక, దొరవారిసత్రం, గొట్టిప్రోలు, గొల్లపల్లి పుత్తూరు, మంగళం, ఏర్పేడు, రామాపురం, పరమేశ్వర మంగళం, పేర్నాడు కేంద్రాల్లో ఐదు నెలల్లో ఒక్కటి చొప్పున మాత్రమే చేసి మమ అన్పించారు.

**వైద్యులు, సిబ్బంది కొరత తీరుస్తాం..**

జిల్లాలో పీహెచ్‌సీల వారీగా పరిశీలించి కాన్పులు చేయని చోట పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నచోట త్వరలో భర్తీ చేస్తాం.

– బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో

## ఎర్ర మట్టి దోచుకెళ్తున్నారు..!

పాలసముద్రం : పాలసముద్రం ఎర్ర మట్టిపై తమిళనాడు గ్రావెల్ మాఫియా కన్నుపడింది. ఎంత అడ్డుపడినా ఎర్రమట్టిని చెన్నైకు తరలించడమే లక్ష్యంగా రెచ్చిపోతోంది. సోమవారం మండలంలోని వనదుర్గాపురం రెవెన్యూ కొండ భూమిలో అత్తిమాంజేరిపేట సమీపంలో ఉదయం సుమారు పదుల సంఖ్యలో భారీ టిప్పర్లు గ్రావెల్ కోసం వాలిపోయాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కలెక్టరు సుమిత్ కుమార్, ఎస్పీ మణికంతకు సమాచారమిచ్చారు. స్పందించిన అధికారులు ఎస్సై చిన్నరెడ్డప్ప, తహసీల్దారు అరుణకుమారికి సమాచారం అందించి అడ్డుకోవాలని తెలపడంతో దాడులు నిర్వహించారు. కొన్ని వాహనాలు మండలం దాటి వెళ్లిపోగా.. మిగిలిన వాహనాలను తనిఖీ చేసి సీజ్ చేశారు.

ఒక్కో టిప్పరులో 40 టన్నులుఒక్కో టిప్పరులో సుమారు 40 టన్నులకు పైగా మట్టిని తరలిస్తూ... బిల్లులో మాత్రం అంతకంటే తక్కువ చూపడం గమనార్హం. కొన్నింటికి సక్రమంగా బిల్లులు, వే-బిల్లులు లేకుండానే తమిళనాడుకు చెందిన టిప్పర్లు అక్రమ రవాణా సాగిస్తున్నాయి. తచ్చూరు-చిత్తూరు హైవే పేరిట పాలసముద్రం మండలంలో పర్యావరణాన్ని తమిళవాసులు కొల్లగొడుతున్నారని మండల వాసులు విమర్శిస్తున్నారు.

**అక్కడి చట్టాలకు భయపడి**

కూతవేటు దూరంలోనే తమిళనాడుకు చెందిన కొండలు, గుట్టలు ఉన్నా అక్కడ మట్టి తవ్వడం లేదని అక్కడి చట్టాలకు భయపడి మండలంలోని కొండలపై వాలిపోతున్నారని ప్రకృతి ప్రేమికులు వాపోతున్నారు.

**రెండు వాహనాల సీజ్**

సోమవారం గ్రావెల్ నింపుకొని వచ్చిన టిప్పర్లను ఎస్సై చిన్నరెడ్డప్ప, తహసీల్దారు అరుణకుమారి తనిఖీ చేశారు. ప్రతి వాహనానికి అనుమతి పత్రాలు లేకపోవడంతో రెండు వాహనాలను సీజ్ చేశారు.

**చర్యలు తీసుకుంటాం**

మట్టి తవ్వకాలకు అనుమతి తీసుకోవాలి. కొండలు, గుట్టల్లో తవ్వకాలకు మైన్స్ శాఖ నుంచి.. చెరువుల్లో అయితే ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు తప్పనిసరి. వాణిజ్యపరమైన పనులకు మట్టిని విక్రయించినా, అనుమతి లేకుండా మట్టిని తరలించినా సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.– సత్యనారాయణ, డీడీ, మైన్స్

## సౌరశక్తితో నీళ్లు తోడేలా..!

చిత్తూరు: ఉమ్మడి జిల్లాలో పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసి.. వ్యవసాయ బోర్లకు విద్యుత్తు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. ఎస్పీడీసీఎల్ పరిధిలో మొదటి దశలో 600 మెగావాట్లు ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 108 మెగావాట్ల ఉత్పత్తికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. కుప్పంలో రెస్కో పరిధిలో మరో 140 మెగావాట్ల విద్యుదుత్పత్తికి ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయి. యంత్రాంగం భూములు అప్పగించిన తర్వాత మిగిలిన పనులు మొదలు కానున్నాయి. పీఎం సూర్యఘర్ పథకంలోలా ప్రతీ బోరు వద్ద సౌర ఫలకాలు అమర్చడం కష్టం కాబట్టి ఒకే ప్రాంతంలో వీటిని అమర్చి సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. ఒక మెగావాట్‌కు 5 ఎకరాలు అవసరమని అధికారులు అంచనా వేశారు. కుప్పంలోనే రాష్ట్రంలో అత్యధికంగా..

రాష్ట్రవ్యాప్తంగా పీఎం కుసుమ్ మొదటి దశలో 1,200 మెగావాట్లు ఉత్పత్తికి ఆమోదం లభించింది. ఇందులో అత్యధికంగా కుప్పంలోనే 140 మెగావాట్ల ఉత్పత్తి కానుంది. కుప్పం రెస్కో డివిజన్ పరిధిలో 140 మెగావాట్లకు 600 ఎకరాలు అవసరం. ఇప్పటికే 400 ఎకరాలకు అవసరమైన భూమిని గుర్తించారు. గుడిపాల, బంగారుపాళ్యం, ఐరాల మండలాల్లో 80 మెగావాట్లకు 400 ఎకరాలు కావాలి. భూముల కోసం అన్వేషణ జరుగుతోంది.

**శ్రీకాళహస్తి, గూడూరు డివిజన్లలో..**

తిరుపతి జిల్లాలో 54 ఫీడర్ల కింద 6,213 పంప్‌సెట్లకు సౌర విద్యుత్తు అందించనున్నారు. ఇందుకు 142 ఎకరాలు అవసరం. శ్రీకాళహస్తి, గూడూరు రెవెన్యూ డివిజన్లలో భూమి కావాలని ఎస్పీడీసీఎల్ అధికారులు రెవెన్యూ అధికారులను కోరారు. ఇప్పటికే వారు ప్రభుత్వ భూమిని గుర్తించే పనిలో పడ్డారు. ఇది ఓ కొలిక్కి వస్తే కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీకి అధికారికంగా స్థలాన్ని అప్పగించనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ సౌర విద్యుత్తు ఉత్పత్తి కావాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించడంతో త్వరలోనే క్షేత్రస్థాయిలో పనులు మొదలుకానున్నాయి.

చురకలు



## ముంబై ఈవెంట్లో స్పెషల్ అట్రాక్షన్ గా కీర్తిసురేష్.. హైలెట్ అదే!

సౌత్ బ్యూటీ కీర్తి సురేష్ తాజాగా తన ట్రెండీ లుక్స్ తో మెయిన్ మీడియాలో హైలెట్ గా నిలిచింది. ముఖ్యంగా కీర్తి సురేష్ పాల్గొన ఒక ఈవెంట్లో అందరికంటే ఈమె సెంటరాఫ్ అట్రాక్షన్ గా నిలిచింది. మరి ఇంతకీ కీర్తి సురేష్ ఏ ఈవెంట్ కి వెళ్ళింది అంటే.. తాజాగా నీతా ముకేష్ అంబానీ కల్చరల్ సెంటర్లో నిర్వహించిన %దీజశ్రీస్త్రుుతీఱ% ఈవెంట్లో కీర్తి సురేష్ బ్లాక్ అండ్ వైట్ అవుట్ ఫిట్ తో అద్భుతమైన జువెలరీ మోడల్స్ ధరించి మెరిసింది. ఈ ఈవెంట్లో కీర్తి సురేష్ తో పాటు ప్రియాంక చోప్రా, సమంతా రుత్ ప్రభు, త్రిప్తి డిమ్రీ, తమన్నా భాటియా వంటి నటీమణులు సందడి చేశారు. అయితే ఈ ఈవెంట్లో అందరికంటే స్పెషల్ అట్రాక్షన్ గా హీరోయిన్ కీర్తి సురేష్ నిలిచింది. దానికి కారణం ఆమె తన మెడలో వేసుకున్న పాము లాంటి నెక్ చైన్.. రోమన్ హస్తకళను భారతీయ కళాత్మకతతో అందంగా కలగలిపి చేసే లగ్జరీ బ్రాండ్ సెర్పెంటి కలెక్షన్ ని ధరించి కీర్తి సురేష్ ఆ ఈవెంట్లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ప్రస్తుతం ఈ ఈవెంట్ కి సంబంధించిన ఫోటోలు,వీడియోలు నెట్టింట వైరల్ గా మారడంతో పాటు కీర్తి సురేష్ తన సోషల్ మీడియా ఖాతాలో



కూడా ఆ బ్లాక్ డ్రెస్ లో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలో అన్నింటికంటే కీర్తి సురేష్ ధరించిన సెర్పెంటి నెక్ చైన్ హైలెట్గా నిలుస్తోంది. అంతేకాదు ఈ ఫోటోలకు క్యాప్షన్ గా ..” ఇది నిన్నటి రాత్రి అంతా స్నేక్ ఇయర్ అంటూ క్యాప్షన్ ఇచ్చి %దీజశ్రీస్త్రుుతీఱ% స్ఫూర్తి, వారసత్వం భారతీయ వారసత్వంతో కలిసి పోవడాన్ని చూడడం నిజంగా అద్భుతంగా ఉంది” అంటూ రెడ్ హాట్ సింబల్ ని షేర్ చేసింది. ప్రస్తుతం కీర్తి సురేష్ పెట్టిన ఈ పోస్ట్ కి కొద్ది గంటల్లోనే వేలాది లైక్స్ వచ్చాయి. అయితే కీర్తి సురేష్ షేర్ చేసిన ఈ ఫోటోలపై విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. దానికి కారణం కీర్తి సురేష్ పెళ్లి తర్వాత తన లుక్ మొత్తం మారిపోయింది అనే రూమర్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆమె స్టైలిష్ డ్రెస్సులు వేసుకున్నప్పటికీ మొహంలో కొన్ని మార్పులు కొట్టచ్చినట్టు కనిపిస్తున్నాయని వాటిని ఎత్తిచూపుతున్నారు నెటిజన్స్. ఆమె ముఖం లో ముసలి ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయని కొంతమంది నెగటివ్ కామెంట్లు కూడా పెడుతున్నారు. కానీ కీర్తి సురేష్ అభిమానులు మాత్రం ఈ నెగటివ్ కామెంట్లను ఖండిస్తున్నారు.. కీర్తి సురేష్ సినిమాల విషయానికి వస్తే..ఈ ఏడాది కీర్తి సురేష్ చేతిలో నాలుగైదు సినిమాలు ఉన్నాయి. అలా ప్రస్తుతం ఈ హీరోయిన్ బాలీవుడ్ లో అక్క అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది డిసెంబర్ లో విడుదల కాబోతున్నట్టు తెలుస్తోంది. అలాగే తమిళంలో కన్నివేది, రివాల్వర్ రీటా అనే సినిమాలలో నటిస్తోంది. టాలీవుడ్ విషయానికి వస్తే..రెండు జళ్ళ సీత సినిమాలో కూడా నటిస్తోంది.అలా తెలుగు ,తమిళ, హిందీ భాషల్లో రాణిస్తూ పెళ్లి తర్వాత కూడా ఇండస్ట్రీలో యాక్టివ్ గా ఉంటోంది.

## జిమ్‌లో దివి వర్కౌట్

తెలుగు బిగ్ బాస్ సీజన్ 4తో గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ దివి. ఈ అమ్మడు అంతకు ముందు సినిమాల్లో నటించినా పెద్దగా గుర్తింపు దక్కించుకోలేక పోయింది. కానీ లక్కీగా బిగ్ బాస్ లో ఛాన్స్ దక్కించుకుని ఒక్కసారిగా కెరీర్ టర్న్ అయింది. బిగ్‌బాస్ లో ఫైనల్ వరకు లేకున్నా కూడా దివికి మంచి గుర్తింపు తెచ్చి పెట్టింది. బిగ్ బాస్ వల్ల సినిమాలు, సిరీస్‌లు దక్కించుకుంది. హీరోయిన్‌గా ఒకటి రెండు సినిమాలు చేసినా ఆశించిన స్థాయిలో గుర్తింపు తెచ్చుకోలేక పోయింది. కానీ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంది. అంతే కాకుండా హీరోయిన్స్ రేంజ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం



ద్వారా మిలియన్‌కి పైగా ఫాలోవర్స్‌ను దక్కించుకుంది.

**తెలుగు బిగ్ బాస్‌తో గుర్తింపు...** 2020లో హైదరాబాద్ టైమ్స్ లో మోస్ట్ డిజైరబుల్ వుమెన్‌గా నిలిచిన ఈ అమ్మడు సినిమాల్లో ఎంట్రీ ఇచ్చింది. తక్కువ సమయంలోనే పలు సినిమాల్లో చేసినా కూడా గుర్తింపు దక్కించుకోలేక పోయింది. హీరోయిన్‌గా సినిమాలు చేయాలి అని కలలు కన్న దివికి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. ఆ సమయంలో వచ్చిన బిగ్‌బాస్ ఆఫర్ ఆమెకు మంచి బూస్ట్ ఇచ్చింది. తెలుగు బిగ్ బాస్‌లో పాల్గొన్న వారిలో అతి కొద్ది మందికి మాత్రమే మంచి గుర్తింపు వచ్చింది. అందులో దివి ఒకరు అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా బిగ్ బాస్ చేసిన తర్వాత ఆఫర్లు వచ్చాయి. అంతే కాకుండా సోషల్ మీడియాలో లక్షల ఫాలోవర్స్‌ను తెచ్చి పెట్టింది. అందుకే ఈ అమ్మడికి బిగ్‌బాస్ ఖచ్చితంగా లైఫ్ ని ఇచ్చిందని, కెరీర్‌ను నిలబెట్టిందని అంటారు.

**దివి అందాల ఫోటో షూట్స్...** ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా మిలియన్‌కు పైగా ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ముద్దుగుమ్మ దివి తాజాగా మరోసారి అందమైన ఫోటోలను షేర్ చేసింది. జిమ్‌లో ఈ అమ్మడు వర్కౌట్ చేస్తున్న ఫోటోలను షేర్ చేసింది. టైట్ డ్రెస్‌లో దివి ఆకట్టుకుంటుంది. తన అందంతో ఎంతో మందిని కట్టి పడేసిన దివి ఎప్పటిలాగే ఈ వర్కౌట్ వీడియోలు, ఫోటోలతో వైరల్ అవుతోంది. తన అందమైన ఫోటోలు, వీడియోలతో ఈ అమ్మడు మెప్పించింది. అందాల దివి సోషల్ మీడియాలో ఆకట్టుకుంటూ ఉంది. టైట్ జెగ్గిన్ లో స్పోర్ట్స్ బ్రా ధరించి కన్నుల విందు చేసింది. ఆకట్టుకునే విధంగా ఈ అమ్మడు వర్కౌట్ ఫోటోలు ఉన్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి.




## బాస్ సాంగ్ ప్రోమో.. సోషల్ మీడియా షేక్..!



మెగా బాస్ మెగాస్టార్ చిరంజీవి లేటెస్ట్ సినిమా మన శంకర వరప్రసాద్ సంక్రాంతి రిలీజ్ కు రెడీ అవుతుంది. 2026 సంక్రాంతి కానుకగా ఈ సినిమా వస్తుంది. ఈ సినిమాలోని తొలి సాంగ్ ప్రోమో లేటెస్ట్ గా రిలీజ్ చేశారు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్న ఈ మూవీలో ఫస్ట్ సాంగ్ గా మీసాల పిల్ల ప్రోమో రిలీజైంది. ఈ ప్రోమో సాంగ్ కే ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. షైన్ స్క్రీన్ బ్యానర్ లో సాహు గారపాటి ఈ సినిమా నిర్మిస్తున్నారు.

**ఉదిత్ నారాయణ చిరంజీవి కాంబో..** మెగా బాస్ సాంగ్ వస్తే సోషల్ మీడియా షేక్ అవ్వాల్సిందే అనేలా మన శంకర వరప్రసాద్ సాంగ్ హంగామా చేస్తుంది. ఈ సాంగ్ లో మరో సర్ ప్రైజింగ్ థింగ్ ఏంటంటే స్టార్ సింగర్ ఉదిత్ నారాయణ ఈ సాంగ్ పాడారు. ఉదిత్ నారాయణ చిరంజీవి కాంబో సాంగ్స్ అన్ని సూపర్ హిట్ అయ్యాయి. ఉదిత్ నారాయణ పాటకి మెగాస్టార్ స్టెప్పులు మెగా ఫ్యాన్స్ కి మస్త్ జబర్దస్త్ జోష్ అందిస్తాయి. మన శంకర్ వరప్రసాద్ నుంచి రిలీజైన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇక ఈ సాంగ్ ప్రోమో కన్నా ముందు అనిల్ రావిపూడి ఉదిత్ నారాయణతో చేసిన ఒక కామెడీ వీడియో కూడా ఆడియన్స్ ని మెప్పిస్తుంది. సినిమా తీయడం ఒక ఎత్తైతే ప్రమోషన్స్ లో అనిల్ రావిపూడిని మించిన వారు లేరనేలా క్రేజ్ తెచ్చుకున్నాడు. మెగాస్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి భీంస్ సెసిరోలియో ఈ కాంబో కచ్చితంగా ఫ్యాన్స్ కి అదిరిపోయే ట్రీట్ ఇచ్చేలా ఉంది.

**చిరు బర్త్ డే శంకర వరప్రసాద్ టీజర్..** ఆమధ్య చిరు బర్త్ డే కోసం మన శంకర వరప్రసాద్ నుంచి ఫస్ట్ లుక్ టీజర్ వచ్చింది. అది చూసి మెగా ఫ్యాన్స్ అంతా సూపర్ అనేశారు. ఇక సంక్రాంతికి మెగాస్టార్ సినిమా తప్పకుండా సూపర్ హిట్ కొట్టేస్తుందని ఫ్యాన్స్ ఎగ్జైట్ అవుతున్నారు. ఈ సినిమాలో కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార హీరోయిన్ గా నటిస్తుంది. భోళా శంకర్ తర్వాత చిరంజీవి వశిష్ట డైరెక్షన్ లో విశ్వంభర సినిమా వస్తుంది. ఐతే ఆ తర్వాత సెట్స్ మీదకు వెళ్లిన మన శంకర వర ప్రసాద్ ముందు రిలీజ్ కాబోతుంది. ఈ సినిమాకు భీమ్స్ అందిస్తున్న మ్యూజిక్ కి ఇంప్రెస్ అయిన చిరంజీవి విశ్వంభర లో కూడా ఒక స్పెషల్ సాంగ్ చేసే అవకాశం ఇచ్చారని తెలుస్తుంది. మన శంకర వర ప్రసాద్ గారు సంక్రాంతికి వస్తే.. విశ్వంభర సమ్మర్ కి రిలీజ్ ప్లాన్ చేశారు.

## నిధి అగర్వాల్.. రాజాసాబ్ 'సర్ప్రైజ్' చూశారా?




టాలీవుడ్ లో టాలెంటెడ్, ప్రామిసింగ్ హీరోయిన్స్ లిస్టులో అందాల భామ నిధి అగర్వాల్ కచ్చితంగా ఉంటుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. సవ్యసాచి మూవీతో తెలుగు సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన అమ్మడు.. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. రీసెంట్ గా హరిహర వీరమల్లు మూవీతో సందడి చేసింది నిధి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లీడ్ రోల్ లో నటించిన వీరమల్లు కోసం ఐదేళ్లపాటు డేట్స్ కేటాయించింది. కానీ అనుకున్న స్థాయిలో రిజల్ట్ అందుకోని నిధి అగర్వాల్.. ఇప్పుడు రాజా సాబ్ పైనే తన ఆశలన్నీ పెట్టుకుంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ మారుతి కాంబోలో హారర్ కామెడీ డ్రామాగా ఆ మూవీ రెడీ అవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న రాజా సాబ్ లో ముగ్గురు హీరోయిన్స్ నటిస్తున్నారు. నిధి అగర్వాల్ తో పాటు రిద్ధి కుమార్, మాళవిక మోహనన్ సందడి చేయనున్నారు. ఆ ముగ్గురూ రీసెంట్ గా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ లో సందడి చేశారు. అందులో నిధి చాలా అందంగా కనిపించారు. ఇప్పుడు మేకర్స్ మరో సర్ప్రైజ్ ఇచ్చారు. నిధి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. రాజా సాబ్ టీమ్ అందమైన, ప్రతిభావంతులైన నిధి ప్రత్యేక రోజు జరుపుకుంటుందని తెలిపారు. ఆమె పాత్ర కథకు తగ్గ విధంగా క్రియేట్ చేశామని చెప్పారు. హ్యాపీ బర్త్ డే నిధి అంటూ రాసుకొచ్చారు. అయితే పోస్టర్ లో నిధి అగర్వాల్ చాలా కూల్ గా కనిపించారు. వైట్ కలర్ ఔట్ ఫిట్ లో ఉన్న ఆమె.. క్యాండిల్స్ దగ్గర నిల్చుని ప్రేయర్ చేస్తున్నారు. నవ్వుతూ.. ఏదో చూస్తూ.. హ్యాపీ మూడ్ లో ఉన్నట్లు కనిపిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో నిధి అగర్వాల్ కొత్త పోస్టర్ ఫుల్ వైరల్ గా మారింది. నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. పోస్టర్ అదిరిపోయిందని నెటిజన్లు, సినీ ప్రియులు, అభిమానులు కామెంట్స్ పెడుతున్నారు. సినిమాలో ఆమె రోల్ కు సరైన ప్రాధాన్యత ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోందని చెబుతున్నారు. మూవీ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచి.. ఆమెకు ఖాతాలో సరైన విజయం పడాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో పుట్టినరోజు శుభాకాంక్షలు కూడా చెబుతున్నారు.

## పరస్పర అవగాహనతో ఏదైనా సాధ్యమే.. 8గం.ల పని షిఫ్ట్‌పై రాణీజీ

దీపిక పదుకొనే ఎనిమిది గంటల పని షిఫ్ట్ నియమం కారణంగా బ్యాక్ టు బ్యాక్ రెండు భారీ చిత్రాల నుంచి ఎగ్జిట్ అయిన సంగతి తెలిసిందే. మేకర్స్ తో దీపికకు సింక్ కుదరలేదు. సందీప్ వంగా స్పిరిట్, నాగ్ అశ్విన్ కల్కి 2898ఏడి చిత్రాల నుంచి దీపిక వైదొలిగిన తర్వాత ఎనిమిది గంటల పనిదినంపై చాలా చర్చ సాగుతోంది. ఇప్పుడు 8గంటల పని షిఫ్ట్ గురించి రాణి ముఖర్జీ చెప్పిన విషయాలు ఆశ్చర్యపరిచాయి. తల్లి అయిన తర్వాత తాను కూడా 14 నెలల పసికందు ఉన్నప్పుడు షూటింగుకు వెళ్లానని రాణీజీ చెప్పారు. హిచ్ కి సినిమా షూటింగ్ చేస్తున్నప్పుడు తాను వేకువఝామునే నిదుర లేచి ప్రతిరోజూ 6గం.లకే ప్రయాణం ప్రారంభించేదానిని అని తెలిపారు. నా బిడ్డ అదిరకు 14 నెలల వయస్సు. నేను ఇంకా ఆమెకు తల్లిపాలు ఇస్తున్నాను.. కాబట్టి నేను పాలు తాగించి ఉదయం వెళ్ళాల్సి వచ్చింది. సిటీలో కాలేజ్ లో షూట్ కి అనుగుణంగా షెడ్యూల్ ప్లాన్ చేసాను. జుహులోని శివార్లలోని నా ఇంటి నుండి ఆ ప్రదేశానికి




వెళ్లడానికి ట్రాఫిక్ లో దాదాపు 2 గంటలు పడుతుంది. కాబట్టి నేను ఉదయం 6:30 గంటల లోపు పాలు పిండుకుని బిడ్డకు ఇచ్చేదానిని. ఆ తర్వాతే బయలుదేరి షూట్ చేసేదాన్ని. నా మొదటి షాట్ ఉదయం 8 గంటలకు ఉండేది. నేను 12:30-1 సమయానికి ప్రతిదీ ముగించేదానిని. నా యూనిట్, నా డైరెక్టర్, వారంతా చాలా ప్లాన్ చేసుకునేవారు. ఆ 6-7 గంటలు నేను నా షూట్‌ను పూర్తి చేసేదానిని. తిరిగి ట్రాఫిక్ ప్రారంభమయ్యే ముందే నేను 3 గంటలకు ఇంటికి చేరుకునేదానిని.. షూట్ అంతా ఇలాగే చేసాను! అని వివరించారు. బిడ్డ తల్లికి సౌకర్యవంతమైన గంటలు మేకర్స్ తో పరస్పర అవగాహనపై ఆధారపడి ఉంటాయని రాణి ముఖర్జీ చెప్పారు. అన్ని వృత్తులలో ఇది సర్వసాధారణం. నేను కొన్ని గంటలు మాత్రమే పని చేసిన చోట కూడా ఇలాగే చేశాను. నిర్మాత దీనికి అనుకూలంగా ఉంటే ఆ సినిమా చేయాలి. నిర్మాత దీనికి అనుకూలంగా లేకపోతే ఆ సినిమా చేయకూడదు. కాబట్టి ఇది కూడా ఒక ఎంపిక.. ఎవరూ ఎవరిపైనా ఏమీ బలవంతం చేయరు! అని రాణీ వ్యాఖ్యానించింది. తల్లి అయిన తర్వాత బిడ్డను పెంచేందుకు తాను సినిమాల నుంచి విరామం తీసుకున్నానని కూడా తెలిపింది. నటీమణులు వర్క్ - లైఫ్ సమతుల్యతను సాధించాలి. అయితే పరిశ్రమలో పురుషులు అలాగే చేయమని బలవంతం చేయరు.. అని తెలిపింది.

## హలగలి గ్లింప్స్.. ఇదేదో బాగుందే..!

కన్నడలో తన నటనతో ఆడియన్స్ ని ఇంప్రెస్ చేస్తూ వస్తున్నాడు ధనుంజయ్. పుష్ప సినిమాలో జాలి రెడ్డి రోల్ లో తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చాడు ధనుంజయ్. అఫ్కోర్స్ అది కాస్త నెగిటివ్ టచ్ ఉన్న రోల్ అయినా కూడా తన పాత్రలో అదరగొట్టాడు. ఐతే ఇప్పుడు అతను సోలో హీరోగా ఒక క్రేజీ అటెంప్ట్ చేస్తున్నాడు. అదే హలగలి. సుఖేష్ నాయక్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాను కళ్యాణ్ చక్రవర్తి దూళిపాళ్ల నిర్మిస్తున్నారు. హలగలి ఫస్ట్ గ్లింప్స్ తోనే సినిమా గ్రాండియర్ అప్పీల్ అనిపించింది.

**బిఫోర్ ఇండిపెండన్స్ కథతో హలగలి..** హలగలి బిఫోర్ ఇండిపెండన్స్ కథతో పీరియాడికల్ మూవీగా వస్తుంది. హలగలి అనే ఊరు మీద దండయాత్రకు వచ్చిన బ్రిటీషర్లకు అక్కడ నాయకుడు ఎలా బదులు చెప్పాడు అన్న కథతో ఈ సినిమా వస్తుంది. ముఖ్యంగా సినిమాలో యాక్షన్ బ్లాక్స్, పీరియాడికల్ అప్పీల్ అదిరిపోయాయి. ఇక ధనుంజయ్




కూడా తన రోల్ లో అదరగొట్టేలా ఉన్నాడు. తన శూళంతో బ్రిటీష్ జెండాను కూలగొట్టే షాట్ అదిరిపోయింది. పీరియాడికల్ స్టోరీ అది కూడా ఇండిపెండన్స్ ముందు కథ తో హలగలి వస్తుంది. ఈ సినిమా నుంచి వచ్చిన ఈ ఫస్ట్ లుక్ గ్లింప్స్ అయితే అంచనాలు పెంచింది. ఈమధ్య కాలంలో ఒక సినిమా అది ఏ భాష నుంచి వచ్చినా కూడా కథ, కథనం నచ్చేలా ఉంటే దాన్ని సూపర్ హిట్ చేస్తున్నారు. హలగలి కూడా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ అవుతుంది. ఈ సినిమా గ్లింప్స్ తోనే గట్టి మ్యాటర్ ఉన్నట్టే అనిపిస్తుంది.

**అంచనాలను పెంచిన ఫస్ట్ గ్లింప్స్...** హలగలితో ధనుంజయ్ ఒక గొప్ప ప్రయత్నమే చేస్తున్నారనిపిస్తుంది. సినిమా గ్లింప్స్ అయితే అంచనాలను పెంచింది. సినిమాటోగ్రఫీ, మ్యూజిక్ కూడా దానికి యాడ్ అయ్యాయి. సో హలగలి హంగామా ఇంప్రెస్ చేసేలానే ఉంది. సినిమా నుంచి మరిన్ని అప్డేట్స్ వస్తేనే కానీ ఇంకాస్త డెప్త్ ఏంటన్నది తెలుస్తుంది. పుష్ప తర్వాత తెలుగులో ఛాన్స్ లు వచ్చినా తను కోరే లీడ్ రోల్స్ కాదని లైట్ తీసుకున్నాడు ధనుంజయ్. అందుకే ఇప్పుడు ఈ హలగలి సినిమాతో తన మాస్ స్టామినా చూపించనునాడు. హగలై సినిమా కన్నడ నుంచి రాబోతున్న మరో భారీ సినిమా అవుతుంది. కె.జి.ఎఫ్ నుంచి కన్నడలో భారీ సినిమాల నిర్మాణం జరుగుతుంది. అదే దారిలో హలగలి వస్తుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536